thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 218 కరీంనగర్ బుధవారం, 15 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## బంగారు పలకలకు మాదే బాధ్యత టీడీబీ చైర్మన్

తిరువనంతపురం : కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో బంగారం అవకతవకల కేసు విచారణలో పూర్తి సహకారం అందిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) చైర్మన్ పీఎస్ ప్రశాంత్ అన్నారు. బోర్డు పూర్తి నిజాయితీ, పారదర్శకతతో వ్యవహరించిందని చెప్పారు. ప్రస్తుతం విగ్రహాల బంగారు పూత కోసం తీసుకున్న బంగారు పలకలకు బోర్డు పూర్తి బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. బంగారు పలకలను తీసుకునేముందు అవసరమైన అన్ని ప్రమాణాలు పాటించినట్టు వెల్లడించారు. 1998 నుంచి ఏం జరిగిందనే దానిపై విచారణ చేయాలన్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రిటైర్డ్ అయినా వదిలిపెట్టరాదని కోరారు. ప్రస్తుత బోర్డును అనుమానించడానికి ఎలాంటి కారణం లేదని, తగ్గిన బంగారాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.



# ఏందబ్బా గీ లొల్లి!

## రేవంత్‌కు తలనొప్పిగా తయారైన మంత్రులు

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు ముందు క్యాబినెట్ సహచరుల మధ్య వివాదాలు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పెద్ద తలనొప్పిగా తయారయ్యాయి. 24మంది మంత్రుల్లో ఆరుగురి మధ్య తీవ్రవిభేదాలు రోడ్డున పడ్డాయి. అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖకు ఆర్థిక, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పడటంలేదు. అలాగే గిరిజన, షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గనులు–కార్మిక ఉపాధికల్పన శాఖల మంత్రి గడ్డం వివేక్‌తో పడటంలేదు. మొన్నటివరకు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పడేదికాదు. ఇద్దరిమధ్య వివాదం తాత్కాలికంగా సద్దుమణిగిందని పార్టీవర్గాలు అంటున్నాయి. తాజాగా కొండాసురేఖకు గడ్డం వివేక్ వెంకటస్వామికి కూడా పడటంలేదు. పై మంత్రులంతా ఒకరిపై మరొకరు రేవంత్ కు అలాగే అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసుకుంటున్నారు. మంత్రులమధ్య వివాదాలు పెరిగి రోడ్డునపడటం స్ధానిక సంస్ధలు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికపైన ప్రభావం చూపుతుందా ? అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. నిజానికి ఇలాంటి ఆందోళన వారంరోజుల క్రితం వరకు చాలా ఉండేది. ఎందుకంటే స్ధానికసంస్ధల ఎన్నికల్లో పార్టీ గెలుపుపై మంత్రుల మధ్య కీచులాటల ప్రభావం తప్పకపడుతుందనే చాలామంది అనుకున్నారు. అయితే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇచ్చింది. కోర్టిచ్చిన స్టేకారణంగా స్ధానికసంస్ధల ఎన్నికలు ఎప్పుడు జరుగుతుందో ఎవరు చెప్పలేకపోతున్నారు. అందుకనే ఇపుడు అందరిదృష్టి జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక మీదపడింది. ఉపఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యేసమయనికి క్యాబినెట్ మంత్రుల మధ్య వివాదాలు తారాస్ధాయికి చేరుకున్నాయి. దీనిప్రభావం ఉపఎన్నిక గెలుపుపై పడుతుందనే ఆలోచనతోనే రేవంత్ మంత్రులందరినీ కూర్చోబెట్టి సోమవారం రాత్రి ఫుల్లుగా క్లాసు పీకినట్లు సమాచారం. మంత్రులమధ్య వివాదాలు పెరిగిపోతే అంతిమంగా తనప్రభుత్వం పనితీరుమీద పడుతుందని రేవంత్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇకనుండి మంత్రులు ఎవ్వరూ మీడియాతో వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని గట్టిగా ఆదేశించారు. మంత్రులమధ్య ఏమైనా అపోహలు, అనుమానాలుంటే తనతోనే చెప్పాలని చెప్పారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల కన్నా వివాదాలకే ఎక్కువగా ప్రచారం జరుగుతున్న విషయాన్ని రేవంత్ మంత్రులతో ప్రస్తావించారు. అధికారపార్టీకి ముఖ్యంగా మంత్రులపైన బాధ్యత ఎక్కువగా ఉంటుందని అందరికీ గుర్తుచేశారు. ఇకపై బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దు, క్రమశిక్షణను ఉల్లంఘించవద్దని కొందరు మంత్రులకు ఫుల్లుగా క్లాసులు పీకినట్లు పార్టీవర్గాల సమాచారం. మంత్రులంతా ఐకమత్యంతో పనిచేసి తొందరలో జరగబోయే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్ధిని గెలిపించాలని గట్టిగా ఆదేశించారు. కొద్దిరోజులుగా వరసు వివాదాల్లో కొందరు మంత్రులు చాలా బిజీఅయిపోయారు. కొండా సురేఖతో సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పడటంలేదు. సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా చేయాల్సిన రు. 150 కోట్ల అభివృద్ధి పనుల కాంట్రాక్టుల విషయంలో ఇద్దరిమధ్యా గొడవమొదలైంది. అభివృద్ధిపనుల టెండర్లన్నీ పొంగులేటి తన మద్దతుదారులతోనే చేయిస్తున్నట్లు సురేఖ ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఇక్కడ మంత్రి వాదన ఏమిటంటే దేవాదాయశాఖ తనది కాబట్టి ఈ శాఖలో జరిగే పనులన్నీ తాను చెప్పిన వాళ్ళద్వారానే జరగాలని. పొంగులేటి వాదన ఏమిటంటే అభివృద్ధిపనులకు నిధులను సమకూర్చేది తనఆర్ధికశాఖ కాబట్టి తాను చెప్పినవాళ్ళకే పనులు దక్కాలని. కాంట్రాక్టు వర్కుల కోసమే మంత్రులు ఇద్దరు గొడవపడుతున్నారన్న పాయింట్ జనాల్లోకి వెళ్ళిపోయింది. అలాగే మరో మంత్రి గడ్డం తనతో చెప్పకుండా అటవీశాఖపై సంబంధిత ఉన్నతాధికారులతో రివ్యూ చేయటం ఏమిటని కొండా సురేఖ ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేశారు. అయితే గడ్డం ఏమంటారంటే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తన నియోజకవర్గం బెల్లంపల్లిలోని అటవీశాఖ భూములపైన మాత్రమే రివ్యూ చేశానని, అటవీశాఖ పనితీరుపైన రివ్యూ చేయలేదని చెప్పారు. అయినా ఇద్దరి మధ్యా వివాదం కొనసాగుతునే ఉంది. ఇక మంత్రులు అడ్లూరి–పొన్నం–గడ్డం మధ్య గొడవ అందరికీ తెలిసిందే. తాను మాదిగ ఉపకులానికి చెందిన వాడిని కాబట్టే గడ్డం(మాల) అవమానిస్తున్నాడని అడ్లూరి ఆరోపించారు. అలాగే తనను పొన్నం ఐతో పోల్చటాన్ని అడ్లూరి తట్టుకోలేకపోయారు. ఈఇద్దరిపైనా సోషల్ మీడియా వేదికగా అడ్లూరి చేసిన ఆరోపణలు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. చివరకు అడ్లూరికి పొన్నం బహిరంగంగా సారిచెప్పి వివాదాన్ని ముగించారు. అలాగే తనను అడ్లూరి అపార్ధంచేసుకున్నట్లు గడ్డం బహిరంగంగా చెప్పి వివాదాన్ని ముగించే ప్రయత్నంచేశారు. ఒకసారి వివాదం మొదలైన తర్వాత అంత తొందరగా సమసిపోదన్న విషయం అందరికీ తెలిసిందే. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి నల్లమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి మధ్య ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆధిపత్య గొడవలు పెరిగిపోతున్నాయి. జిల్లాలో ఉన్నతాధికారుల బదిలీలు, పోస్టింగులు, నియోజకవర్గాల్లో అభివృద్ధిపనులు అన్నీ తాము చెప్పినట్లే జరగాలని ఇద్దరు ఎవరికివారు పట్టుబడుతున్నారు. దాంతో ఇద్దరిమధ్యా ఆధిపత్య గొడవలు పెరిగిపోతున్నాయి. ఇద్దరు మంత్రులు నల్గొండ జిల్లాకే చెందిన వారు అయినప్పటికీ కలిసి మాట్లాడుకునేది చాలా తక్కువే. ఆమధ్య ఒకసారి ఉత్తమ్ ఇంటికి కోమటిరెడ్డి వెళ్ళి మాట్లాడినా పరిస్ధితిలో పెద్దగా మార్పురాలేదని పార్టీవర్గాల సమాచారం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే కోమటిరెడ్డి, నల్లమాడ, పొంగులేటి రెడ్లు అయితే మిగిలిన కొండా, అడ్లూరి, గడ్డం, పొన్నం బీసీ, ఎస్సీ సామాజికవర్గం మంత్రులు. ఇపుడు తెలంగాణలో బీసీవాదన చాలాబలంగా వినబడుతున్నది. ఈనేపధ్యంలో బీసీ–ఎస్సీ, బీసీ–రెడ్డి సామాజికవర్గాలకు చెందిన మంత్రుల మధ్య గొడవలు పెరిగిపోతే దానిప్రభావం రాబోయే ఎన్నికలపైన ఎక్కడ పడతాయో అన్న ఆందోళన రేవంత్ లో పెరిగిపోతున్నట్లు అర్ధమవుతోంది. మరి మంత్రులకు రేవంత్ తీసుకున్న క్లాసు ఎంతవరకు పనిచేస్తుందో చూడాలి.




ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నైరుతి ఋతు పవనాలు తిరోగమన దిశలో కదులుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్ లో ఈ నెలాఖరు వరకు నైరుతి రుతుపవనాలు తిరోగమనం కారణంగా అక్కడక్కడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. నేడు ముఖ్యంగా రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు జంట నగరాల్లో శివారు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్సెస్ ఉన్నాయని తెలిపింది. రేపు, ఎల్లుండి మేడ్చల్ మలాజిగిరి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, హనుమకొండ, వరంగల్, జనగామ, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి, మహబూబాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

## మావోయిస్టు పార్టీ చరిత్రలో కలవరపడ్డ రోజు!

**-సిద్ధాంతం వదిలేసిన మల్లోజుల వేణగోపాల్ రావు,**
**-మరో సీసీ మెంబర్ రామ్ధర్,ఆశన్న సహా 60 మంది**
**-ఆయుధాలను పట్టుకొని పోలీసులు వద్దకు**
**-మహా సీఎం ఎదుట నేడో రేపో సరండర్ ప్రకటన**
**-దక్షణాది రాష్ట్రాలలో ప్రకంపనలు రేపుతున్న వార్త**



చురకలు,ఛీఫ్ రిపోర్టర్:హైదరాబాద్ మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం చరిత్ర లో ఒక్క సారి కలవర పడిన దినంగా అక్టోబర్ 14 నిలిచిపోతుంది.కారణం ఆపార్టీ చరిత్రలో 60 మంది పార్టీ నాయకులు ఆయుధాలతో ఇద్దరు సీసీ సభ్యులు కలిసి లొంగిపోయిన సంచలనం చోటుచేసుకుంది.సీపీఐ (మావోయిస్ట్) పొలిట్ బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ అలియాస్ సోను ఇవాళ మహారాష్ట్రలోని గడ్చిరోలి లో ఆయుధాలను వదిలిపెట్టి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లుగా మంగళ వారం మీడియా లో వార్తలు వచ్చాయి.మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతం మీద నమ్మకం లేని నాయకులు తుపాకీ సంస్కృతి వీడేందుకు సిద్ధంగా ఉన్నారని రుజువు చేశారు.పార్టీ నాయకులు ఎన్కౌంటర్ లో సీసీ ముఖ్యులు ఓ వైపు నేల కూలుతున్న సమయంలో ముక్కమిడిగా వనవాసం విడిచి పెట్టి మరీ తుపాకులతో బయటకు వచ్చిన తీరు విప్లవ రాజకీయాలకు షాక్ ఇచ్చింది.ఆయనతో పాటు మరో 60 మావోయిస్టు పార్టీ సభ్యులు కూడా అస్త్ర సన్యాసం చేసినట్లుగా తెలుస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పోలీసులు, భద్రతా బలగాలు నిర్వహిస్తున్న 'ఆపరేషన్ కగార్' ఇప్పటికే తీవ్ర రూపం దాల్చింది. వరుస ఎన్‌కౌంటర్లలో వందల కొద్దీ మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల మల్లోజుల వేణుగో పాల్ రావు అలియాస్ అభయ్ తాము ఆయుధాలు వదిలి పెట్టేందుకు సిద్ధమని ప్రతికా ప్రకటన చేశారు. నెల రోజులుగా జరుగుతున్న పరిణామాలను గమనించిన తర్వాత కూడా ఆయన నిర్ణయానికి ఛత్తీస్‌గఢ్‌తో సహా దేశంలోని ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని కేడర్లు కూడా మద్దతు తెలిపాయి. దీంతో ఇవాళ మల్లోజుల వేణుగోపాల్ రావు మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసుల ఎదుట ఆయుధాలను వదిలేసి లొంగిపోయారు. అయితే మల్లోజుల సహా పలువురు మావోయి స్టులు ఆయనను అనుసరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మహారాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి ఫడ్నవిస్ సమక్షంలో లొంగుబాటు చూపించే ప్రయత్నాలు ప్రారంభించారు.రేపు ఉదయం లేదా సాయంత్రం ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి మావోయిస్టుల సరాండార్ ను చూపించే అవకాశం ఉంది. మల్లోజుల వేణుగోపాల్ తెలంగాణ **(మిగతా 3వ పేజీలో)**




# బీసీ రిజర్వేషన్లపై...

# సుప్రీంకు తెలంగాణ ప్రభుత్వం..

## కాంగ్రెస్ సర్కార్ వ్యూహం ఫలించేనా!?

దిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (BC) రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు విధించిన స్టే ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని (సుప్రీంకోర్టు) ఆశ్రయించింది. హైకోర్టు స్టేను తొలగించాలని కోరుతూ దాదాపు 50 పేజీల సమగ్ర సమాచారంతో కూడిన పిటిషన్‌ను ప్రభుత్వం దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం పట్టుదలతో ఉంది.

ఈ పిటిషన్ గురువారం విచారణకు వచ్చే అవకాశం ఉంది, దీం తో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా బీసీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం తన వాదనలకు మద్దతుగా ప్రధానంగా 'ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ గవర్నమెంట్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును రిఫరెన్స్‌గా పేర్కొంది.

ఈ తీర్పు ఆధారంగానే రిజర్వేషన్లు 50% పరిమితిని మించకూడదనే నిబంధన అమలులో ఉంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకంగా ఈ తీర్పు రాజకీయ రిజర్వేషన్లకు అడ్డంకి కాదని సుప్రీంకోర్టుకు విన్నవించింది.

50% రిజర్వేషన్ల పరిమితి కేవలం విద్య మరియు ఉపాధి రంగాలకే పరిమితమని పిటిషన్‌లో స్పష్టంగా ప్రస్తావించింది. తెలంగాణలో బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని ప్రభుత్వం నొక్కి చెబుతోంది. రాష్ట్రంలోని బీసీ వర్గాలకు సామాజిక న్యాయం అందించే లక్ష్యంతోనే రిజర్వేషన్లు పెంచే నిర్ణయం తీసుకున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజర్వేషన్ల పెంపులో రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించామని, ఈ విషయంలో హైకోర్టు స్టే సరైనది కాదని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు స్థానిక సంస్థల ఎన్నికల భవితవ్యాన్ని, రాష్ట్రంలో రిజర్వేషన్ల విధానాన్ని నిర్ణయించనుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు త్వరగా జోక్యం చేసుకుని స్టే ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వం అభ్యర్థిస్తోంది. రాష్ట్రంలోని బీసీ వర్గాల ప్రయోజనాలను కాపాడటం కోసం బలమైన న్యాయవాదనలను వినిపించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అత్యున్నత న్యాయస్థానం నేడు లేదా త్వరలో ఈ కీలకమైన పిటిషన్‌పై విచారణ చేపట్టే అవకాశం ఉంది, ఇది రాష్ట్ర ఎన్నికల ప్రక్రియకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనుంది.

చురకలు





# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తర్వాత BRS ఖాళీ.. దొంగ ఓట్లు అనేది ఫేక్ ప్రచారం

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతోందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం (అక్టోబర్ 14) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగల్ రావు నగర్ డివిజన్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు వివేక్ వెంకట స్వామి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, అభ్యర్థి నవీన్ యాదవ్, పలు కార్పొరేషన్ల చైర్మన్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని డిసైడ్ అయ్యారని అన్నారు. మనం ఇప్పటికే 5 శాతం మెజార్టీలో ఉన్నామని.. ఇంకా 15 శాతం ముందుకు వెళ్లాలన్నారు. ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటలు పర్ఫెక్ట్ పని చేస్తే జూబ్లీహిల్స్?లో మనం విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. మనం అందరిని కలుపుకోని ముందుకు వెళ్లాలని.. చిన్న చిన్న సమస్యలకు బాధపడొద్దని సూచించారు. మేము ముగ్గురం ఇంచార్జ్ మంత్రులం ఉన్నాం.. ఇంకొందరు మంత్రులు కూడా వస్తారని చెప్పారు. గతంలో సారు కారు 16 అన్నారు.. కానీ ఏమైందో మీకందరికి తెలుసు.. ఇక జూబ్లీహిల్స్?లో కాంగ్రెస్ గెలిస్తే ఆ తర్వాత బీఆర్ఎస్ మొత్తమే కనిపించదని అన్నారు. రాష్ట్రంలో గతంలో రావణాసురిడి పాలన ఉండేదని.. ఇప్పుడు ప్రజా పాలన నడుస్తోందన్నారు. జూబ్లీహిల్స్?లో దొంగ ఓట్లు లేవని.. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఫైర్ అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి సునీత కృత్రిమ ఏడుపులు ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏడవాలని కేటీఆర్, హరీష్ సునీతను రెచ్చగొడుతున్నారని.. రాజకీయ వేదికలపై ఏడవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సునీతపై మాకు సానుభూతి ఉంది కానీ కేటీఆర్, హరీష్ తమ రాజకీయాల కోసం ఆమెను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలో దెబ్బ కొడితే బీఆర్ఎస్?కు గువ్వ గుయ్యుమన్నది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అదే రిపీట్ అవుతుందని జోస్యం చెప్పారు. దొంగ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి అవసరం లేదని.. బీఆర్ఎస్ పార్టీనే తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# సూర్యాపేట ఇన్‌చార్జ్ కోసం కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు.. గాంధీభవన్‌కు తాకిన అలజడి

హైదరాబాద్ : కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం తర్వాత సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్ పదవి కోసం కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు మొదలైంది. రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. DCC అధ్యక్ష ఎన్నికల కోసం AICC పరిశీలకులు తెలంగాణలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వోత్తమ్ రెడ్డిని సూర్యాపేట ఇన్‌చార్జ్‌గా ప్రకటించాలని కోరుతూ రెండు రోజుల క్రితం గాంధీభవన్‌లో ఆయన అనుచరులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇటీవల రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే ఇవాళ సర్వోత్తమ్ రెడ్డి వర్గానికి పోటీగా పటేల్ రమేష్ రెడ్డి అనుచరుల గాంధీభవన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో చివరి నిముషం వరకు సూర్యాపేట టికెట్ కోసం ప్రయత్నించినా పటేల్ రమేష్ రెడ్డికి దక్కలేదు.

ఆయన స్థానంలో రాంరెడ్డి దామోదర్ రెడ్డికి టికెట్ దక్కినా ఆయన గెలవలేకపోయారు. రెండుసార్లు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను త్యాగం చేసిన.. పటేల్ రమేష్ రెడ్డికి ఇన్‌చార్జ్ ఇవ్వాలని అనుచరులు గాంధీభవన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సూర్యాపేట ఇన్‌చార్జ్‌గా ఎవరిని నియమిస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది.

# ప్రభాకర్ రావు ఐ క్లౌడ్ పాస్వర్డ్ రీసెట్ చేయండి..

## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో ట్విస్ట్.. సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు



న్యూఢిల్లీ , అక్టోబర్ 14: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుకుసంబంధించి సుప్రీం కోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు ఐ క్లౌడ్ పాస్వర్డ్ రీసెట్ చేయాలని సుప్రీం ఆదేశించింది. అలాగే ప్రభాకర్ రావుకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ పొడిగించిన న్యాయస్థానం.. తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఈరోజు (మంగళవారం) సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీవీ నాగరత్నం, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినించారు. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు కేసు దర్యాప్తుకు సహకరించడం లేదని.. ఆయనను కస్టోడియల్ ఇంటరాగేషన్‌కు అప్పగించాలని కోర్టుకు తెలిపారు. కస్టోడియల్ ఇంటరాగేషన్ ద్వారానే నిజాలు బయటికి వస్తాయన్నారు. డిజిటల్ డివైసెస్‌లో డాటా ఫార్మా చేశారని.. ఐ ఫోన్, ఐ క్లౌడ్ పాస్వర్డ్ ఇవ్వడం లేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం మారగానే హార్డ్ డిస్కులో డేటా ధ్వంసం చేసినట్లు న్యాయవాదులు తెలియజేశారు. కొత్తగా 50 హార్డ్ డిస్కులు అక్కడ పెట్టారన్నారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, జడ్జిలు, బిల్డర్లు, వ్యాపారుల ఫోన్లో టాప్ చేశారని సుప్రీంలో వాదనలు వినిపించారు. నక్సలైట్ల పేరుతో ఈ కార్యక్రమాలన్నీ చేసినట్లు తెలిపారు. డేటా మొత్తం డిలీట్ చేసి డివైసెస్ తమకు ఇచ్చారని తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వాదించారు. అలాగే.. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు తరఫున న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు డివైస్ రీసెట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. ఆయనను 11సార్లు పిలిపించి 80 గంటల పాటు విచారణ జరిపినట్లు తెలిపారు. డేటాను ప్రభాకర్ డిలీట్ చేయలేదని డిపార్ట్మెంట్ డిలీట్ చేసిందని చెప్పారు. ప్రభాకర్ డిపార్ట్‌మెంట్‌లో ఒకరు కాదని..ఆయన్ను పెడతానని ముఖ్యమంత్రి బాహటంగా బెదిరించారంటూ అంటూ లాయర్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న సుప్రీం కోర్టు... ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో ప్రభాకర్ రావు ఐ క్లౌడ్ పాస్వర్డ్ రీసెట్ చేయాలి ఆదేశిస్తూ.. ప్రభాకర్ రావుకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణను పొడిగించింది. ఈకేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు నవంబర్ 18న మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది.




# జూబ్లీహిల్స్ లో ఫేక్ ఓట్లు.. ఒక్క ఇంట్లో 27 ఓట్లు..!

హైదరాబాద్, అక్టోబర్ 14: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బోగస్ ఓట్లు కలకలం రేపుతున్నాయి. వెంగళరావు నగర్‌లో నకిలీ ఓట్లు బయటపడ్డాయి. బూత్ నంబర్ 125లో 27 బోగస్ ఓట్లు ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ అధికారులు గుర్తించారు.

ఒకే ఇంట్లో ఒకే వ్యక్తికి 3 ఓట్లు ఉండడంతో బోగస్ ఓట్ల బాగోతం బయటపడింది. దీంతో ఎన్నికల అధికారులకు ఇంటి యజమాని ఫిర్యాదు చేశాడు. తనకు తెలియకుండానే తన ఇంటి నెంబర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు ఓటర్ కార్డులు పొందారని ఇంటి యజమాని చెబుతున్నాడు. ఇంటి ఓనర్ ఫిర్యాదుతో వెంటనే ఎలక్షన్ కమిషన్ అధికారులు విచారణ చేపట్టారు. బోగస్ ఓట్లు బయటపడటంతో వెంగళరావు నగర్ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లు చోరీ అవుతున్నాయంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు. కాగా.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో దొంగ ఓట్లు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొన్న యూసఫ్‌గూడలో దొంగ ఓట్లు బయటపడగా.. తాజాగా వెంగళరావు నగర్‌లో బోగస్ ఓట్ల బాగోతం బయటకొచ్చింది. వెంగళరావు నగర్‌లో ఒకే ఇంట్లో 27 ఓట్లు బయటపడగా.. వారిలో ఒక ఓటరు మాత్రమే ఆ ఇంట్లో నివసిస్తున్నాడు. మిగిలిన వారు ఎవరో కూడా తమకు తెలియదని యజమాని చెబుతున్నాడు.

ఓనర్ భార్య మరణించడంతో ఆ ఇంట్లో యజమాని ఒక్కరే నివాసం ఉంటున్నాడు. ఓటర్ల జాబితాలో ఉన్న వారు ఎవరూ కూడా తమకు సంబంధించిన వారు కాదని, వాళ్లు ఎవరో కూడా తనకు తెలియదని ఇంటి యజమాని చెబుతున్నాడు. ఈ క్రమంలో దొంగ ఓట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై ఎన్నికల అధికారులు విచారణ చేపట్టారు.

# ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం: మీనాక్షి నటరాజన్



హైదరాబాద్: సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పనిచేస్తున్నారని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు.

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో వెంగళరావునగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. ఎన్నికల చివరి రోజు వరకు కష్టపడాలని కార్యకర్తలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# మద్యం టెండర్ల వేళ.. మునుగోడులో కొత్త రూల్స్

తెలంగాణలో మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ జరుగుతున్న వేళ.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడులో కొత్త నిబంధనలు పెట్టారు. తాను గెలవగానే నియోజకవర్గంలో బెల్ట్ షాపులు లేకుండా చేశానన్నారు. నియోజకవర్గంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు పలు సూచనలు పాటించాలన్నారు. ఊరి బయట మాత్రమే మద్యం దుకాణాలు పెట్టుకోవాలని, సిట్టింగ్?లేకుండా చూసుకోవాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయించొద్దన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తన ఉద్దేశం కాదని, యువత మద్యానికి బానిసలు కాకూడదన్నదే తన ఆరాటమన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు పార్టీ నాయకులు నల్గొండ ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

# కారుకు పంక్చరై.. పనికి రాకుండా పోయింది..




హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ గొప్ప లీడర్ కాదు.. తప్పు లీడర్ అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ఇవాళ(మంగళవారం) ఆమె మాట్లాడారు.. అబద్ధాలకు అంబాసిడర్ కేటీఆర్ అని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2023 ఎన్నికల్లో కూడా ఆ ఓట్లు ఉన్నాయని ఆమె తెలిపారు. అవి దొంగ ఓట్లయితే దానికి కారణం మీరే అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గతంలో నచ్చని ఓట్లను తీసేసిన చరిత్ర బీఆర్ఎస్ ది అని మంత్రి సీతక్క ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు అని విమర్శించారు. ప్రస్తుతం కారుకు పంక్చర్ అయింది. పనికి రాకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నది కాంగ్రెస్. ఇళ్లు ఇస్తామని మోసం చేసింది బీఆర్ఎస్ అని అన్నారు. బీసీ జీవో ఆగినందుకు బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోండి. మంత్రులం అందరం కలిసే ఉన్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



# ఎమ్మెల్యే పోచారం చొరవతో.. విద్యార్థినులకు ప్రత్యేక బస్సు సర్వీసు

కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థినుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి. మంగళవారం ఆయన తిమ్మాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి అభివృద్ధి పనుల నిమిత్తం బయలుదేరారు. మార్గ మధ్యంలో దుర్కి శివారులో రహదారిపై బాన్సువాడ వెళ్లాల్సిన బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థినులను గమనించారు. వారిని ప్రశ్నించగా.. బస్సులు సమయానికి రావట్లేదు, వచ్చిన వాటిల్లో ఖాళీ ఉండక ఆపట్లేదని విద్యార్థినులు తెలిపారు. దీంతో కళాశాలకు వెళ్లేందుకు ఆలస్యమవుతోందని వారు వాపోయారు. వెంటనే స్పందించిన పోచారం.. బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థినుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసు నడపాలని ఆదేశించారు.



# హైదరాబాద్‌లో రూ.1.30లక్షలు దాటిన పసిడి


హైదరాబాద్: దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. మంగళవారం 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1,30,850కి చేరింది. 22 క్యారెట్ల ధర రూ.1,17,780గా ఉంది. ఇతర తెలుగు రాష్ట్రాల్లోనూ పసిడి దాదాపు రూ.1.30లక్షలకు చేరువలోనే ఉంది. అటు వెండి ధర భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది.

హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. **వెండి పథకాల్లోకి కొత్త పెట్టుబడులు వద్దు...** అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భారత ఆర్థిక పునాది... గ్రామీణ మహిళల కృషి

## సహనానికి ప్రతీక... సాధికారతకు చిహ్నం - గ్రామీణ మహిళ

## అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం - అక్టోబర్ 15




ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రపంచ ఆహార భద్రత, పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఆర్థికాభివృద్ధి వంటి రంగాలలో గ్రామీణ మహిళలు పోషిస్తున్న కీలకమైన పాత్రను గుర్తించి వారికి గౌరవం తెలపడం. గ్రామీణ మహిళలు ప్రపంచ సమాజం నిర్మాణానికి కనిపించని స్తంభాలు. వారి కష్టపడి చేసిన శ్రమ, సహన శక్తి, అంకితభావం వల్లే అనేక కుటుంబాలు, సమాజాలు, దేశాల ఆర్థిక వ్యవస్థలు బలపడుతున్నాయి. ఈ దినోత్సవ ఆలోచన 1995లో బీజింగ్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి నాల్గవ మహిళా సమ్మేళనంలో పుట్టింది. అక్కడ గ్రామీణ మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదని, వారిపై సామాజిక–ఆర్థిక వివక్ష కొనసాగుతోందని గమనించిన పౌర సమాజ సంస్థలు "గ్రామీణ మహిళల కోసం ప్రత్యేక దినోత్సవం" ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. ఆ ఆలోచనను ఐక్యరాజ్య సమితి సమర్థించి, 2007 డిసెంబర్ 18న తీర్మానం 62/136 ద్వారా అక్టోబర్ 15ను అధికారికంగా "అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం"గా ప్రకటించింది. 2008 నుండి ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జరుపు కుంటున్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 22 శాతం గ్రామీణ మహిళలే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న శ్రామిక శక్తిలో సుమారు 40 శాతం మహిళలే ఉన్నారు. యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం ప్రపంచ ఆహార ఉత్పత్తిలో మహిళల వాటా సుమారు 43 శాతం. వారు విత్తనం వేసే దశ నుంచి పంటను మార్కెట్‌కు చేరవేసే వరకు ప్రతి దశలోనూ కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. భారతదేశ పరిస్థితిని పరిశీలిస్తే, గ్రామీణ మహిళల జీవన గాథ అనేది శ్రమ, సహనము, అంకిత భావము యొక్క ప్రతిరూపం. దేశ జనాభాలో సగానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నవారు, వారిలో సుమారు 80 శాతం మహిళలు వ్యవసాయం, పశుపోషణ, గృహ పరిశ్రమలు, కూలి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. భారత వ్యవసాయ రంగంలో మహిళల ప్రత్యక్ష శ్రామిక భాగస్వామ్యం 65 నుంచి 70 శాతం వరకు ఉంటుందని అంచనా. అయినప్పటికీ భూమి యాజమాన్యం విషయంలో మహిళల హక్కులు చాలా తక్కువ. దేశవ్యాప్తంగా రైతు కుటుంబాల్లో భూమి యాజమాన్యం ఉన్న మహిళల శాతం కేవలం 13 శాతం మాత్రమే. అంటే, భూమిపై శ్రమించే మహిళకు యాజమాన్య హక్కు లేకపోవడం, ఆమె సామాజిక–ఆర్థిక స్థితిని బలహీన పరుస్తోంది. 1990ల చివర్లో ప్రారంభమైన స్వయం సహాయక బృందాల ఉద్యమం గ్రామీణ మహిళల జీవితంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రారంభమైన DWCRA పథకం ఆధారంగా ఏర్పడిన ఈ బృందాలు దేశ వ్యాప్తంగా మహిళల సాధికారతకు దారి తీశాయి. ప్రస్తుతం నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా 80 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. వీటిలో 1.2 కోట్లకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందాల ద్వారా 14 కోట్లకు పైగా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రతి బృందం సగటున రూ. 1.5 లక్షల వరకు లావాదేవీలు నిర్వహిస్తోంది. ఈ బృందాల ద్వారా మహిళలు పొదుపు, ఆర్థిక అవగాహన, చిన్న వ్యాపార నిర్వహణా నైపుణ్యాలు, సమూహ శక్తి పెంపొందాయి. ఈ స్వయం సహాయక బృందాలు గ్రామీణ మహిళల జీవితానికి కొత్త దిశను చూపిన సామాజిక ఆర్థిక విప్లవం అని చెప్పవచ్చు. అయినప్పటికీ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. భూమి యాజమాన్యం లోపం, తక్కువ వేతనాలు, విద్యా%–%ఆరోగ్య సదుపాయాల కొరత, సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగా ఉండడం, సామాజిక బంధనాలు, కుటుంబ ఆర్థిక నియంత్రణ వ్యవస్థల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వంటి అంశాలు వారి పురోగతికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. కుటుంబంలోనూ సమాజంలోనూ నిర్ణయాధికార వ్యవస్థల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అత్యవసరమైంది. వాతావరణ మార్పులు కూడా గ్రామీణ మహిళల జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వర్షాభావం, భూసార క్షీణత, నీటి కొరత, వనరుల తగ్గుదల వంటి పరిస్థితుల్లో కూడా వారు కుటుంబ స్థిరత్వాన్ని కాపాడుతూ వ్యవసాయం, పశుపోషణ, నీటి సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారు సహజ వనరుల సంరక్షకులు, పర్యావరణ రక్షకులు, జీవన ధార యొక్క కాపాడు వారిగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం యునైటెడ్ నేషన్స్, FAO, IFAD, UN Women వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట అంశంతో నిర్వహిస్తాయి. 2025 సంవత్సరానికి ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన థీమ్..."సుస్థిర భవిష్యత్తు కోసం గ్రామీణ మహిళ శక్తి". ఈ అంశం ద్వారా మహిళల పర్యావరణ అవగాహన, సుస్థిర వ్యవసాయ విధానాలు, నీటి వనరుల సంరక్షణ, వాతావరణ మార్పులకు ప్రతిఘటన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. FAO నివేదిక ప్రకారం మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు కల్పిస్తే ప్రపంచ ఆహార లోపం 17 శాతం వరకు తగ్గవచ్చని అంచనా. ఇది మహిళా సాధికారత ఎంతమాత్రం ఆర్థికమే కాకుండా ప్రపంచ ఆహార భద్రతకు కూడా దోహద పడుతుందో స్పష్టంగా తెలియ జేస్తుంది. గ్రామీణ మహిళా శక్తివంతీకరణ అంటే కేవలం లింగ సమానత్వం కోసం చేసే పోరాటం కాదుబీ అది ప్రపంచ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లే సార్వత్రిక ఉద్యమం. గ్రామీణ మహిళ ఒక నిశ్శబ్ద విప్లవ కారిణి. ఆమె చేతుల్లోనే కుటుంబ స్థిరత్వం, సమాజ అభివృద్ధి, దేశ సమృద్ధి నిక్షిప్తమై ఉంది. ఆమె శ్రమతో పంట పండుతుంది, ఆమె సహనంతో కుటుంబం నిలుస్తుంది, ఆమె జ్ఞానంతో సమాజం ముందుకు సాగుతుంది. "అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం" మనకు గుర్తు చేస్తుంది ఆమెను గౌరవించడం అంటే దేశాన్ని గౌరవించడం, ఆమెను శక్తివంతం చేయడం అంటే ప్రపంచాన్ని సుస్థిరంగా మార్చడం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**

# "దృష్టి లేనివారిని కాదు దృష్టి లేని సమాజాన్ని మార్చుకుందాం"

# కళ్లకు కాదు మనసుకు వెలుగు కావాలి

### అంతర్జాతీయ అంధుల ఆసరా దినం - దృష్టి లేనివారికి దిశ చూపే సమాజం - అక్టోబర్ 15...అంతర్జాతీయ అంధుల ఆసరా దినం




ప్రపంచ మానవ సమాజం యొక్క నైతికత, మానవత, సాంస్కృతిక విలువలు ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేసేది సమాజం దివ్యాంగుల పట్ల చూపించే దృక్పథం ద్వారానే. చూపు లేని వారికి దిశ చూపించే, చీకటిలో వెలుగులు నింపే మనసు కలిగి ఉండడం మానవ సమాజం యొక్క పరిపక్వతకు గుర్తు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీని ప్రపంచ వ్యాప్తంగా "అంతర్జాతీయ అంధుల ఆసరా దినం"గా జరుపుకోవడం కూడా ఈ సార్థకమైన అవగాహనకు ప్రతీక. ఈ దినం కేవలం దృష్టి లేనివారిని స్మరించుకునే కార్యక్రమం మాత్రమే కాదు, సమాజం తన ఆలోచనా దిశను పరిశీలించుకునే ఆత్మ పరిశీలన దినం కూడా. దృష్టి లోప వ్యక్తుల పట్ల అవగాహన, గౌరవం, సమాన హక్కులు కల్పించే కట్టుబాటు మనందరిలో పెరగడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ దినం పుట్టుకకు ప్రేరణగా నిలిచినది ఫ్రాన్స్‌కు చెందిన అంధ విద్యావేత్త లూయిూ బ్రెయిల్. 1809లో జన్మించిన అతను బాల్యంలో జరిగిన ప్రమాదం వల్ల చూపును కోల్పోయినా, తన జీవితాన్ని చీకటిలో గడపలేదుబీ ఇతరులకు వెలుగు పంచే మార్గం సృష్టించాడు. 1824లో ఆయన రూపొందించిన "బ్రెయిల్ లిపి" ప్రపంచ వ్యాప్తంగా అంధుల విద్యకు కొత్త యుగాన్ని తెచ్చింది. ఈ లిపి ద్వారా అంధులు చదవడం, రాయడం, ఆలోచించడం, సృజన చేయడం సాధ్యమైంది. మానవ జాతికి ఆయన చేసిన ఈ విశిష్ట కృషిని స్మరించేందుకు అక్టోబర్ 15ను అంతర్జాతీయ అంధుల దినంగా గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికల ప్రకారం, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 4.3 కోట్ల మంది పూర్తిగా దృష్టి కోల్పోయినవారు, మరో 29 కోట్ల మంది కొంతమేర దృష్టి లోపంతో బాధ పడుతున్న వారు ఉన్నారు. వీరిలో 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే నివసిస్తున్నారు. భారతదేశంలో దృష్టి లోపితుల సంఖ్య సుమారు 1.2 కోట్లకు పైగాగా నమోదైంది. వీరిలో సగానికి పైగా మంది పేదరికం, పోషకాహార లోపం, కంటి సంరక్షణలో నిర్లక్ష్యం, సమయానికి చికిత్స లభించకపోవడం వల్లే చూపును కోల్పోయారు. అంధత్వం అనేది కేవలం శారీరక లోపం కాదుబీ అది సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనానికి ప్రతిబింబం. కాబట్టి సమాజం దీనిని కరుణతో కాదు, బాధ్యతతో చూడాలి. దృష్టి లేని వ్యక్తికి తెల్ల బాస్టన్ అనేది కేవలం దారితప్పకుండా నడిపే పరికరం మాత్రమే కాదుబీ అది ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్యానికి, సమాజంలో తన స్థానాన్ని నిరూపించుకునే గుర్తుకి చిహ్నం. అందుకే ఈ దినాన్ని "వైట్ కేన్ సేఫ్టీ డే"గా కూడా పిలుస్తారు. ఆ తెల్ల కర్రలో అంధుల ఆత్మవిశ్వాసం దాగి ఉందిబీ దానిని గౌరవించడం అంటే వారి వ్యక్తిత్వాన్ని గౌరవించడం. భారతదేశం స్వాతంత్ర్యం తర్వాత అంధుల విద్య, ఉపాధి, పునరావాసం కోసం ఎన్నో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 1947లో స్థాపితమైన "నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్" అంధ విద్యార్థుల విద్యా హక్కుల కోసం కీలక పాత్ర పోషించింది. అనంతరం "బ్రెయిల్ ప్రెస్", "బ్లైండ్ స్కూల్స్", "వృత్తి శిక్షణా కేంద్రాలు", "బ్రెయిల్ గ్రంథాలయాలు" స్థాపించ బడ్డాయి. 1995లో ప్రభుత్వం ఆమోదించిన "Persons with Disabilities Act" అంధులు సహా దివ్యాంగులకు సమాన అవకాశాలు, విద్య, ఉపాధి, సామాజిక రక్షణ హక్కులను కల్పించింది. 2016లో అది విస్తరించి "Rights of Persons with Disabilities Act"గా మారి మరింత సమగ్ర హక్కులు నిర్ధారించింది. భారత రాజ్యాంగంలోని 41వ మరియు 46వ ఆర్టికల్స్ ప్రకారం దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రం బాధ్యత వహించాలి. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "Accessible India Campaign" ద్వారా రవాణా, రహదారులు, భవనాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు అంధులకు సౌకర్యవంతంగా ఉండేలా మార్పులు జరుగుతున్నాయి. "Sugamya Bharat Abhiyan" ద్వారా సాంకేతిక సాయ పరికరాలు, డిజిటల్ పాఠ్య పుస్తకాలు, వాయిస్ సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులోకి వచ్చాయి. దృష్టి లేనివారు ప్రతిభ లేనివారు కాదు. వారు చీకటిని ఛేదించే జ్ఞానమయులుగా నిలిచారు. అమెరికాకు చెందిన హెలెన్ కెల్లర్ అంధత్వం, చెవిటితనం, మూగతను అధిగమించి మానవహక్కుల యోధురాలిగా నిలిచింది. స్టీవీ వండర్, రే చార్ల్స్ వంటి సంగీత మేధావులు ప్రపంచాన్ని తమ స్వరంతో కదిలించారు. భారతదేశంలో సురదాస్, గోరఖ్‌పూర్ రామ్‌లాల్ శర్మ, గజల్ గాయకుడు రవి కిరణ్ లాంటి వారు అంధుల ప్రతిభకు నిలువెత్తు ఉదాహరణలు. వారి జీవితం మనకు స్ఫూర్తి, సంకల్ప బలం, ఆత్మవిశ్వాసం నేర్పుతుంది. దృష్టి లోపితుల సమస్యలు కేవలం శారీరక పరిమితి కాదుబీ అవి సామాజిక నిర్మాణంలోని లోపాల ప్రతిఫలాలు. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాల కొరత, గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాల లేమి, మరియు సమాజం చూపించే దూరదృష్టి లేకపోవడమే వారి అసలైన అంధత్వానికి కారణం. ఈ నేపథ్యంలో దృష్టి లేని వారికి చూపునివ్వడం కంటే చూపు ఉన్నవారికి దృష్టి ఇవ్వడం అత్యవసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతి ఐదుగురిలో ఒకరు జీవితంలో ఏదో దశలో దృష్టి లోపాన్ని ఎదుర్కొంటారని పేర్కొంది. అందువల్ల కంటి సంరక్షణ, ఆరోగ్య అవగాహన, పోషకాహారంపై శ్రద్ధ, మరియు సమయానికి వైద్య పరీక్షల ద్వారా అంధత్వాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. "Vision 2020 - The Right to Sight" అనే అంతర్జాతీయ ఉద్యమం ఈ లక్ష్యంతోనే ప్రారంభమైంది. భారత ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై "National Programme for Control of Blindness" ద్వారా కంటి వ్యాధుల నిరోధక చర్యలను చేపడుతోంది. అంధుల పట్ల సమాజం తన బాధ్యతను గుర్తించాలి. వారిని కరుణతో చూడక, గౌరవంతో ఆహ్వానించాలి. పాఠశాలలు, కార్యాలయాలు, రవాణా వాహనాలు, వెబ్‌సైట్లు అంధులకు సులభ సాధ్యంగా ఉండే విధంగా రూపకల్పన కావాలి. సమాజం వారిని భారంగా కాక, శక్తిగా చూడగలిగితేనే నిజమైన సమానత్వం సాకారమవుతుంది. అక్టోబర్ 15 కేవలం ఒక తేదీ కాదుబీ అది మన అంతరంగంలోని చీకటిని తొలగించే పిలుపు. చూపు లేనివారి జీవితాల్లో వెలుగు తెచ్చేది కళ్ళు కాదు – మన మనసు. మన దృష్టి లోపితుల పట్ల ఉన్న దృష్టికోణం మారితేనే వారికీ, మనకీ వెలుగు ప్రసరిస్తుంది. ఈ దినం మనకు చెబుతుంది %–% అంధులు దయార్థులు కాదు, దారితీసే దీపాలు. వారిని అర్థం చేసుకోవడం అంటే మానవత్వాన్ని అర్థం చేసుకోవడం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# మావోయిస్టు పార్టీ చరిత్రలో కలవరపడ్డ రోజు!







**(మొదటి పేజీ తరువాయి)** రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో నజన్మించారు. అన్న మల్లోజుల కోటేశ్వర రావు (కిషన్‌జీ)ను విప్లవ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మావోయిస్టు పార్టీలో చేరి అత్యంత కీలక వ్యవహరించారు.

2011 నవంబరు 24న బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అన్న మల్లోజుల కోటేశ్వర రావు అలియాస్ కిషన్‌జీ మృతి చెందారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో మావోయిస్ట్ కమాండర్ అయిన మల్లోజుల వేణుగోపాల్ భార్య తారాక్క కూడా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. ఆమె గడ్చిరోలి రీజియన్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ లిస్టులో కూడా ఉన్నారు.

**పార్టీలో మల్లోజుల ప్రస్థానం ఇలా..** కామ్రేడ్ మల్లోజుల వేణుగోపాల్ పూర్వ పీపుల్స్‌వార్ గ్రూపులో భూపతి, సోనూ, మాస్టర్, అభయ్ వంటి పేర్లతో పని చేశారు. అదేవిధంగా మావోయిస్టు పార్టీలో చేరాక మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతంలో దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీకి అధిపతిగా ఉన్నారు. దక్షిణ భారత దేశంలోని పశ్చిమ కనుమలకు రెండు వైపులా, కేరళలోని గోవా నుంచి ఇడుక్కి వరకు ఉన్న గెరిల్లా జోన్‌ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీలో చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్) మరణం తరువాత ఆయన సీపీఐ (మావోయిస్టు) పార్టీకి అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. అతను పార్టీలో ప్రచురణల విభాగం లో నిర్వహణ బాధ్యతలను స్వీకరించారు. ఏప్రిల్ 2010 దంతెవాడ ఘటనలో 76 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్సు కు చెందిన పోలీసుల మరణానికి వెనుక మల్లోజుల హస్తం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మల్లోజులపై భారీ ఎత్తున రివార్డులు ప్రకటించారు. మల్లోజుల కోటేశ్వర రావు అలియాస్ కిషన్‌జీ మరణం తరువాత వేణుగోపాల్ రావు పశ్చిమ బెంగాల్‌లో ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా జరిగిన 'లాల్‌గడ్ 'ఉద్యమానికి నాయకుడిగా నియమితులయ్యారు.

# బీహార్ దంగల్: ఎంఐఎం కింగ్ మేకర్ అవుతుందా?

హైదరాబాద్ కు చెందిన జాతీయ పార్టీ ఎంఐఎం బిహార్లో ఒంటరి పోరుకు సిద్ధమైంది. తాజాగా 110 స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసినట్టు ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. అంతేకాదు.. తాము కింగ్ మేకర్ అవుతామని కూడా వ్యాఖ్యానించారు. వాస్తవానికి కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్‌తో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాలని ఎంఐఎం ఆది నుంచి ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని మహాఘట్ బంధన్‌లో చేరడం ద్వారా ప్రస్తుతం ఉన్న బలాన్ని మరింత పెంచుకోవాలని భావించింది. దీనికి ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడి కూడా అంగీకరించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గింది. ఎంఐఎంకు అవకాశం ఇస్తే సంప్రదాయ హిందూ ఓటర్లు తమకు దూరమవుతారని కాంగ్రెస్ భావిస్తోంది. ఎంఐఎం నుంచి అనేక వినతులు వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టించుకోలేదు. ఫలితంగా ఎంఐఎం ఇప్పుడు ఒంటరి పోరుకు సిద్ధమైంది. మొత్తం 243 స్థానాలు ఉన్న బీహార్ అసెంబ్లీలో సీమాంచల్ ప్రాంతంలోని 47 అసెంబ్లీ స్థానాలు అత్యంత కీలకంగా మారాయి. ఇవి మొత్తం నాలుగు జిల్లాల పరిధిలో ఉన్నాయి. గత 2020 ఎన్నికల్లో సీమాంచల్ ప్రాంతంలోనే నాలుగు స్థానాల్లో ఎంఐఎం పార్టీ విజయం దక్కించుకుంది. ఇప్పుడు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం ద్వారా మరింత పట్టు పెంచుకోవడంతో పాటు రెండు అంకెల సంఖ్యలో తమ బలాన్ని పుంజుకునేలా చేయాలని అసదుద్దీన్ భావిస్తున్నారు. అయితే ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుంది అనేది పక్కన పెడితే ప్రధాన కూటమి పార్టీలైన ఆర్జెడి, కాంగ్రెస్‌కు మాత్రం తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను తీసుకువస్తున్నది రాజకీయ వర్గాలు చెబుతున్న మాట. ఓటు బ్యాంకును చీలిస్తే ముస్లిం ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు దూరమై తద్వారా మహాఘట్‌బంధన్ విజయాలకు కూడా పెద్ద ఎత్తున గండి పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, తమకు మహాఘట్‌బంధన్‌లో చోటు దక్కని కారణంగానే ఒంటరి పోరుకు సిద్ధమయ్యామని అసదుద్దీన్ చెప్తున్నారు.

తాజాగా ఆయన 35 మందితో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం 110 స్థానాలకు పోటీ చేస్తున్నామని ప్రకటించినప్పటికీ రెండో దశ ఎన్నికలపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు. రెండో దశలో మిగిలిన అభ్యర్థులను కూడా ప్రకటించే అవకాశం ఉంది అన్నది ఎంఐఎం వర్గాలు చెబుతున్న మాట. బలమైన ముస్లిం మైనారిటీలలో ఎంఐఎం కు మద్దతు భారీగా ఉండడం, పోటీకి కూడా మెజారిటీ సంఖ్యలో అభ్యర్థులు రావడం వంటివి ఎంఐఎంకు కలిసి వస్తున్న పరిణామాలు. అయితే అంతిమంగా ఇది బిజెపి కన్నా కూడా కాంగ్రెస్కు నష్టం చేకూర్చే అవకాశం ఉందన్నది రాజకీయ వర్గాలు చెబుతున్న మాట. మరి ఏం జరుగుతుందనేది చూడాలి.


## టెక్ ప్రపంచంలో మరో పెను సంచలనం.. ఈ ఆవిష్కరణ

ఇప్పటి టెక్ యుగం అంటే కొత్త కొత్త ఆవిష్కరణలే. రోజురోజుకీ గాడ్జెట్లు మరింత స్మార్ట్‌గా, వినియోగదారుల అవసరాలకు దగ్గరగా తయారవుతున్నాయి. ఇలాంటి అద్భుత ఆవిష్కరణల జాబితాలోకి తాజాగా చేరింది 'స్పేక్టాప్–జీ1' అనే సూపర్ ల్యాప్‌టాప్. ఇది సాంప్రదాయ ల్యాప్‌టాప్‌ల రూపమే మార్చేసింది!

**స్క్రీన్ లేని ల్యాప్టాప్! మాయ కాదు, నిజం!...** అవును, వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమే. ఈ ల్యాప్‌టాప్‌లో మీరు చూసే ఫిజికల్ స్క్రీన్ ఉండదు. మరి ఎలా పని చేస్తుంది? దానికి బదులుగా ఇది ఏఆర్ గ్లాసెస్‌తో కనెక్ట్ అవుతుంది.

ఆ ఏఆర్ గ్లాసెస్ ధరించిన వెంటనే, మీ కళ్లముందు దాదాపు 100 అంగుళాల వర్చువల్ స్క్రీన్ ప్రత్యక్షమవుతుంది! మీ వర్క్‌స్పేస్‌ను మీరే డిజైన్ చేసుకునే స్వేచ్ఛను ఇది ఇస్తుంది.

**అనేక స్క్రీన్లు ఒకేసారి – మల్టీటాస్కింగ్‌కు కొత్త రూపు...** 'స్పేక్టాప్–జీ1' అందించే అతిపెద్ద సౌలభ్యం ఏమిటంటే, మీరు ఒకే సమయంలో 4–5 వర్చువల్ స్క్రీన్‌లు కూడా సృష్టించుకోవచ్చు. అంటే, మల్టీటాస్కింగ్ చేయడం మరింత సులభం అవుతుంది. ఉదాహరణకు ఒక స్క్రీన్‌లో



ముఖ్యమైన వీడియో కాల్, మరోదానిలో డాక్యుమెంట్‌ను ఎడిట్ చేయడం, ఇంకో స్క్రీన్‌లో వెబ్ బ్రౌజింగ్‌తో సమాచారం వెతకడం.. ఈ మూడు పనులను ఒకేసారి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయవచ్చు.

**గోప్యతకు కొత్త నిర్వచనం: పబ్లిక్‌లోనూ ప్రైవేట్ వర్క్‌స్పేస్!...** బస్సులు, రైళ్లు లేదా కాఫీ షాప్‌ల వంటి పబ్లిక్ ప్లేస్‌లలో ల్యాప్‌టాప్ వాడేటప్పుడు, మనం ఏం చేస్తున్నామో పక్కవారు చూస్తారేమోనన్న భయం ఉంటుంది. కానీ 'స్పేక్టాప్–జీ1'తో ఆ సమస్యే ఉండదు. ఎందుకంటే, ఇది ఉపయోగిస్తున్న వ్యక్తికి మాత్రమే ఆ వర్చువల్ స్క్రీన్ కనిపిస్తుంది. ఇతరులకు ఏమీ కనబడదు. కాబట్టి ప్రైవసీ (గోప్యత) పరంగా ఇది అత్యంత సురక్షితం.

**సౌలభ్యం, తేలిక – ఎక్కడికైనా తీసుకెళ్లండి!...** భారీ ల్యాప్‌టాప్‌లు మోయాల్సిన అవసరం లేదు. చిన్న ల్యాప్‌టాప్ బేస్, తేలికైన ఏఆర్ గ్లాసెస్‌తో సరిపోతుంది. ఇది ఎక్కువ స్థలం అవసరం లేకుండా, సులభంగా బ్యాగ్‌లో పడుతుంది. ట్రావెల్, రిమోట్ వర్క్, క్రియేటివ్ ప్రాజెక్ట్‌లు చేసేవారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక.

**భవిష్యత్తు పనిమీద కొత్త రూపం...** 'స్పేక్టాప్–జీ1' ల్యాప్‌టాప్ టెక్నాలజీని కొత్త దిశలో తీసుకెళ్తుందని చెప్పవచ్చు. ఫిజికల్ స్క్రీన్‌లు, పెద్ద డిస్‌ప్లేలు అనే భావనను ఇది తుడిచివేసి, వర్చువల్ వర్క్‌స్పేస్ అనే కొత్త ప్రపంచానికి మార్గం సుగమం చేసింది.

'స్పేక్టాప్–జీ1' కేవలం ల్యాప్‌టాప్ కాదు.. ఇది మన కళ్ల ముందే భవిష్యత్తును చూపించే వర్చువల్ మంత్రదండం!

## నోబెల్ కాదన్నది.. ట్రంప్ కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర పురస్కారం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రతిష్టాత్మక ఇజ్రాయెల్ ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ హానర్ ను ప్రదానం చేయనున్నట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. శాంతి స్థాపనలో గాజాలో బందీల విడుదలకు సంబంధించిన ఒప్పందంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక పాత్ర పోషించినందుకు గానూ ఈ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ అవార్డును ఇజ్రాయెల్ దేశానికి లేదా మానవాళికి అసాధారణమైన కృషి చేసిన వ్యక్తులకు ఇస్తారు.

**పురస్కారానికి కారణాలు :** ట్రంప్‌కు ఈ గౌరవం దక్కడానికి ముఖ్యంగా ఈ అంశాలను ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్ తన ప్రకటనలో ప్రస్తావించారు. హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలకు, అలాగే గాజాలో రెండు సంవత్సరాలకు పైగా కొనసాగిన యుద్ధాన్ని ముగించడానికి ఉద్దేశించిన శాంతి ఒప్పందాన్ని కుదర్చడంలో ట్రంప్ చేసిన అలుపెరుగని కృషికి ఈ అవార్డు దక్కింది. ట్రంప్ నిరంతర ప్రయత్నాల ద్వారా తమ ప్రియమైన వారిని ఇంటికి తీసుకురావడమే కాకుండా, మధ్యప్రాచ్యంలో భద్రత, సహకారం, శాంతియుత భవిష్యత్తుపై ఆధారపడిన నూతన శకానికి పునాదులు వేశారని హెర్జోగ్



పేర్కొన్నారు. అబ్రహాం ఒప్పందాల ద్వారా శాంతి వృత్తాన్ని విస్తరించడం, ఇజ్రాయెల్ భద్రత, పౌరుల శ్రేయస్సుకు ఆయన చేసిన ప్రత్యేక సహకారంతో ఈ అవార్డు లభించింది.. 'ఆయన అలుపెరగని కృషి ద్వారా అధ్యక్షుడు ట్రంప్ మన ప్రియమైన వారిని ఇంటికి తీసుకురావడమే కాకుండా భద్రత, సహకారం , శాంతియుత భవిష్యత్తుపై ఆధారపడిన మధ్యప్రాచ్యంలో కొత్త శకానికి పునాదులు వేశారు. ఆయనకు ఇజ్రాయెల్ ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ హానర్ ను ప్రదానం చేయడం నాకు గొప్ప గౌరవం."గా పేర్కొన్నారు.

**ప్రదానోత్సవం ఎప్పుడు?...** అవార్డును రాబోయే కొన్ని నెలల్లో అందజేయనున్నట్లు హెర్జోగ్ కార్యాలయం తెలిపింది. ట్రంప్ సోమవారం ఇజ్రాయెల్‌ను సందర్శించినప్పుడు.. ఆయనకు ఈ నిర్ణయాన్ని అధికారికంగా తెలియజేయనున్నారు. ఈ పర్యటనలో ట్రంప్ బందీల కుటుంబాలను కలవడంతో పాటు ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది.

**పూర్వపు గ్రహీతలు...** ఈ అత్యున్నత పౌర పురస్కారాన్ని గతంలో అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా (2013లో) , జో బైడెన్ (2022లో) కూడా అందుకున్నారు. ట్రంప్‌కు ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి దక్కకపోయినా, ఈ ఇజ్రాయెల్ అత్యున్నత పౌర గౌరవం అంతర్జాతీయంగా ఆయన కృషికి లభించిన ఒక ముఖ్యమైన గుర్తింపుగా పరిగణించబడుతోంది.

చురకలు



చురకలు

## సంపాదకీయం

### బ్రిటన్ మాజీ ప్రధానికి మైక్రోసాఫ్ట్ లో కీలక బాధ్యతలు.. ఏంటి కథ?

యూకే మాజీ ప్రధాన మంత్రి రిషి సునక్ తన రాజకీయ జీవితం తర్వాత మరో కీలకమైన అంతర్జాతీయ బాధ్యతను స్వీకరించారు. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో సీనియర్ అడ్వైజర్‌గా ఆయన నియమితులయ్యారు. యూకే ప్రభుత్వానికి చెందిన అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ ఈ నియామకాన్ని అధికారికంగా ఆమోదించింది. ఇదే సంస్థ ఇటీవల ఆయనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలోనూ ఇలాంటి పాత్రకు అనుమతి ఇచ్చింది.

**భాగకాలిక బాధ్యతలు, కీలక సలహాలు...** సునక్‌కి మైక్రోసాఫ్ట్‌లో పార్ట్ టైం బాధ్యతలు ఉంటాయి. ఆయన ప్రధానంగా గ్లోబల్ స్ట్రాటజీ, ఎకానమీ, టెక్నాలజీ పాలసీపై సలహాలు ఇవ్వనున్నారు. అలాగే మైక్రోసాఫ్ట్ సమ్మిట్ వంటి ముఖ్యమైన ఈవెంట్లలో పాల్గొంటారు. ఈ పదవిలో ఆయన పొందే మొత్తం వేతనాన్ని తన భార్య అక్షతా మూర్తితో కలిసి స్థాపించిన 'ది రిచమండ్ ప్రాజెక్ట్' అనే చారిటీకి విరాళంగా ఇవ్వనున్నారు.


**లాబీయింగ్‌కి, ప్రభుత్వ సమాచార వినియోగానికి నిషేధం...** ఎలాంటి ప్రయోజన విరోధాలు రాకుండా ఉండేందుకు సునక్‌పై కొన్ని ఆంక్షలు విధించబడ్డాయి. ఆయన యూకే ప్రభుత్వాన్ని లాబీ చేయకూడదు. ప్రధానిగా ఉన్నప్పుడు పొందిన లోపలి సమాచారాన్ని ఉపయోగించకూడదు. మైక్రోసాఫ్ట్‌కు యూకే ప్రభుత్వ పాలసీలపై సలహాలు ఇవ్వడాన్ని రెండేళ్లపాటు నిషేధించారు. ప్రధానిగా ఉన్నప్పుడే రిషి సునక్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలపై విశేష ఆసక్తి కనబరిచారు. ఆయన నేతృత్వంలోనే చారిత్రకమైన ఏఐ సేఫ్టీ సమ్మిట్ బ్లెచ్లీ పార్క్‌లో జరిగింది. అలాగే మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలను యూకేలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించారు. ఈ కొత్త బాధ్యత ఆయన టెక్ రంగంపై ఉన్న దీర్ఘకాల దృష్టిని ప్రతిబింబిస్తోంది.

**మిశ్రమ స్పందనలు, నైతిక ప్రశ్నలు....** సునక్ నియామకంపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన అనుభవం మైక్రోసాఫ్ట్‌కు గ్లోబల్ పాలిటిక్స్, ఎకానమీ సమస్యల్లో మార్గదర్శకంగా ఉంటుందని మద్దతుదారులు భావిస్తున్నారు. అయితే, విమర్శకులు మాత్రం "రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థల మధ్య రివాల్వింగ్ డోర్" పద్ధతిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మైక్రోసాఫ్ట్ యూకే ప్రభుత్వంతో అనేక ఒప్పందాలు కలిగి ఉన్న నేపథ్యంలో ఈ నియామకం నైతిక ప్రశ్నలకు దారి తీస్తోంది.

**గ్లోబల్ అడ్వైజర్‌గా కొత్త అధ్యాయం...** ఆంతోపిక్, గోల్డ్ మన్, సాచెస్.. ఇప్పుడు మైక్రోసాఫ్ట్ ఈ మూడు పెద్ద సంస్థలతో కలిసి సునక్ తన తర్వాతి అధ్యాయాన్ని గ్లోబల్ అడ్వైజర్‌గా మలుచుకుంటున్నారు. ఈ నియామకాలతో టెక్నాలజీ, నైతికత, ఇన్నోవేషన్, డిజిటల్ భవిష్యత్తుపై ఆయన దృష్టి కేంద్రీకృతం కావడం స్పష్టమైంది. రిషి సునక్ కొత్తగా టెక్ ప్రపంచంలో గ్లోబల్ మార్గదర్శకుడిగా రూపుదిద్దుకుంటున్నారు.

# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలామ్ - అక్టోబర్ 15... మిస్సైల్ మ్యాన్ జయంతి - ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దీన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దీన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువు కున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎన్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (%ణ=ఞా%)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా (%×ూ=ా%) పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (%వూం-×××%)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళీ తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎన్ఎల్వి-3 రోహిణి విజయం వంతంగా ప్రవేశ పెట్టింది..అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-%××% అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగ స్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోఖ్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కువ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఐఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**



# బాలల వికాస తరంగిణి తురగా జానకీరాణి - అక్టోబర్ 15... తురగా జానకీరాణి వర్ధంతి



పిల్లలారా రారండోయ్...బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు...పెద్దలు సైతం ఉత్సాహం తో ఎదిరి చూసిన పాత జ్ఞాపకాలు అయిదు పదుల వయసు దాటిన వారికి చేటుగా పోనివి. రేడియో అక్కయ్యగా తురగా జానకీరాణి, ఆకాశవాణి ద్వారా నిర్వహించిన పిల్లల కార్యక్రమాలు మరిచి పోలేనివి. ఎందరో చిన్నారులు బాలా నందంలో పాల్గొనే అవకాశం పొంది, తమ కంఠం వినిపించి దం వెనుక ఆమె పాత్ర మరిచి పోలేనిది. పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి వాటితో చిన్నారులతో ప్రదర్శింప చేసిన ఆమె కృషి మరిచి పోనిది. ఎందరో ప్రముఖులు తమకు చిన్నతనంలో ఆకాశవాణిలో రేడియో అక్కయ్యతో వున్న అనుబంధం మర్చిపోలేమని ఉంటారు. తురగా జానకీరాణి (ఆగష్టు 31, 1936– అక్టోబరు 15, 2014) ఆలిండియా రేడియోలో నేటికీ రేడియో అక్కయ్యగా సుపరిచి తురాలు అయిన ఆమె రచయిత్రి, సంఘ సంస్కర్త .. ఆకాశవాణి ఉద్యోగంలో చేరక ముందు రేడియో ఆర్టిస్టుగా , రాత్రి 7 నుండి 7.50 వరకు కథానిక పఠనం చేసే వారు. ఆకాశవాణిలో ఆమె అనేక కొత్త ప్రయోగాలు చేశారు. చొప్పదంటు ప్రశ్నలు, బాలవాణి వంటి కార్యక్రమా లు, కంగారు మామయ్య, కొంటె కృష్ణయ్య, వెర్రి వెంగళప్ప వంటి పాత్రలు ప్రవేశపెట్టి చిన్నారి శ్రోతలకు చేరువ అయ్యారు. వందకి పైగా కథలు రచించారు. అవి మూడు సంపుటాలుగా వెలువ డ్డాయి. మూడు నవలలు, ఐదు బాలసాహిత్యం మీద పుస్తకాలు వచ్చాయి అనువాద రచనలు కూడా మూడు వచ్చాయి. పలు పత్రికల్లో వీరు రచించిన కథలు ప్రచురించ బడ్డాయి. సన్నాయం, మంచిమనస్సు, ఉపాయం, వారధి, ఆడపిల్ల వంటి కథలతో కూడిన 'మిఠాయి పొట్లం' కథల సంపుటి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'పబ్లికేషన్స్ డివిజన్' ప్రచురించింది. మరో కథల సంపుటి 'బంగారు పిలక 'ని నేషనల్ బుక్ ట్రస్టు వారు ప్రచురించారు. రెడ్ క్రాస్ కథను అనువదించారు. ఆకాశ వాణి ద్వారా..."ఇది నా సమస్య" అని స్త్రీల కార్యక్రమం ప్రసారం చేసి స్త్రీలు తమ సమస్యలు ఉత్తరాల ద్వారా తెలియ పరిస్తే వాటి పరిష్కారాలు నిపుణులైన డాక్టర్లు, లాయర్లు సలహాలిచ్చే వారిచేతచెప్పే కార్యక్రమాలు, వృద్ధుల కోసం తమ జీవిత సుభాషితాలు తెలిపే "ప్రవంతి" అనే కార్యక్రమం వెనుక జానకీ రాణి కృషి అభినందనీయం. దృశ్యశ్రవణ విధానంతో విజ్ఞానం అందించవచ్చని అమ్మా-పాప, చిలుక పలుకులు, ఉదయబాల, అమ్మా నేను బడికి పోతా, బంగారు పాప వంటి పలు సిడిలను రూపొందించారు. జానకీరాణి సేవలకు గుర్తింపుగా 'సనాతన ధర్మ ',బాలసాహిత్య పరిషత్ ' వంటి పలు సంస్థలు వీరిని సత్కరించాయి. వీరికి 1991,1992లో వరుసగా రెండు సార్లు నేషనల్ బెస్ట్ బ్రాడ్ కాస్టరుగా అవార్డు పొందారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఎందరో పేరెన్నిక గల వారితో పని చేశారు .అక్కినేని నాగేశ్వర రావు, ఎన్.టి. బాలసుబ్రహ్మణ్యం, జె.వి. సోమయా జులు, మంజు భార్గవి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, స్థానం నరసింహారావు, వేలూరి శివానంద, గోపీచంద్.... ఇలా ఎందరితోనో కలిసి కార్యక్ర మాలు రూపొందించారు. యూనిసెఫ్ లో, ఎన్.సి.ఆర్.టి., ప్రభుత్వ శాఖల కోసం పని చేసేటప్పుడు బాల జాగృతి (బా జా)అనే కార్యక్రమం చేపట్టి 670 వీధి ప్రదర్శనలు చేశారు. బాలల హక్కులు, సమస్యలు, బాల కార్మిక నిర్మూలన, ఇత్యాది ఎన్నో విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేవారు. సామాజిక స్పృహ వున్న విషయాలు, సృజనాత్మక సందేశాలు పిల్లలు, యువతీ యువకులు శిక్షణ పొంది ప్రదర్శించేవాళ్లు. జానకీరాణి... 2011లో బాల సాహిత్య పరిషత్ ద్వారా "బాలసాహిత్య రత్న" అవార్డు, గృహలక్ష్మి స్వర్ణకంకణం, రెండు సార్లు తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, పింగళి వెంకయ్య స్మారక సత్కారం, అరవిందమ్మ మాతృమూర్తి అవార్డు, సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారం, ఆంధ్ర సారస్వత పరిషత్తులో పరిణిత వాణి గౌరవం, 'ఈనాడు' అవార్డు, బాలబంధు, దక్షిణ మధ్య రైల్వే గౌరవ సత్కారం... ఎలా ఎన్నో పురస్కారాలను అందు కున్నారు. కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధ పడుతూ, అక్టోబరు 15, 2014న ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**

# చేతులు కడుగడం ద్వారా పలు వ్యాధుల నివారణ - అక్టోబర్ 15... గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే

"గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే" అనేది వ్యాధులను నివారించడానికి మరియు ప్రాణాలను కాపాడటానికి సులభమైన, సమర్థవంతమైన మరియు సరసమైన మార్గంగా సబ్బుతో చేతులను శుభ్రపరచడం కోసం అంకితం చేయబడిన వార్షిక గ్లోబల్ అడ్వకేసీ డే. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే అక్టోబర్ 15... ప్రతి సంవత్సరం, సబ్బుతో చేతులు కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యతపై ప్రపంచంలో అవగాహన పెంచడానికి ఈ రోజు ఒక వేదికగా ఉపయోగపడుతుంది. తినే ముందు చేతులు కడుక్కోమని చెప్తే చాలా మంది, తిన్నాక ఎలాగు కడుక్కుంటాం కదా అంటారు. మరికొంత మంది అయితే, 'నిత్యావసర కార్యక్రమాలు నిర్వహించి కూడా చేతులు కడుక్కోవడం అలాగే వస్తారు 'అవసరమేముంది అంటారు. వారి చేతుల్లో మీకు షేక్ హాండ్ ఇచ్చి, ఆ తర్వాత మీరు అదే చేతుల్తో భోజనం చేస్తే ఒక్కసారి మీ పరిస్థితి ఊహించుకోండి. అందుకే చేతులు కడుక్కోవటం అనేది ఎంతో ముఖ్యమైనది, చేతులు కడుక్కోవడం ప్రాముఖ్యత గుర్తించి, దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతి ఏడాది అక్టోబర్ 15న ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవం (%ఖుఅఎఘుంప్రఙుఅన్ఞ ఖుఎ%) నిర్వహిస్తున్నారు. చేతులు కడుక్కోక పోవడం ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించడమే ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఆహారాన్ని సురక్షితంగా ఉంచడంలో, వ్యాధులను నివారించడంలో మరియు పిల్లలు బలంగా ఎదగడానికి హ్యాండ్ వాషింగ్ ఒక ముఖ్యమైన భాగం.ప్రతి సంవత్సరం, 200 మిలియన్లకు పైగా ప్రజలు గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను జరుపుకుంటారు. అరచేతులు శుభ్రంగానే కనిపించినా వాటి మీద కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉన్నాయని ఊహించ గలరా? నీళ్లతో చేతులు కడుక్కున్నా అవి పోవు. సబ్బుతో కానీ, హ్యాండ్‌వాష్ ద్రావకంతో కానీ దాదాపు 20 సెకన్లు కడుక్కుంటేనే చేతులు శుభ్రం ఉన్నట్లు. ప్రతి రోజూ భోజనం చేయడానికి ముందు, మల విసర్జనకు వెళ్ళొచ్చిన తర్వాత ఇలా చేతుల్ని శుభ్రపరచు కోవడం మనల్ని ఎన్నో అనారోగ్యాల బారి నుంచి రక్షిస్తుంది. చేతులు కడుక్కోకుండా ఉండడం వల్ల ఎన్ని రోగాలు దాడి చేసే అవకాశం ఉందో తెలుసా? రెండు వందలకు పైనే! ఆ రోగాల్ని కలిగించే సూక్ష్మజీవులు ఉండేది అరచేతులపైనే. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 35 లక్షల మంది చిన్నారులు డయేరియా, నిమోనియా లాంటి రోగాల వల్ల మరణిస్తున్నారు. వీటిని నివారించడానికి ఈ కార్యక్రమం. ఓ అంతర్జాతీయ సర్వే ప్రకారం మన దేశంలో కేవలం 44 శాతం మంది మాత్రమే చేతుల శుభ్రత పాటిస్తున్నారని తేలింది. ఈ రోజు దేశదేశాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆస్ట్రేలియాలో చేతుల శుభ్రతపై రాసిన పాటని పిల్లలందరూ ఆలపిస్తారు. తజికిస్తాన్‌లో పిల్లలు బొమ్మలు, పోస్టర్‌లతో ప్రచారం చేస్తారు. మడగాస్కర్‌లో సుమారు 35 లక్షల మంది బాలలు కలిసి ఒకేసారి సబ్బుతో చేతులు కడుక్కుంటారు. ఈ కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు కూడా పాల్గొంటారు. దక్షిణాఫ్రికాలో సుమారు 90 లక్షల మంది ఏసెమ్మెస్‌లను




బట్వాడా చేస్తారు. ప్రపంచ బ్యాంకు, యునిసెఫ్ ఆధ్వర్యంలో 'గ్లోబల్ పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్ ఫర్ హ్యాండ్ వాషింగ్' సంస్థ తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని 2008లో ప్రారంభించింది. అప్పుడు మన దేశం తరఫున క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్‌లు వేలాది మంది పిల్లల మధ్య సబ్బుతో చేతులు కడుక్కుని ప్రచారం చేశారు. సబ్బుతో చేతితో కడగడం వల్ల అతిసారం మరియు తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నివారించడానికి తక్కువ ఖర్చుతో కూడుకున్న మార్గం. న్యుమోనియా ఒక ప్రధాన మృత్యు ఒడి (తీవ్రమైన శ్వాసకోశ సంక్రమణ), ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో మరణాలకు మొదటి కారణం. సంవత్సరానికి 1.8 మిలియన్ల మంది పిల్లలు మరణిస్తున్నారు. విరేచనాలు మరియు న్యుమోనియా కలిసి సంవత్సరానికి దాదాపు 3.5 మిలియన్ల పిల్లల మరణాలకు కారణమవుతున్నాయి. సబ్బుతో చేతితో కడుక్కోవడం వల్ల అతిసారం కేసులు 30% మరియు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 21% తగ్గుతాయని అంచనా. కోవిడ్-19 మహమ్మారి సూక్ష్మ క్రిముల వ్యాప్తిని ఆపడానికి మరియు ఆరోగ్యంగా ఉండటానికి అత్యంత ప్రభావ వంతమైన మార్గాలలో ఒకటి కూడా సబ్బు, నీటితో చేతులు కడుక్కోవడం. చేతులు శుభ్రంగా ఉంచడం వల్ల డయేరియా అనారోగ్యాలలో మరియు ఇన్ఫ్లుఎంజా లేదా ఫ్లూ వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నివారించ వచ్చు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 15, గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే ఇంట్లో, సమాజంలో మరియు ప్రపంచ వ్యాప్తంగా సబ్బు మరియు నీటితో చేతులు కడగడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఆరోగ్యం బారిన పడకుండా మరియు ఇతరులకు సూక్ష్మ క్రిములను వ్యాప్తి చేయకుండా ఉండటానికి మనం తీసుకోగల ఉత్తమ చర్యలలో ఒకటి సబ్బుతో చేతులను కడుక్కోవడం. 2008 లో గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ పార్టనర్‌షిప్ చేత "అందరికీ హ్యాండ్ హైజీన్" నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు మరియు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో సబ్బు మరియు నీటిని అందుబాటులోకి తీసుకు రావడంపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రమైన నీరు మరియు సబ్బు వాడకం మంచి అలవాటు. సబ్బు మరియు శుభ్రమైన నీటితో చేతులు కడుక్కోనప్పుడు ప్రజలను అనారోగ్యానికి గురిచేసే అనేక సూక్ష్మజీవులు వ్యాప్తి చెందుతాయి. అందుకే హ్యాండ్ వాషింగ్ చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా బాత్రూమ్ ఉపయోగించిన తర్వాత, ఆహారాన్ని తయారు చేసేటప్పుడు, తినడానికి ముందు, మరియు దగ్గు, తుమ్ము లేదా మీ ముక్కును చీదడం వంటి ముఖ్య సమయాల్లో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని మరియు వాటిని క్రమం తప్పకుండా కడగాలని, తినడానికి ముందు మరియు తరువాత, వాష్ రూమ్ ఉపయోగించిన తర్వాత లేదా ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు చేతి పరిశుభ్రత పాటించాలి అనేది కొత్త భావన కానప్పటికీ... ప్రస్తుత ఆరోగ్య సంక్షోభ కాలంలో ఇది మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి సబ్బు మరియు నీటితో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం ద్వారా అనేక ఇతర సంక్రమణ వ్యాధులు సోకకుండా నివారించాలి. కమ్యూనిటీలలో హ్యాండ్ వాషింగ్ సబ్బు మరియు నీటితో చేతులు కడుక్కోవడం సరళమైనది మరియు చవకైనది మాత్రమే కాదు, అనారోగ్యానికి గురయ్యే చిన్న పిల్లల సంఖ్యను కూడా గణనీయంగా తగ్గిస్తుంది . హ్యాండ్ వాషింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటానికి ఇది సహాయ పడుతుంది. ఈ సంవత్సరం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ రోజును, ఐక్యరాజ్య సమితికి ఫిన్లాండ్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్ యొక్క శాశ్వత మిషన్లు, గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ పార్టనర్‌షిప్, ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు యునిసెఫ్, ఒక ఉన్నత-స్థాయి వర్చువల్ ఈవెంట్‌ను సమావేశ పరుస్తున్నాయి. 2020 ప్రచారంలో భాగంగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు భాగస్వాములు గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డే ఈ సంవత్సరం థీమ్ "అందరికీ హ్యాండ్ హైజీన్". న్యుమోనియా, ఒక ప్రధాన వ్యాధిగా (తీవ్రమైన శ్వాసకోశ సంక్రమణ), ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో మరణాలకు మొదటి కారణం, సంవత్సరానికి 1.8 మిలియన్ల మంది పిల్లలు మరణిస్తున్నారు. విరేచనాలు మరియు న్యుమోనియా కలిసి సంవత్సరానికి దాదాపు 3.5 మిలియన్ల పిల్లల మరణాలకు కారణమవుతున్నాయి. సబ్బుతో చేతితో కడుక్కోవడం వల్ల అతిసారం కేసులు 30% మరియు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 21% తగ్గుతాయని అంచనా. సమాజంలో అందరూ ప్రస్తుతం మరియు భవిష్యత్తు కోసం సార్వత్రిక చేతి పరిశుభ్రతను సాధించాలి. చేతి పరిశుభ్రతకు ప్రపంచ ప్రాధాన్యత నివ్వాలి. ఆరోగ్య సంరక్షణ కార్మికులతో (పారిశుధ్య కార్మికులతో) శుభ్రమైన సంరక్షణ మరియు అంటువ్యాధుల నివారణలో పాల్గొనాలి. అన్ని సమాజాలలో సబ్బుతో చేతితో కడగడం యొక్క సాధారణ సంస్కృతిని ప్రోత్స హించాలి మరియు మద్దతు ఇవ్వాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**

# మాఫీ కాక.. గోస తీరక..

పరిగి : రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన వీడడం లేదు. ఎప్పుడెప్పుడా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వారం, పది రోజుల్లో యాసంగి సీజన్ ప్రారంభం కానుంది. దీంతో మళ్లీ పెట్టుబడుల సమస్య తలెత్తనుంది. రూ.2 లక్షలకుపైబడి రుణాలున్నవారంతా మాఫీ ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు. కూలీల కొరత కారణంగానూ పంట సాగు తలకుమించిన భారంగా మారుతోంది. జిల్లాలో కూలీలు దొరక్కపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. ఇప్పటికే మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. పత్తితీసే పనులు వచ్చేనెల నుంచి మొదలు కానున్నాయి. గతేడాది కిలో పత్తి తీసేందుకు రూ.14 వరకు వెచ్చించాల్సి వచ్చింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయని, ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయని వాపోతున్నారు.

**వ్యవసాయశాఖ వివరాల సేకరణ..:** రూ.2 లక్షలకుపైబడి రుణాలు తీసుకున్న రైతులతోపాటు ఆలోపు రుణమాఫీ వర్తించని వారి నుంచి జిల్లా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించింది. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల నెంబర్లు తప్పుగా పడటం, ఒకే కుటుంబం నుంచి ఒకరి కన్నా ఎక్కువ మంది వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం వంటి వివరాలను నిశితంగా పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి, ఏఈఓ కలిసి ఆయా రైతులతో స్వీయ చిత్రాలు తీసుకొని ప్రభుత్వానికి పంపారు. ఏడాది గడిచినా ఎలాంటి స్పష్టత



లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. రూ.కోట్ల మాఫీ అమలు కావాల్సి ఉంది.

**పెరుగుతున్న వడ్డీ..:** రుణాలు తిరిగి చెల్లించడంలో జరుగుతున్న జాప్యంతో పెరుగుతున్న వడ్డీ రైతన్నల నడ్డి విరుస్తోంది. చాలామంది రుణమాఫీపైనే ఆశలు పెట్టుకొని చెల్లించలేదు. వెంటనే చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని చెబుతున్నారు. రూ.వేలల్లో వడ్డీ భారం పడుతోందని, చెల్లించకుంటే రెండోసారి రుణ మంజూరులో కొర్రీలు పెడుతున్నారు.

జిల్లాలో మండలాలు: 20
యాసంగి సాధారణ సాగు: 1,22,593 ఎకరాలు
మొత్తం రైతులు: 3,34,382
1- 3 విడతల వరకు రుణమాఫీ అయిన రైతులు: 89,433
మిగిలిన రైతులు: 3,500

ఎలాంటి ఆదేశాలు రాలేదు..


రూ.2 లక్షలకుపైబడి రుణం తీసుకున్న రైతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. నాలుగు విడతల్లో దాదాపు రూ.842 కోట్లు రుణమాఫీ అయింది.
టి.రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

# పనికో రేటు. .పైసలిస్తేనే దస్త్రం ముందుకు!

కరీంనగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పల్లెల్లోని ప్రతి గడపకు చేర్చడంలో పంచాయతీ కార్యదర్శులది కీలకపాత్ర. వీరిలో కొందరు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తుంటే.. మరికొందరు అమాయకుల నుంచి వసూళ్లకు పాల్పడుతు న్నారు. పనికో రేటు చెబుతూ.. పైసలిస్తేనే దస్త్రాన్ని ముందుకు పంపిస్తున్నారు. నెల రోజుల కిందట వీణవంక మండలంలోని చల్లూరు గ్రామ కార్యదర్శి ఇంటి నంబరు ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసి.. అనిశాకు పట్టుబడ్డాడు. తాజాగా గంగాధర మండలం మధురానగర్ కార్యదర్శి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు లంచం అడిగి.. అనిశాకు చిక్కాడు. ఇలాంటి వారి తీరుతో నిజాయతీగా ఉండే ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

**కొరవడిన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ**

గ్రామాల్లో సర్పంచి పాలన పూర్తయి ఏడాదిన్నర దాటింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినా వారిది వేర్వేరు శాఖల కావడం, పల్లె పాలనపై పట్టులేకపోవడం, మాతృశాఖ విధుల్లో నిమగ్నమై ఉండటంతో కొందరు కార్యదర్శు లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారిపై పర్యవేక్షణ కొరవడటంతో అవినీతికి పాల్పడుతున్నారు. కరీంనగర్ గ్రామీణ మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి చెరువు శిఖం భూమిలో రేకుల షెడ్లు నిర్మించుకోగా, కార్యదర్శి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోకుండా వాటికి



ఇంటి నంబర్లు కేటాయించారు. గంగాధర మండలం లోని ఓ గ్రామ కార్యదర్శి స్థానిక నేతలతో కుమ్మక్కై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడు. ప్రజలు తీవ్ర ఆరోపణలు చేసి అతనిపై ఒత్తిడి పెంచడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. శంకరపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా ఆ కార్యదర్శి ఆరు నెలలుగా సతాయించాడు. చేసేదిలేక బాధిత కుటుంబం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

**ఏ పనులకు అడుగుతున్నారంటే..**

కరీంనగర్ పట్టణ శివారు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూముల్లో పలువురు ఇళ్లు నిర్మించుకున్నా అధికారులు అడ్డుకోలేదనే ఆరోపణలున్నాయి. వీరు ఆ గ్రామాల కార్యదర్శుల సహకారంతో అక్రమంగా ఇంటి నంబర్లు పొందారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ అనుమతుల సమయంలో, ఇంటి నంబర్లు కేటాయించేటప్పుడు, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలు జారీ సమయంలో, సంతలు నిర్వహించి వాటి నుంచి పన్నులు వసూలు చేయడంలాంటి సందర్భాల్లో అవినీతికి పాల్పడుతున్నారు. **లంచం డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వండి** ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే మాకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అవసరమైన వారు అవినీతి నిరోధక శాఖ నంబరు 91543 88954కు ఫోన్ చేసి వివరాలు చెప్పొచ్చు. విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ, కరీంనగర్

# ఈపీఎఫ్.. అంతా గప్‌చుప్!



ఆదిలాబాద్ : రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లో పొరుగు సేవల ఏజెన్సీల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. సిబ్బంది పేరిట ఉద్యోగ భవిష్య నిధి(ఈపీఎఫ్) చెల్లించకపోయినా అధికార యంత్రాంగం పెద్దగా పట్టించుకోవడం లేదు. నికర వేతనంతోపాటు ఈపీఎఫ్ చీటీలను పంపిణీ చేయని ఏజెన్సీలను పక్కన పెట్టాలనే నిబంధనలను విస్మరించడం విస్మయానికి గురిచేస్తోంది. రిమ్స్‌లో నాలుగు ఏజెన్సీల కింద 498 మంది సహా జూన్ 30న కలెక్టర్ రాజార్షి షా రద్దు చేసిన ఓ ఏజెన్సీ కింద మరో 421 సిబ్బంది కలిపి మొత్తం 819 మంది వేతనాల పంపిణీలో పారదర్శకత కరవైంది. స్టాఫ్ నర్సులకు రూ.24 వేలు, సాంకేతిక పారా మెడికల్ సిబ్బందికి 19,500, సెక్యూరిటీ,పారిశుద్ధ్య సిబ్బందికి రూ.15,600 చొప్పున ప్రభుత్వం నెలకు రూ.కోటిన్నర వరకు వేతనాలు చెల్లిస్తోంది. ఇందులో 13 శాతం ఈపీఎఫ్‌ను పరిగణనలోకి తీసుకుంటే రూ.19,50,000 చెల్లింపు వివరాలను ఏజెన్సీలు వ్యక్తిగతంగా వెల్లడిస్తేనే అధికారులు ప్రభుత్వం కేటాయించే నిధులను విడుదల చేయాల్సి ఉంది. కానీ సిబ్బందికి నెల నెలా వేతనాల వివరాలు వెల్లడించే చీటీలే ఇవ్వటంలేదు. ఆన్‌లైన్లో ఈపీఎఫ్ వివరాలను పొందుపర్చటం లేదు.

**పట్టుతప్పిన పర్యవేక్షణ..**

పొరుగు సేవల ఏజెన్సీలపై ఉపాధి కల్పన, కార్మిక శాఖలు సహా రిమ్స్ యాజమాన్యం పర్యవేక్షణ ఉండాలి. సిబ్బంది వేతనాలు, ఈపీఎఫ్ వివరాలపై అధికారులు సమీక్షలు నిర్వహించకపోవటం ఏజెన్సీలకు వరంగా మారుతోంది. కొంతమంది పొరుగుసేవల ఏజెన్సీల నిర్వాహకులు కలిసి ఇటీవల వారిని పర్యవేక్షించే ఓ శాఖాధికారికి భారీ నజరానా ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలియవచ్చింది. జిల్లాలో పొరుగు సేవల ఏజెన్సీల ఎంపిక కోసం ఈ ఏడాది ఏప్రిల్ 25న ఉపాధి కల్పన శాఖ టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. మే 14న టెండర్లు నిర్వహించగా పాత ఏజెన్సీలు పైరవీలు చేశాయని అప్పట్లో ప్రచారం జరిగింది. కొన్ని ఏజెన్సీల పనితీరు బాగాలేదని తెలిసినా మళ్లీ వారికే అవకాశం దక్కటం అనుమానాలకు తావిస్తోంది.

**సూత్రధారి ఉద్యోగే**

బినామీల పేరిట ఓ ఏజెన్సీని నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగే అక్రమాల సూత్రధారిగా తెలుస్తోంది. మే 14న జరిగిన టెండర్లలో స్థానికేతరులకు అవకాశం దక్కకుండా చక్రం తిప్పటంలో ఆయనది ప్రధాన పాత్రగా ప్రచారం జరుగుతోంది. సదరు వ్యక్తి గతంలోనూ ఇదేరకంగా అక్రమాలకు పాల్పడ్డాడు. సిబ్బందికి ఒక్క నెల ఈపీఎఫ్ చెల్లించకపోతే కనీసం రూ.10 లక్షలు మిగిల్చుకోవచ్చని, అధికారులు అడ్డుచెప్పకుండా నజరానాలు ముట్టచెబుతున్నట్టు సమాచారం.

**ఉపాధి కల్పన శాఖదే బాధ్యత**

డా.జైసింగ్, రిమ్స్ డైరెక్టర్

పొరుగు సేవల ఏజెన్సీల ఎంప్యానల్‌మెంట్ ఉపాధి కల్పన శాఖ చూసుకుంటుంది.. మా దగ్గర పనిచేసే సిబ్బందికి వ్యక్తిగతంగా ఈపీఎఫ్ చీటీలు ఇవ్వని ఏజెన్సీలపై చర్యలకు సిఫారసు చేస్తాం. వేతనాలపై కోతపడిన సిబ్బంది ఎవరైనా వచ్చి వ్యక్తిగతంగా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

# సర్వీస్ రోడ్లకు తిలోదకాలు!



ఆదిలాబాద్ : జిల్లాలో విస్తరిస్తున్న జాతీయ రహదారి పనుల్లో పాదచారులు, గ్రామస్థుల సౌకర్యార్థం తొలుత నాలుగు చోట్ల సర్వీస్ రోడ్లు నిర్మించాలని ప్రణాళిక చేశారు.. తీరా ఏమైందో.. రహదారి విస్తరణనే కాస్త పెంచి ఆ సర్వీస్ రోడ్ల ప్రణాళిక ఉపసంహరించుకున్నారు. తద్వారా ఇరువైపులా ఎనిమిదిన్నర అడుగుల చొప్పున ఖాళీ స్థలం మిగలనుంది. ఈ ప్రతిపాదనలు ఎవరికోసం మార్చారనేది చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని జాతీయ రహదారి నం.353 (బి)ను బేల మండలం ఉపాస్‌నాల నుంచి భోరజ్ మండల కేంద్రం వరకు 33 కిలోమీటర్ల పొడవునా విస్తరిస్తున్నారు. మధ్యలో నిరాల, జైనథ్, బెల్గాం బెల్లూరీ, బేల తదితర గ్రామాలున్న నాలుగు చోట్ల తొలుత సర్వీసు రోడ్లు నిర్మించేలా ప్రణాళిక చేశారు. దారి పొడవునా రెండు వరుసల కోసం 30 అడుగులు విస్తరించేలా పనులు జరుగుతున్నాయి. ఆ నాలుగు గ్రామాల్లో ఇరువైపులా రెండు వరుసల బీటీ రోడ్డు(నాలుగు వరుసలు).. మధ్యలో డివైడర్లు, ఆ తర్వాత సర్వీస్ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణం ఇలా మొత్తం 100 అడుగుల రహదారి ఉపయోగించాలని నిర్ణయించారు.

**ఇలా మార్చేశారు..**

కొత్త ప్రణాళిక ప్రకారం ఈ నాలుగు గ్రామాల్లో ఇరువైపులా 11 మీటర్ల(33 అడుగులు) చొప్పున బీటీ దారులు నిర్మిస్తారు. మధ్యలో 5 అడుగుల డివైడర్లు ఉంటాయి. ఇలా మొత్తం 66 అడుగుల రోడ్డు, 5 అడుగుల డివైడర్, ఇరువైపులా 6 అడుగుల చొప్పున మురుగు కాల్వల కోసం వదలగా.. మొత్తం 83 అడుగుల స్థలాన్ని వినియోగించనున్నారు. ఇంకా 17 అడుగుల స్థలం(ఒక్కో దిక్కు 8.5 అడుగులు) మిగలనుండటం విమర్శలు దారితీస్తోంది.

**మతలబు ఇదేనా..** వాస్తవానికి జాతీయ రహదారి వెళ్లే గ్రామాల వద్ద ప్రజల రద్దీ దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా ఈ సర్వీస్‌రోడ్ల నిర్మాణం అత్యవసరం.. భారీ వాహనాల ఆటంకం లేకుండా ఈ సర్వీస్ రోడ్లపై రాకపోకలు సాగించవచ్చు. ఇక్కడ మాత్రం బేల మండల కేంద్రంలో 2 కి.మీ పొడవునా ఉన్న వ్యాపార సముదాయాల్లో కొద్దిమందికి నష్టం వస్తుందనే భావనతోనే ఈ సర్వీస్ రోడ్లను మొత్తానికే ఎత్తివేశారనే ఆరోపణలున్నాయి. ఒక్కచోట మార్చితే విమర్శలు వస్తాయనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా నాలుగు గ్రామాల్లోనూ డిజైన్ మార్చారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై జాతీయ రహదారి శాఖ డీఈ సుభాష్‌తో మాట్లాడుతూ డిజైన్ మార్పు అనేది ఏమీ లేదని, సర్వీస్ రోడ్లు లేకుండా జాతీయ రహదారినే మరింత విస్తరించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

# బండి కదలదు.. చెత్త తొలగదు!



ఆదిలాబాద్ : బల్దియాలో పని చేస్తున్న వాహనాల్లో కొన్ని 15 ఏళ్లకు పైబడటంతో తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో పలు కాలనీలకు చెత్త సేకరణకు వాహనాలు వెళ్లక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య విభాగానిది కీలకపాత్ర.. ఒకరోజు చెత్త ఎత్తకపోయినా ఇంట్లో దుర్వాసన వస్తుంది. బయట పడేస్తే పరిసరాలు అపరిశుభ్రమవుతాయి. పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను అందజేద్దామంటే కొన్ని కాలనీలకు చెత్త బండే వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.. పారిశుద్ధ్య విభాగాన్ని వాహనాల కొరత వేధిస్తుండగా.. కాలం చెల్లిన వాహనాలు తరచూ చెడిపోతున్నాయి. పట్టణంలో చెత్త సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

బల్దియా పరిధిలో ప్రతి రోజు 72 మెట్రిక్ టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాల్వల్లో పూడిక తీసి, రహదారులను ఊడ్చి, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలి. చెత్త సేకరణకు వార్డుకు ఒక వాహనం పెట్టామని అధికారులు చెబుతున్నారు. పెద్ద వార్డుల్లో ఒకే వాహనంతో అన్ని ఇళ్లలో చెత్తను తీయడం సాధ్యపడటం లేదు. దీంతో రోజు తప్పించి మరో రోజు వాహనం పంపుతున్నారు. పట్టణం మధ్యప్రాంతంలోని వార్డులు, ప్రధాన రహదారులు, వ్యాపార, వాణిజ్య సముదాయ ప్రాంతాల్లో మాత్రం సక్రమంగా వాహనాలు నడుపుతున్నారు. శివారు కాలనీల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న వాహనాల్లో కొన్ని కాలం చెల్లినవి తరచూ మొరాయిస్తున్నాయి. కాలనీలో చెత్త సేకరణకు వాహనం వెళ్లకపోయినా, ఆలస్యమైనా ప్రజలు అక్కడక్కడా రోడ్ల మీద, మూలమలుపుల వద్ద పడేసి వెళ్తున్నారు.

చెత్త సేకరణకు గతంలో 8 వాహనాలు కొనుగోలు చేయాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. అందులో ఆరు ట్రాలీలు, ఒక ట్రాక్టర్, మరో జేసీబీ కొనుగోలు చేయాలని అనుకున్నారు. బల్దియాకు కొన్ని నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు సకాలంలో విడుదల కావడం లేదు. సరిపడా వాహనాలు లేక పారిశుద్ధ్య సమస్యలు పూర్తిగా పరిష్కారం కావడం లేదు.

**కొత్తవి కొనుగోలు చేస్తాం** సీవీఎన్ రాజు, కమిషనర్, బల్దియా

బల్దియాలో చెత్త సేకరణకు పారిశుద్ధ్య వాహనాల కొరత ఉంది. నిధుల సమస్య కారణంగా కొత్తవి కొనుగోలు చేయలేకపోయాం. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ గ్రాంట్ కింద కొత్త వాహనాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం.

# బాధితులకు అండ.. సైబర్ వారియర్స్

గోదావరిఖని : రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. బాధితుల్లో చాలామంది సామాన్య ప్రజలే ఉంటున్నారు. మోసపోయాక ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక చాలామంది జాప్యం చేస్తున్నారు. దీంతో పరిస్థితి చేయిదాటిపోయి డబ్బుల రికవరీపై ప్రభావం పడుతోంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవగాహన లేక.. టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలన్నది తెలియక.. డబ్బు పోగొట్టుకున్న బాధతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల మోసానికి బలవుతూనే ఉన్నారు. ఇలాంటి వారికి సైబర్ వారియర్స్ మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 66 మంది..**

సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌కు వెళ్లే సౌకర్యం అందరికి లేకపోవడంతో ప్రతి ఠాణాలో ఒక సైబర్ వారియర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని ఠాణాకు ఒకరి చొప్పున పోలీసు శాఖ నియమించింది. వీరికి సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కల్పించింది. సాంకేతికంగా శిక్షణ ఇచ్చి కేసులను ఛేదించే విధంగా తయారు చేసింది. ఆయా ఠాణాల పరిధిలో జరిగే సైబర్ మోసాలకు బలైన బాధితులకు న్యాయం చేసేందుకు సైబర్ వారియర్స్ పనిచేస్తున్నారు. మోసపోయిన డబ్బులు ఫ్రీజ్ చేయడంతో పాటు కేసుకు సంబంధించిన కోర్టు ఆదేశాలు.. బ్యాంకు అధికారులతో సంప్రదింపులు




చేస్తూ బాధితులకు న్యాయం చేసేందుకు నిరంతరం పనిచేస్తున్నారు. వీరికి 24 గంటలు సేవలందించేందుకు ప్రత్యేకంగా సిమ్‌కార్డులను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 66 మంది సైబర్ వారియర్స్ సేవలందిస్తున్నారు.

**విధులు** బాధితులు మోసపోయిన గంటలోపు సంప్రదిస్తే కోల్పోయిన డబ్బులు ఫ్రీజ్ చేయిస్తారుసైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబరు 1930 సేవలు, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంపై అవగాహన కల్పిస్తారు

సైబర్ క్రైం పోర్టల్‌లో బాధితులతో ఫిర్యాదులు అప్‌లోడ్ చేయిస్తారు రూ.25 వేలకు మించి మోసపోతే ఎఫ్ఐఆర్ చేసి విచారణ చేపడతారు రూ.7 లక్షల లోపు మోసానికి గురైతే ఠాణా పరిధిలోనే విచారణ చేస్తారు ఫ్రీజ్ చేయించిన డబ్బులను తిరిగి బాధితులకు ఇప్పించే వరకు చర్యలు తీసుకుంటారు చిత్రంలో రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సైబర్ వారియర్ సాయి వెంకటకృష్ణ గోదావరిఖని ఒకటో పట్టణ ఠాణా పరిధిలో పనిచేస్తున్నారు. సాయి వెంకటకృష్ణ బాధితులు మోసపోయిన రూ.5 లక్షల రిఫండ్‌కు కోర్టు నుంచి ఆర్డర్ ఇప్పించడంలో ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్డర్ ద్వారా సంబంధిత బ్యాంకుల నుంచి బాధితులకు తిరిగి చెల్లించేందుకు కృషి చేశారు. దీంతో సీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.

# బడిలో క్లబ్‌లు.. సృజనకు మెరుగులు..!


కల్లూరు: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా విద్యార్థులతో క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వివిధ అంశాల్లో బాలలకు అవగాహనను పెంపొందిస్తున్నారు. జిల్లాలో 332 ఉన్నత పాఠశాలలు, 230 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎకో, ప్రహరీ సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. అలాగే 24 పీఎంశ్రీ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లతో పాటు డిజిటల్ లెర్నింగ్ అండ్ స్టెమ్, గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ సేఫ్టీ, సాహిత్య, సాంస్కృతిక, క్రీడలు, ఆరోగ్యం తదితర క్లబ్‌లు ఏర్పాటయ్యాయిఈ క్లబ్‌ల ఏర్పాటు.. వాటి ఉపయోగాలను పరిశీలిస్తే..

**ఎకో క్లబ్**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కల పెంపకం. ప్రతి విద్యార్థి తమ తల్లితో కలిసి ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలి. అలాగే వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు తయారీ, ఇంకుడు గుంతలు ఏర్పాటుతో వర్షపు నీటిని ఇంకేలా చేయడంపై అవగాహన పెంపొందిస్తారు. పిల్లలు వివిధ రూపాలలో వాడిన నీటిని మొక్కలకు అందిస్తారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు.. పాఠశాలలో భద్రత, పరిశుభ్రత పాటించడం నేర్పిస్తారు.

**డిజిటల్ లెర్నింగ్..**

పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఐఎఫ్‌బీ ప్యానెల్స్ ద్వారా విద్యాబోధన కొన్ని చోట్ల సాగుతోంది. దీనికి అనుగుణంగా అభ్యసన, డిజిటల్ తరగతులతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడం, త్వరగా నేర్చుకోవడం, జ్ఞాపకం ఉంచుకోవడం తదితర



అంశాలపై ఈ క్లబ్ పనిచేస్తుంది.

**సాహిత్య, కళ క్లబ్..**

పిల్లలకు నచ్చే అంశాలతో పాటు.. ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలు నేర్పుతారు. నైపుణ్యాభివృద్ధి, పండగలకు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు రాఖీలు, గణపతుల మట్టి విగ్రహాల తయారీ, కళా నైపుణ్యాలు పెంపొందించడం వంటి కృత్యాల సాధన చేయిస్తారు. అలాగే సాహిత్యం, కళలు, సాంస్కృతిక అంశాల్లోనూ ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారి నైపుణ్యానికి మెరుగులద్దుతారు.

**గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్, సేఫ్టీ..**

బాలికల విద్య ప్రాధాన్యం, లింగ సమానత్వంపై అవగాహన, ప్రధానోపాధ్యాయురాలితో సమస్యలపై చర్చ, యవ్వన దశ ఆరోగ్యంపై బాలబాలికలకు అవగాహన, పోషకాహారంతో మనిషి జీవన ప్రమాణాల మెరుగుదల.. విటమిన్లు, మినరల్స్ ప్రోటీన్లు లభించే కూరగాయలు, పండ్లు, తినడం వల్ల ప్రయోజనాలను వివరిస్తారు. స్వీయ రక్షణకు కరాటే, తైక్వాండోలో ప్రాథమిక శిక్షణ.

**క్రీడా, సాంస్కృతిక క్లబ్‌లు**

క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించడం, నాయకత్వ లక్షణాలు పెంచడంతోపాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తారు.

# అరుగుతున్న టైర్లు.. కదులుతున్న పూసలు

తాండూరు : తాండూరు– హైదరాబాద్ మార్గం మరింత అధ్వానంగా మారింది. రోడ్డు పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని చెప్పి.. నెలలు గడుస్తున్నా వాటి ఊసే లేదు. నిత్యం లక్షల మంది వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. అడుగుకో గుంత.. కంకర తేలిన దారిపై ఊపిరి బిగపట్టుకొని ప్రయాణిస్తున్నారు. వాహనాల టైర్లు తరుగుతున్నాయని, వెన్నుపూసలు కదులుతున్నాయని కార్లు, ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారు వాపోతున్నారు. నిధులు మంజూరై గుత్తేదారులకు టెండర్లు అప్పగించినా పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గుత్తేదారును ఆదేశించినా ఫలితం లేదు. రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

**ఎన్నో ఏళ్లుగా..**తాండూరు– హైదరాబాద్‌కు రోజూ సుమారు 2 లక్షలకుపైగా బస్సులు, లారీలు, ద్విచక్రవాహనాలు, ఇతర వాణిజ్య పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, జిల్లా కేంద్రం వికారాబాద్‌కు వెళ్లాలంటే ఇదే ప్రధాన దారి. సుమారు 16 ఏళ్లుగా ప్రయాణికులు కష్టాలు పడుతూనే ఉన్నారు. వాణిజ్యపరంగా సిమెంటు, నాపరాయి, సుద్ద తరలింపు వాహనాలు, బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలతో రద్దీగా ఉంటోంది. అడుగడుగునా గుంతలు, కంకర తేలిన దారిపైనే తంటాలు పడుతున్నారు. అరగంట పట్టే దారిలో వికారాబాద్ వరకు గంటన్నరకు సమయం తీసుకుంటోంది. హైదరాబాద్ వెళ్లాలంటే 5 గంటల పడుతోందని చెబుతున్నారు. రూ.101 కోట్లు నిధులు మంజూరై ఓ కంపెనీ గుత్తేదారుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు అప్పగించారు. తాండూరు నుంచి వికారాబాద్ వరకు 40 కి.మీ.దారి నిర్మాణానికి



వికారాబాద్‌కు చెందిన ముగ్గురు ఉప గుత్తేదారులు పనుల నిర్వహణకు ఒప్పందం చేసుకొని నిర్లక్ష్యం వహిస్తున్నారు.

**టైర్లు, కమాన్‌పట్టీలు నెల రోజులకే పాడయ్యాయి..**

నెలలో కనీసం 20 సార్లు హైదరాబాద్‌కు కిరాయిపై వెళతాను. ధారూరు వరకు 18 కి.మీ. దారికి 40 నిమిషాలు పడుతోంది. దారిపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. కంకర రాళ్లతో టైర్లు, కమాన్‌పట్టీలు నెలరోజుల్లోనే పాడవుతున్నాయి. హైదరాబాద్‌కు కిరాయిపై వెళ్లాలంటేనే భయమవుతోంది. ఏ ప్రజాప్రతినిధి వచ్చినా.. మాకు కష్టాలు తీరడం లేదు. వినయ్, కారు డ్రైవర్, తాండూరు

**హైదరాబాద్ వెళ్లి రావడానికి 9 గంటలు పడుతోంది..**

తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లి రావాలంటే 9 గంటల సమయం పడుతోంది. గుంతల్లో నుంచి బస్సు వెళ్లేటప్పుడు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ ట్రిప్ డ్యూటీ వద్దని వేడుకుంటున్నా.. వెళ్లేదాకా తప్పడం లేదు. రోడ్డు బాగు చేయాలని కోరుతున్నాం.ఆర్టీసీ బస్సు డ్రైవరు

# తరుగు తెచ్చిన తంటా!

పెద్దపల్లి : ఇటీవల సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో డీలర్ అంజయ్య దుకాణానికి వచ్చిన బియ్యం సంచులను తూకం వేయగా ఒక్కో సంచి 46.290 నుంచి 48.780 కిలోల వరకు వచ్చాయి. కానీ ఒక్కో సంచి 50 కిలోలు ఉన్నట్లు రికార్డుల్లో రాసుకుంటారు. పౌరసరఫరాల గోదాం నుంచి సుల్తానాబాద్ ఎంఎల్ఎస్ కేంద్రానికి వచ్చిన 17 సంచులను తూకం వేయగా ఒక్కో సంచి సగటున 50 కిలోలు(గన్నీ సంచితో కలిపి) ఉంది. అయితే 50.600 కిలోలు ఉండాలి.రేషన్ దుకాణాలకు పంపించే బియ్యం సంచుల్లో తరుగు వస్తుందనే ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయి. ఫలితంగా ప్రతి నెలా 2 నుంచి 2.5 క్వింటాళ్ల బియ్యం నష్టపోతున్నామని డీలర్లు వాపోతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులను వివరించినా ప్రయోజనం కలగడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**ఒక్కో సంచికి..**

పౌరసరఫరాల గోదాం నుంచి వచ్చే ఒక్కో సంచిలో 600 గ్రాముల తరుగు చొప్పున క్వింటాకు కిలో, ఎంఎల్ఎస్ కేంద్రాల నుంచి డీలర్‌కు వెళ్లే సంచుల్లో ఒక్కో బస్తాకు రెండు కిలోలు చొప్పున క్వింటాకు 4 కిలోలు తరుగు వస్తుందనే ఆరోపణలున్నాయి. పెద్దపల్లి జిల్లాలో ప్రతి నెలా 44,000 క్వింటాళ్ల బియ్యం రేషన్ దుకాణాలకు అందిస్తున్నారు.



వీటిలో క్వింటాకు 5 కిలోల చొప్పున 220 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమవుతోంది.

**డీలర్లకు కష్టాలు**

రేషన్ దుకాణాల్లో వేలి ముద్రలు వేసే ఈ పాస్ యంత్రానికి వేయింగ్ మిషన్ బ్లూటూత్ ద్వారా అనుసంధానమై ఉంటుంది. ఒక కార్డుదారుడికి ఎంత పరిమాణంలో బియ్యం ఇవ్వాలో అంత తూకం వేస్తేనే విజయవంతం అవుతుంది. డీలర్లు ఇచ్చే బియ్యానికి ఇంత కచ్చితత్వం చూపుతుంది. కానీ వారికి పంపిణీ చేసే బియ్యంలో మాత్రం కచ్చితత్వం లోపించడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. పౌరసరఫరాల గోదాం నుంచి వచ్చే ప్రతీ సంచిని తూకం వేసి ఎంఎల్ఎస్ కేంద్రంలో దిగుమతి చేసుకోవాలి. ఇక్కడి నుంచి తూకం వేసిన తర్వాతే డీలర్లకు పంపించాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో తూకం వేయడానికీ బద్ధకిస్తున్నారు. సంచులు చిరిగినవి ఉండటంతో తరుగు మరింత పెరుగుతోంది. ఈ విషయమై పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి శ్రీకాంత్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# పాదచారి.. నీ మేలుకోరి



హైదరాబాద్: మహానగర వ్యాప్తంగా రద్దీ జంక్షన్లలో ఆకాశమార్గాలు (స్కైవే), ఫుట్‌ఓవర్ వంతెనల నిర్మాణానికి కార్యాచరణ షురూ అయింది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ దీనిపై అధ్యయనం చేస్తోంది. నగరంలోని అత్యధిక రద్దీ ఉన్న 21 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించింది. త్వరలో మరిన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ అంచనా వేసి నివేదికను హెచ్ఎండీఏకు అందించనుంది. తర్వాత దశల వారీగా అవసరాన్ని బట్టి అక్కడ ఆకాశ మార్గాలు...ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోనున్నారు. ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని మెట్రోను కలుపుతూ ఆకాశ మార్గాన్ని నిర్మించడంతో పాదచారులకు ఎంతో ఉపయోగపడుతోంది. మెహిదీపట్నంలో కూడా స్కైవే పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జేఎన్‌టీయూ కూడళ్లలో వాటి నిర్మాణానికి సర్వే చేసేందుకు కన్సల్టెన్సీలను నియమించారు. ముమ్మందు ఐకియా, మియాపూర్ జంక్షన్, ఎల్‌బీనగర్, ఐటీకారిడార్‌లోని 10–15 ప్రాంతాలతోపాటు ఇతర వాణిజ్య, వ్యాపార కూడళ్లలో ఆకాశ మార్గాల అవసరం చాలా ఉందని నిపుణులు చెబుతున్నారు. లిఫ్టులు.. ఎక్సలేటర్లు.. రోడ్డు దాటుతూ తరచూ పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్కైవేల నిర్మాణమే ఇందుకు పరిష్కారమని, ట్రిపుల్‌ఐటీ అధ్యయనం తర్వాత తొలుత అత్యంత రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ నిర్మించాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది. నిధుల సమస్య లేకుండా కొన్నిచోట్ల పీపీపీ విధానంలో వీటిని నిర్మించనున్నారు. మాల్స్, ఐటీ పరిశ్రమలు, మెట్రో, వాణిజ్య భవనాల్లోకి ఆకాశ మార్గాల నుంచి నేరుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తారు.

నగరంలో..గతేడాది గ్రేటర్‌లో పాదచారుల ప్రమాదాలు 1,032

వీరిలో మృతులు 400

గాయాలైన వారు 775 నగరంలో రోడ్డు ప్రమాద బాధితుల్లో 42 శాతం పాదచారులే ఐటీ కారిడార్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ వరకు జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన పాదచారులు: 190 మంది

# ఖాళీ స్థలం.. అదే ఆయనకు వరం



హైదరాబాద్ : ఎక్కడైనా సరే.. ఇల్లు కట్టాక ఇంటి నంబరు వస్తుంది. అల్వాల్ సర్కిల్‌లో అలా ఉండదు. ఖాళీ స్థలాలకే ఇంటి నంబర్లు జారీ అవుతాయి. గడిచిన మూడేళ్లలో సుమారు 300 ఇళ్లకు అడ్డదారిలో, బోగస్ పత్రాలతో ఇంటి నంబర్లు జారీ అయినట్లు.. సంబంధిత విభాగంలోని సిబ్బందే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. “నమ్మండి.. ఈ స్థలంలో పది బంగ్లాలున్నాయి.”లో ప్రచురితమైన కథనంతో.. ఆస్తిపన్ను విభాగంలోని పలువురు సిబ్బంది తమ గోడు వెల్లబోసుకున్నారు. ఉపకమిషనర్ శ్రీనివాసరెడ్డి కనుసన్నల్లో అక్రమాలు జరుగుతున్నాయని.. ఎదురుచెబితే తమను వేధింపులకు గురి చేస్తున్నారని, దుర్భాషలాడుతున్నారని ఆవేదన వెల్లగక్కారు.

**అన్నీ తానై..**

అల్వాల్‌లో యూఎల్‌సీ మిగులు భూములు మున్సిపల్ ఉపకమిషనర్‌కు వరంగా మారాయి. బోగస్‌పత్రాలతో ఆయన ఇచ్చిన ఇంటినంబర్ల ఆధారంగా.. ఆక్రమణదారు ఈ ఏడాది మేలో రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు. ముందుగానే రూ.80 లక్షలు రుసుము చెల్లించారు. బాధితులు భూ వివాదం గురించి న్యాయస్థానంలో కేసు నడుస్తోందని తెలపడంతో.. సబ్‌రిజిస్ట్రారు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆపేశారు. అలా మూడుసార్లు ఆక్రమణదారు స్లాటు రద్దవడంతో.. రుసుమంతా ప్రభుత్వానికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, విజిలెన్స్ అధికారులు, పోలీసులు బదిలీ అవడాన్ని చూస్తే వ్యవహారంలో రాజకీయ ఒత్తిడులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

**సారు తీరే వేరు..**తనకు రాజకీయ అండదండలు, పోలీసుశాఖ దీవెనలు ఉన్నాయంటూ ఉన్నతాధికారి కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందిని నిత్యం వేధింపులకు గురిచేస్తున్నట్టు విమర్శలున్నాయి. ఉదయాన్నే సదరు అధికారి పారిశుద్ధ్య తనిఖీల పేరుతో నిర్మాణంలోని ఇళ్ల ఫొటోలు తీసుకుంటారని, కార్యాలయానికి వచ్చాక.. ఆయా ఇళ్లకు, షెడ్లకు నోటీసులు ఇప్పించి.. సాయంత్రం వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి.ఆర్వీ కర్ణన్, కమిషనర్, జీహెచ్ఎంసీ

ఉపకమిషనర్ అవినీతిపై ఫిర్యాదు అందగానే స్పందించా. బోగస్‌పత్రాలతో ఇచ్చిన ఇంటి నంబర్లను రద్దు చేయించాను. ఆయన అవినీతిపై విచారణ జరుగుతోంది. బాధితులు కేంద్ర కార్యాలయంలో లేదా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

# మురుగు మూసీలోకి..



వికారాబాద్ : జిల్లా కేంద్రం వికారాబాద్‌లో వెలువడే మురుగును శుద్ధి చేసే ప్లాంట్ (ఎస్టీపీ) రెండేళ్లుగా పనిచేయడం లేదు. ప్లాంట్‌లోని మోటార్లు కాలిపోయి, పరికరాలు దెబ్బతినడంతో కేంద్రం నిరుపయోగంగా మారింది. దీంతో మురుగును పట్టణ సమీపంలో పారుతున్న మూసీ నదిలోకి వదులుతున్నారు.

పెద్ద పెద్ద యంత్రాలు..: నీటిశుద్ధి ప్లాంట్‌లో పెద్దపెద్ద యంత్రాలున్నాయి. ముందుగా పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు ఓ పెద్ద ట్యాంకులోకి వచ్చి చేరుతుంది. ఈ ట్యాంకు నుంచి మూడు పైపుల ద్వారా మరో రెండు ట్యాంకుల్లోకి వెళుతుంది. ఇక్కడ మురుగు శుద్ధి అవుతుంది. రియాక్టర్లు, ఫిల్టర్ల ద్వారా నీరు శుద్ధి అవుతుంది. ఆ తరవాత శుద్ధి అయిన నీరు, చెత్త వేరవుతుంది. నీరు ఓ ట్యాంకులో నిల్వ ఉంటుంది. దాన్ని ఎప్పుడు కావాల్సి వస్తే అప్పుడు వినియోగించుకోవచ్చు. చెత్తను ఎరువు కింద వాడుకోవచ్చు.

**ఆరెకరాల్లో ఏర్పాటు..**

పట్టణ పరిధి చాకలి దిబ్బ ప్రాంతంలో 2016లో ప్లాంట్ నిర్మాణం ప్రారంభించి 2018లో పూర్తి చేశారు. దీనికిగాను రూ.13 కోట్లు ఖర్చు చేశారు. శుద్ధి చేసిన నీటిని గోల్ఫ్‌కోర్టు వారికి విక్రయించడానికి ఏడాదికి రూ.5 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. 2019 నుంచి వీరికి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేశారు. రెండేళ్ల తరవాత మోటార్లు కాలిపోవడంతో ప్లాంట్ పనిచేయడం నిలిచిపోయింది. మోటార్లకు మరమ్మతులు నిర్వహించడంతో మరో రెండేళ్లపాటు పనిచేసింది. తిరిగి మోటార్లు కాలిపోయి.. పరికరాలు మరమ్మతుల దశకు చేరడంతో ప్లాంట్ పనిచేయకుండా నిలిచిపోయింది.

**రూ.కోటితో ప్రతిపాదనలు..**పురపాలిక పరిధిలోని ఎస్టీపీ మరమ్మతులకు రూ.కోటితో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరు చేస్తే మరమ్మతులు నిర్వహించి వాడుకలోకి తెస్తాం. ఎస్టీపీ ప్లాంట్ జిల్లాలో ఇదొక్కటే ఉంది. మురుగు నీటిని చెరువులు, నదుల్లో వదిలేయడం ద్వారా నీరు కలుషితం అవుతుంది. ఈ ప్లాంట్ వినియోగంలోకి వస్తే ఈ సమస్య రాదు.రాకేశ్‌రెడ్డి, డీఈ, పురపాలిక సంఘం, వికారాబాద్

# అక్రమార్కులకు ఉపాధి

పెద్దపల్లి: ఇటీవల కాల్వశ్రీరాంపూర్‌లో ఓ చెరువు పూడికతీత పనుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. పని విలువ కంటే కూలీల వేతనాలు ఎక్కువ పొందినట్లు గుర్తించారు.నైపుణ్యం లేని కూలీలకు చట్టబద్ధత కల్పించేందుకు అమలవుతున్న ఉపాధిహామీ పనులు అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఆ సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. మండుటెండలో కష్టపడిన కూలీలను శ్రమ దోపిడీ చేస్తున్నారు. తప్పుడు రికార్డులతో ప్రభుత్వ సొమ్ము స్వాహా చేస్తున్నారు. ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ ప్రజావాణిలో అక్రమాలు వెలుగు చూస్తున్నా ఆ నిధులను తిరిగి రాబట్టడంలో అధికారుల్లో పట్టింపు లేని ధోరణి కనిపిస్తోంది.

**వెలుగు చూసినవి ఇలా..**మూడేళ్ల సామాజిక తనిఖీలు పరిశీలిస్తే జిల్లావ్యాప్తంగా రూ.22,03,009 లక్షలు స్వాహా అయింది. వీటిలో



ఇప్పటి వరకు రూ.17,13,377 రికవరీ చేశారు. మిగిలిన రూ.4,89,632 రికవరీ చేయాల్సి ఉంది. అంతర్గాం మండలంలో రూ.67,082 స్వాహాకాగా రూ.56,096 రికవరీ, సుల్తానాబాద్‌లో 1,99,338కు రూ.1,75,967, ఎలిగేడులో రూ.20,202కు రూ.11,454, రామగిరిలో రూ.1,01,073 అవినీతికి రూ.95,824 రికవరీ చేశారు. ఉపాధిహామీలో పక్కదారి పట్టిన నిధులను రాబట్టడంతో అధికారులకు తలకుమించిన భారమవుతోంది. అవినీతి, అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసినా ఫలితం కానరావడం లేదు.

**కారణాలు ఇవే..**

కొందరు కుమ్మక్కై చేయని పనికి రికార్డు చేసి బిల్లులు పొందుతున్నారు. బోగస్ జాబ్‌కార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు.కంప్యూటర్ నమోదులో తప్పులతో వేతనాల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. పనికి వెళ్లని కూలీల పేరిట సొమ్ము పక్కదారి పడుతోంది.

# చౌకగా కొనెయ్.. అమాంతం పెంచెయ్!

మల్యాల : భూముల ధరలు పెరుగుతుండటంతో కొందరు స్థిరాస్థి వ్యాపారులు వివాదాస్పద స్థలాలపై కన్నేశారు. వివాదాలు పరిష్కరించుకున్నాక నాలుగైదు రెట్లు అధిక ధరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. జిల్లాలో రెండేళ్లుగా సామాన్యులు మొదలు వ్యాపారులు, ఉద్యోగులు క్రిప్టో కరెన్సీలో రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టి నష్టపోవడంతో కొన్ని నెలల పాటు స్థిరాస్థి వ్యాపారం మందగించింది. ఇటీవలి కాలంలో కొందరు వ్యక్తులు జిల్లాలో ఏ ప్రాంతంలో వివాదాస్పద భూములున్నా చౌకగా కొనుగోలు చేస్తూ దందాలకు తెర లేపారు.

**రాజధానిలో రూ.15 కోట్ల పెట్టుబడులు**

మల్యాల మండలంలోని పలువురు ప్రముఖులు, స్థిరాస్థి వ్యాపారులు కలిసి హైదరాబాద్‌లోని ఓ ప్రాంతంలో వివాదాస్పద భూమి కొనుగోలు చేయడానికి దాదాపు రూ.15 కోట్లు పెట్టుబడిగా వెచ్చించినట్లు సమాచారం.

రూ.90 కోట్ల విలువైన భూమి తక్కువ ధరకు వస్తుందని నమ్మించడంతో కొందరు అంత పెద్ద మొత్తాన్ని మధ్యవర్తికి అప్పగించినట్లు తెలిసింది. నెలలు గడుస్తున్నా అటు భూమి దక్కక, ఇచ్చిన డబ్బు తిరిగిరాక ఆందోళన చెందుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కొందరు స్థిరాస్థి వ్యాపారులు, నాయకులు భూముల యజమానులకు తెలియకుండా అధికారుల అండతో అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం గ్రామాల్లో గొడవలకు దారి తీస్తోంది.

భూ ఆక్రమణలకు పాల్పడే వారు బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులు, దాడులకు సైతం వెనుకాడటం లేదన్న ఆరోపణలున్నాయి.

సర్కారు స్థలాలనూ వదలరు!

కొందరు నాయకులు స్థిరాస్థి వ్యాపారులతో కలిసి ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు తెరలేపారు. జిల్లాలోని రాజారం శివారు నుంచి దొంగలమర్రి వరకు ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ సర్కారు భూముల కబ్జా యథేచ్ఛగా జరుగుతోంది. రాజారం, బల్వంతాపూర్,



కొండగట్టు, ముత్యంపేట, నూకపల్లి శివార్లలోని ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటుండగా, మరికొందరు హద్దులు ఏర్పాటు చేసుకున్నారు.

**ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లు**

మల్యాల మండలంలోని పలు చోట్ల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న కొందరు పంచాయతీల నుంచి ఇంటి నంబర్లు కేటాయించేలా చేసుకొని, ఆ పత్రం ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సాధారణమైంది.

ప్రభుత్వ భూమి కలిగిన సర్వే నంబరు కాకుండా మరో నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటూ అడ్డదారులు తొక్కుతున్నారు.

కొండగట్టు ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఏయే గ్రామాల్లో ఎంత విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉందో రెవెన్యూ అధికారులు సర్వే ద్వారా గుర్తించడంతో పాటు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులతో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు మెడికల్ దందా

హైదరాబాద్: గ్రేటర్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రైవేటు మెడికల్ దందా కొనసాగుతోంది. ఆసుపత్రుల కౌంటర్లలో సరిపడా మందులు పంపిణీ చేయక పోవడంతో చాలామంది రోగులు ప్రైవేటులో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొందరు వైద్యులకు ఇందులో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని మెడికల్ స్టోర్లు లీజు గడువు ముగుస్తున్నా ఏదో నెపంతో అక్కడే తిష్ట వేస్తున్నారు.

**దాడులు సరే..:** గతంలో గాంధీ, ఉస్మానియా, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మెడికల్ స్టోర్లపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేసి పలు లోపాలు గుర్తించారు. ఇప్పటివరకు చర్యల్లేవు. నిలోఫర్‌లో మెడికల్ స్టోర్ తొలగించినా రాత్రికి రాత్రే నిర్మించేందుకు ప్రయత్నించ




డంతో వెలుగులోకి తేగా ఆ అధికారిపై వేటు వేశారు.
గాంధీలో 3 ప్రైవేటు షాపులు ఎప్పటి నుంచో నడుస్తున్నాయి.
ఉస్మానియాలో 2 జనరక్, 1 సాధారణ మెడికల్ షాపు ఉంది.
గాంధీలో పడకల సామర్థ్యం 1600.. రోగులు 1800 ఉంటున్నారు.
ఉస్మానియాకు 2 వేల మంది వస్తున్నారు.
నిలోఫర్‌లో వేయికిపైగానే చికిత్సకు వస్తారు.
వైద్యులు 6 రకాలు రాస్తే 4కు మించి ఇవ్వడం లేదు. బయట కొనాల్సి రావడంతో భారం పడుతోంది.

# ఆరు వరుసలతోనే.. కులాసా

చౌటుప్పల్ : హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఏటా పది శాతం పెరుగుతోంది. 2012 డిసెంబరులో నాలుగు వరుసల రహదారి ప్రారంభమైన సమయంలో యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా మీదుగా రోజుకు ఇరువైపులా కలిపి 15 వేల వాహనాలు వెళ్లేవి. ఇప్పుడు ఈ సంఖ్య 40 వేలకు పెరిగింది. వారాంతపు దినాల్లో, పెళ్లిళ్లు, వేడుకల సీజన్‌లో మరో ఐదు వేల వాహనాలు అధికంగా వెళ్తాయి. గత సంక్రాంతి పండగకి రికార్డు స్థాయిలో 84,262 వాహనాలు వెళ్లాయి.

రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులతో రాజధాని శివారు ప్రాంతం చౌటుప్పల్ వరకు వాహనాల సందడి అధికంగా ఉంటుంది. ఇప్పటికే ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు ఆరు వరుసల రహదారి నిర్మాణం పూర్తి కావడంతో వాహనదారులకు కొద్దిగా ట్రాఫిక్ బాధలు తప్పాయి. దండుమల్కాపురం నుంచి విజయవాడ వరకు ఆరు వరుసలు నిర్మిస్తే ప్రయాణికులకు ప్రమాదాలు, ట్రాఫిక్ తిప్పలు తప్పుతాయి.

రెండు వరుసలున్న హైవేను నాలుగుగా నిర్మించేందుకు రూ.1740 కోట్లకు ఓ సంస్థ 2010లో టెండర్ దక్కించుకుంది. తెలంగాణలోని దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా నిర్మించింది. బీవోటీ పద్ధతిన హైవే నిర్మాణాన్ని చేపట్టడంతో తెలంగాణలో పంతంగి, కొర్లపహాడ్, ఏపీలో చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేశారు. టోల్ వసూళ్లతోపాటు హైవే పర్యవేక్షణనూ జీఎమ్మార్ చూసేది.

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆరు వరుసల విస్తరణను దండుమల్కాపురం నుంచి గొల్లపూడి వరకు 265 కిలోమీటర్ల మేర చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా వెంటనే స్పందించి సానుకూలతను తెలిపింది. నందిగామ నుంచి గొల్లపూడి వరకు ఆరు వరుసలకు ఎంత భూమిని సేకరించాలి, మొత్తం రహదారి నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో ఐకాన్స్ సంస్థ అంచనా వేయనుంది. డీపీఆర్ ముగింపు దశకు చేరుకుందని, త్వరలో ఆరు వరుసల పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఎన్‌హెచ్ఏఐకి చెందిన ఉన్నతాధికారి పేర్కొన్నారు.

2024 నాటికే ఆరు వరుసలను కూడా పూర్తి చేయాలని ఆరంభంలోనే ఒప్పందం ఉంది. తెలుగు రాష్ట్రాల విభజనతో ఇసుక లారీలు, రవాణా వాహనాలు తగ్గి రోజుకు రూ.20లక్షల మేర.. నెలకు రూ.6 కోట్ల వరకు నష్టం వస్తుందని జీఎమ్మార్ సంస్థ కోర్టును ఆశ్రయించడంతో ఆరు వరుసల విస్తరణకు జాప్యం జరిగింది. 2025 జూన్ వరకు జీఎమ్మార్ సంస్థకు టోల్ వసూళ్ల అవకాశం ఉండగా.. ఎన్‌హెచ్ఏఐ జీఎమ్మార్ నష్టాన్ని భర్తీ చేస్తామని చెప్పి.. గతేడాది జూన్‌లోనే హైవే నిర్వహణ, టోల్ వసూళ్ల నుంచి సదరు సంస్థను పక్కకు తప్పించింది. ఆరు వరుసల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్) రూపకల్పనకు ఎన్‌హెచ్ఏఐ టెండరింగ్ వేసింది. ఐకాన్స్ సంస్థ టెండర్‌ను దక్కించుకొని గత నాలుగు నెలల నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతుంది. దండుమల్కాపురం నుంచి నందిగామ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ సమయంలోనే ఆరు వరుసలకు సరిపడా భూసేకరణ జరిగింది. అండర్‌పాస్ వంతెనలు నిర్మించిన చోట, చౌటుప్పల్, చిట్యాల పట్టణ కేంద్రాల్లో ఆరు వరుసలను అప్పట్లోనే నిర్మించారు.

# నిబంధనలకు నీళ్లు.. సెల్లార్ల చిల్లు

నల్గొండ : జిల్లాలోని ప్రధాన పురపాలికల్లో ఇష్టారాజ్యంగా సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మేడల మీద మేడలు అక్రమంగా నిర్మిస్తున్నారు. వీటి వెనుక రూ.లక్షల నిధులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రధానంగా నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ చిట్యాల, నకిరేకల్ పురపాలికల్లో వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే సెల్లార్లు నిర్మిస్తున్నారు. వానాకాలంలో సెల్లార్లు తవ్వొద్దని ఆదేశాలున్నప్పటికీ బేఖాతర్ చేస్తున్నారు. పుర, పట్టణ ప్రణాళిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నల్గొండలో ఇటీవల వాణిజ్య భవనాల నిర్మాణాలు జోరందుకున్నాయి. వాటికితోడు బహుళ అంతస్తుల భవనాల సైతం నిర్మిస్తున్నారు. కానీ అనుమతులకు విరుద్దంగా సెల్లారు తవ్వేస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ రోడ్డులో ఎన్జీ కళాశాల ఎదురుగా పదుల సంఖ్యలో వాణిజ్య భవనాల్లో సెల్లార్లు నిర్మిస్తున్నారు. ఎల్‌వీ పెట్రోల్ బంకు నుంచి మొదలు మదర్‌డెయిరీ వరకు, దేవరకొండ రోడ్డు 565 జాతీయ రహదారి పక్కన సైతం ఇష్టారాజ్యంగా నిర్మించి నిబంధనలు అతిక్రమించారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల్లో అక్రమంగా సెల్లార్ల నిర్మాణాలు చేపట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్ నల్గొండ పురపాలిక క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తాం. అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తే నోటీసులు జారీ చేస్తాం. నిర్మాణాలు నిలిపివేస్తాం. అవసరమైతే కూల్చివేస్తాం.

# కొత్త సంఘం.. అభివృద్ధికి దోహదం



వికారాబాద్ : మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముందుకెళ్తోంది. ఇందుకోసం కొత్త పథకాలను అమలు చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్నవే కాకుండా కొత్తగా 60ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, 15 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలతో సంఘాలను ఏర్పాటు చేశారు. వీరంతా రుణాలు తీసుకోని అభివృద్ధి చెందనున్నారు.

**పెట్రోలు బంకులు..**

జిల్లాలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా నాలుగు మండలాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. కొత్తగా వ్యాపారాలకు సహకారం అందిస్తున్నారు. దుద్యాల మండల సమాఖ్య ద్వారా పెట్రోల్ బంకును దుద్యాల మండలం హకీంపేటలో ఏర్పాటు చేయనున్నారు. సౌర ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో 10 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. బషీరాబాద్ మండలం దామర్‌చెడ్‌లో 5 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.3 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**వేగంగా రుణాలు:** సంఘాలకు ఇవ్వాల్సిన రుణ లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. 2025-26లో 12,615 సంఘాలకు రూ.554 కోట్ల రుణం కేటాయించాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 2,144 సంఘాలకు రూ.205 కోట్లు మంజూరు చేశారు.

**ఆర్థిక బలోపేతమే లక్ష్యం: శ్రీనివాస్, డీఆర్డీఓ**

కొత్త సంఘాల ఏర్పాటుతో మహిళలు మరింత ఆర్థిక అభివృద్ధి చెందుతారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వివిధ కార్యక్రమాలు చేపడతాం. సోలార్ పవర్ ఉత్పత్తి కేంద్రాల పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కొత్త సంఘాలను ఏర్పాటు చేశాం. వారికి రుణ సౌకర్యం కల్పిస్తాం.

జిల్లా వివరాలు:
మండల సమాఖ్యలు: 20
గ్రామైక్య సంఘాలు: 657
వృద్ధులు : 378
కిశోర బాలికలు: 258
దివ్యాంగులు: 358
కొత్తగా ఏర్పడినవి: 172
స్వయం సహాయక సంఘాలు: 16,087
మొత్తం సభ్యులు: 1,63,955

# బాలలకు పాఠం.. విలువలకు పట్టం



కొడంగల్ : జాతీయ విద్యావిధానం -2020 అమల్లో భాగంగా విద్యాశాఖ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఇప్పటికే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, ఐకమత్య భావన పెంపొందించేందుకు పాఠశాలల్లో 'హౌజ్ సిస్టం, స్టూడెంట్ కౌన్సిల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. తాజాగా మరో అడుగు వేసి ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువలను బోధించడం.. సామాజిక అవగాహన కల్పించేందుకు విలువల విద్యకు సంబంధించిన పాఠాలను ఆన్‌లైన్ విధానంలో టీ-శాట్ ద్వారా అందించనుంది. నేటి నుంచి ప్రారంభించనున్నారు. విద్యా సంవత్సరంలో 16 సెషన్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వారంలో ఒక రోజు..**


ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు, నిజాయతీ పెంచేందుకు ఈ విద్యా సంవత్సరంలో పలు అంశాలపై పాఠాల బోధన ఉంటుంది. వారంలో ఒక రోజు ప్రధానంగా గురువారం 45 నిమిషాల పాటు జరుగుతుంది. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 1.50 గంటల వరకు, ఉన్నత తరగతుల వారికి మధ్యాహ్నం 2.55 నుంచి 3.35 గంటల వరకు ప్రసారాలు ఉంటాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలను రూపొందించారు. షెడ్యూల్ వివరాలు: ఈనెల 18, అక్టోబరు 9, 16, 23, 30, నవంబరు 6, 20, 27, డిసెంబరు 4, 11, 18, 29 వరకు ప్రసారాలు నిర్వహిస్తారు.

అంశాలు: ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు:
సంకల్పమే విజయానికి కీలకం.
జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవడం.
నిజాయతీ, కృతజ్ఞత, కలిగి ఉండడం.
ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించడం.
భాగస్వామ్యం-సంరక్షణ, క్రమశిక్షణ విలువ
ఓపిక, కరుణ, తోటి పిల్లలతో వ్యవహరించే విధానం.
ఉన్నత తరగతుల వారికి:
సంతోష రహస్యం, క్రమశిక్షణ.
ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవన శైలి
ఒత్తిడి నిర్వహణ- సమస్య పరిష్కారం
ఆలోచన, సంఘశక్తి, బాధ్యత, జీవితం విలువైనది.

ఎంతగానో ఉపకరిస్తాయి
విద్యార్థులకు నైతిక విలువలను నేర్పడంతో జీవితంలో ఉన్నతంగా ఎదిగే అవకాశం ఉంటుంది. క్రమశిక్షణ అలవడి, ఇరుగుపొరుగు వారితో సఖ్యతతో మెలుగుతారు. ఈ పాఠ్యాంశాలు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయి. విజయరామారావు, మండల విద్యాధికారి, దుద్యాల

**జిల్లాలో బడులు ఇలా..**
ప్రాథమిక: 774
ప్రాథమికోన్నత: 116
ఉన్నత: 176
మొత్తం విద్యార్థులు: దాదాపు 77,505 మంది

# పుస్తక భాండాగారాలకు కష్టకాలం



హైదరాబాద్: విజ్ఞాన భాండాగారాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సెస్ బకాయిలు విడుదల కాకపోవడం.. సిబ్బంది, కొత్త పుస్తకాల కొరత వల్ల ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. గ్రంథాలయాల్లో దశాబ్దాలుగా ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా మారింది. సుమారు 30 ఏళ్లుగా రెగ్యులర్ పోస్టుల భర్తీ లేదు. తాత్కాలిక పద్ధతిలోనే నియమిస్తున్నారు. నగరంలోని గ్రంథాలయాలకు సరిపడా గ్రంథపాలకులు లేరు. ఒక్కొక్కరికి మూడు, నాలుగు చోట్ల ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు అప్పగించారు. వారు ఎక్కడా సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారు.

**రూ.4 వేల కోట్ల బకాయిలు** కొన్నేళ్లుగా లైబ్రరీ సెస్ పెండింగ్‌లో ఉంది. రాష్ట్రంలో సెస్ ఆధారంగా నడిచే లైబ్రరీలు 600 వరకు ఉన్నాయి. వాటికి సంబంధించి రూ.4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయి. నగర పరిధిలో రూ.1,600 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

**సహాయకులు లేక అధికారుల అవస్థలు**

నగరంలోని 82 గ్రంథాలయాలకు సిటీ సెంట్రల్ లైబ్రరీ కేంద్ర బిందువు. ఆయా ప్రాంతాల్లోని పుస్తకాలయాల్లో లైబ్రేరియన్లు లేకపోవడంతో స్వీపర్లతో నెట్టుకొస్తున్నారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో వయసుల వారీగా ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. వాటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేరు. సహాయకులు లేక అన్ని పనులు తామే చేసుకోవాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు. ఒక్కొక్కరు నాలుగు సెక్షన్లను పర్యవేక్షించాల్సి రావడంతో పుస్తకాల భద్రతపై నిఘా కొరవడుతోందన్నారు.

**40 మందికి నలుగురే**

చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీకి నిత్యం వందల మంది ఉద్యోగార్థులు వస్తుంటారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి గ్రంథపాలకులు, రికార్డు అసిస్టెంట్లు, భద్రత, ఇతర సిబ్బంది మొత్తం 40 మంది అవసరం. ప్రస్తుతం నలుగురు ఉద్యోగులే ఉన్నారు. మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏ చిన్న ఉద్యోగ ప్రకటన వెలువడినా లైబ్రరీ నిరుద్యోగులతో కిక్కిరిసిపోతుంది.

# ఆరని దీపం.. ఆర్థిక భారం

నల్గొండ : నల్గొండ జిల్లాలోని పురపాలికల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. పగలు, రాత్రి వెలుగుతుండటంతో పుర సంస్థలపై కరెంటు బిల్లుల రూపంలో ఆర్థిక భారం పడుతోంది. జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీ.. వీధి దీపాలను నిర్వహిస్తోంది. పర్యవేక్షణ, నిర్వహణకు సంబంధించిన బిల్లులు సకాలంలో సదరు సంస్థకు చెల్లించకపోవడంతో లైట్ల మరమ్మతులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా నల్గొండ, మిర్యాలగూడల్లో వీటి నిర్వహణ కొద్దిగా బాగున్నా.. నకిరేకల్, నందికొండ, చండూరు, దేవరకొండ, హాలియా, చిట్యాలల్లో మరమ్మతులు, ఆన్‌ఆఫ్ స్విచ్‌లు, మూడో తీగ ఏర్పాటు లేకపోవటంతో పురాలపై బిల్లుల భారం పడుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

నల్గొండ పట్టణమంతా వెలుగులు వెలుగుతుండగా, నకిరేకల్-నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు ఎన్‌హెచ్ నిర్వహణలో ఉన్నాయి. దీంతో నల్గొండలోని దేవరకొండ రోడ్డులో కొన్ని ప్రాంతాలు చీకటిమయంగా మారాయి.

చండూరులో 20 నెలలుగా లైట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. వీటి నిర్వహణ చూస్తున్న ఏజెన్సీకి బకాయిలు చెల్లించకపోవడంతో అలాగే గాలికొదిలేశారు.

చిట్యాల పట్టణంలో వీధి దీపాల నిర్వహణలో కీలకమైన టైమర్లు 46 వరకు పనిచేయడం లేదు. వాటిని బాగు చేయకపోవడంతో రాత్రి, పగలు వెలుగుతున్నాయి.

మిర్యాలగూడ పట్టణంలో మరమ్మతులు నిర్వహించే సిబ్బంది కొరతతో జాప్యం జరుగుతోంది. టైమర్లు సక్రమంగా లేకపోవడంతో పుర సిబ్బందే మ్యాన్‌వల్‌గా బంద్ చేస్తున్నారు.

నందికొండ, హాలియా పురపాలికల్లో లైట్ల ఆన్‌ఆఫ్ వ్యవస్థ పూర్తిగా అగమ్యగోచరంగా మారింది. ఒకరిద్దరూ సిబ్బంది ఉన్న నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో ఆయా పురపాలికలపై కరెంటు బిల్లుల భారం రూపంలో ఏటా రూ.30 లక్షలకు పైగా పడుతోంది.

**జాప్యం లేకుండా మరమ్మతులు:** ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

నల్గొండలో చెడిపోయిన లైట్లకు వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ఒక్కోసారి వర్షాలు, మెరుపుల వల్ల దీపాలు ఎక్కువ చెడిపోతే మరమ్మతులకు కాస్త ఆలస్యమవుతుంది. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు, టైమర్లు ఏర్పాటు చేయించాం.

# పింఛను సొమ్ము.. తీసుకోవడం సులువు

సూర్యాపేట : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే చేయూత, ఆసరా పింఛన్లను ముఖ గుర్తింపు (ఐరిస్) విధానంతో పంపిణీ చేస్తున్నారు. ఈ విధానంతో లబ్ధిదారులకు చాలా వరకు ఇబ్బందులు తప్పాయి. నెల క్రితం వరకు పింఛనుదారులకు తపాలా కార్యాలయాల ద్వారా అధికారుల వేలిముద్రల ఆధారంగా సొమ్ము అందించేవారు. ప్రస్తుతం ఐరిస్ విధానం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట పడటంతో పాటు సేవల్లో వేగం పెరగనుంది. ముఖ గుర్తింపు రాని వారికి వేలిముద్రల ఆధారంగా, అది కూడా రాని వారికి పంచాయతీ కార్యదర్శి వేలి ముద్ర ద్వారా అందిస్తున్నారు. దీంతో కొంత వరకు ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి.

**అక్రమాలకు చెక్...**



జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర 1.45 లక్షల మందికి రూ.36.50 కోట్ల పింఛను ప్రతినెలా అందిస్తున్నారు. పింఛను అందుకునే వారిలో ఎక్కువ మంది గ్రామీణ కూలీలు, వృద్ధులు ఉన్నారు. వేలి ముద్రలు పడక చాలా మంది పింఛను తీసుకునే సమయంలో ఇబ్బంది పడేవారు. ఐరిస్ విధానంతో ఈ కష్టాలు దూరం కానున్నాయి. పాత విధానంలో వేలిముద్రలు రాని లబ్ధిదారులు 5 శాతం మందికి పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రలు వేసి అందించేవారు. ఈ క్రమంలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము పూర్తిస్థాయిలో అందేది కాదనే విమర్శలున్నాయి. కొందరు బీపీఎంలు, పంచాయతీ కార్యదర్శులు నగదును తమ సొంతానికి వాడుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుత విధానంలో ఐరిస్ రాకుంటే లబ్ధిదారుడి చిత్రంతో పాటు పంచాయతీ కార్యదర్శి చిత్రం నమోదు చేయనుండటంతో అక్రమాలకు చెక్ పడింది.

**సత్ఫలితాలు: అప్పారావు, డీఆర్డీవో**

పింఛన్ల జారీలో అమలులోకి వచ్చిన ఐరిస్ విధానం సత్ఫలితాలు ఇస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ మంది లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్నారు. పారదర్శకత పెరిగింది.

# ఇద్దరి పని ఒక్కరికి..!

సూర్యాపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకం. టీచర్లు, సహాయకులు ఖాళీలు ఉన్నచోట ఇద్దరి పని ఒక్కరే చేయడంతో పూర్తిస్థాయిలో సేవలు అందించడం ఇబ్బందికరంగా మారుతోంది. జిల్లాలో 5 ప్రాజెక్టులు ఉండగా.. 1209 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా, టీచర్లు కలిపి 2418 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉంది. 1,131 మంది టీచర్లు, 935 మంది ఆయాలు పనిచేస్తున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక వికాసం, వివరాల నమోదులో జాప్యం జరుగుతోంది. ఆయాలేని కేంద్రాల్లో భోజనం తయారీ ఇబ్బందిగా ఉంటే టీచర్లు లేనిచోట పిల్లలకు అక్షరాలు దిద్దించలేని పరిస్థితి నెలకొంది. పోస్టుల భర్తీకి మూడు నెలల క్రితం ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినా అధికారికంగా ప్రకటన నేటికీ వెలువడలేదు. ప్రకటన విడుదలైతే భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఖాళీల భర్తీకి సంబంధించిన మార్గ దర్శకాలు ఇచ్చింది. సహాయకులు, టీచర్ల పోస్టులకు ఇంటర్ పూర్తి చేసి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకొనేలా నిబంధన విధించింది.

చురకలు



# ఆగాలి కలుషితం

చిత్తూరు : దేశంలోని వివిధ నగరాల్లో 2014–18 మధ్య గాలి నాణ్యతపై అధ్యయనం చేయగా చిత్తూరులో కాలుష్యం పెరుగుతోందని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఎన్‌సీఏపీ (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం) కింద నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. 2019–20లో చిత్తూరు కార్పొరేషన్‌కు రూపాయి రాలేదు. 2020–21 నుంచి 2023–24 వరకు నాలుగేళ్లలో రూ.7 కోట్లు మంజూరు కాగా నియంత్రణ చర్యలు పెద్దగా చేపట్టలేదు.

చిత్తూరు ప్రజలకు స్వచ్ఛమైన గాలే అందడం లేదు. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి చెప్పిన నిజం ఇది.

వాయు నాణ్యత ప్రమాణాలు అందుకోలేని నగరాలు రాష్ట్రంలో 13 ఉండగా చిత్తూరు వాటితో పోటీ పడుతోంది.

కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్



ర్యాంకుల్లోనూ 2024లో 21వ స్థానంలో నిలవగా.. 2025లో 29వ స్థానానికి పడింది. తిరుపతి నగరపాలక సంస్థ ఘన వ్యర్థాల నిర్వహణ మెరుగ్గా చేస్తోంది. తూకివాకంలోని సమీకృత వ్యర్థాల ప్లాంటులో సేంద్రియ వ్యర్థాలను మిథేన్‌గా మారుస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఇతర నిర్మాణాలకు వాడుతున్నారు. రహదారులపై దుమ్ము లేకుండా పారిశుద్ధ్య కార్మికులు చూస్తున్నారు. ఇలా ప్రతి అంశంలోనూ తిరుపతిలో చర్యలు చేపట్టడంతో ఏక్యూఐ 80–96 మధ్య ఉంది.

**ఏం చేయాలంటే?**

చిత్తూరులో గ్రానైట్, భవనాలు కూల్చిన వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. చికెన్, ఆహార శుద్ధి పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలను సరిగా శుద్ధి చేయడం లేదనే ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టడంతో పాటు మొక్కలు విరివిగా నాటాలి.

# వెలుగులు నింపి.. చీకట్లో మగ్గి

ఏర్పేడు : వారంతా రూ.లక్షలు విలువైన భూములను పరిశ్రమలకు ఇచ్చి కూలి పనులు చేసుకుని జీవనం నెట్టుకొస్తున్నారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, పట్టించుకునేవారే లేరు. పిల్లలను చదివించలేక, వివాహాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ ఏర్పేడు మండలంలోని వికృతమాల రెవెన్యూలో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తుల తయారీ కేంద్రం(ఈఎంసీ–2)కు భూములు ఇచ్చిన రైతుల దుస్థితి.

**వీధిన పడ్డారు..**

170 ఎకరాలకు చెందిన రైతుల దస్త్రాలు పరిశీలించి కేటగిరి–బి కింద పరిహారం ఇస్తామని అప్పటి అధికారులు హామీ ఇచ్చారు. వైకాపా అధికారంలోకి రావడంతో పరిహారం పంపిణీ అటకెక్కింది.

**కారణాలు**సాగులో ఉన్న రైతుల్లో కొందరికి పట్టాలు లేవు.

డి పట్టాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఒకరిపేరు ఉండగా..



అనుభవంలో మరొకరు న్నారు.

తండ్రి మరణానంతరం వారసత్వంగా కుటుంబ సభ్యులు పేర్లు నమోదుకాలేదు.

వికృతమాలకు చెందిన రైతు కాకి హరికి చెందిన 2.28 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం లేదనే కారణంతో ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. భూములు కోల్పోయి పరిహారం అందని రైతుల వివరాలు ఉన్నాయి. త్వరలోనే నగదు పంపిణీ చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపాం.

# భేదాల్లేవ్.. బేరాలే!

విశాఖపట్నం : కోళ్లవ్యర్థాల తరలింపులో కొందరు వైకాపా నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలోనూ కోళ్ల వ్యర్థాల తరలింపు అంశం చర్చకు వచ్చింది. చర్యలకు ఆదేశించారే కానీ, క్షేత్రస్థాయిలో వ్యర్థాలు డంపింగ్ యార్డుకు ఎందుకు రావడం లేదన్న కోణంలో పరిశీలన జరగలేదు. నగరంలో కోళ్ల మాంసం వ్యర్థాలతో కాసుల వేట జోరుగా సాగుతోంది. వైకాపా హయాంలోని జీవీఎంసీ పాలక వర్గంలో ఉన్న నాయకుల కనుసన్నల్లోనే ఈ దందా దర్జాగా జరుగుతోంది. ఇందుకు ప్రస్తుత కూటమిలోని ఓ కీలక నేత సహకారం అందిస్తుండటంతో కోళ్ల వ్యర్థాలను నిర్భీతిగా చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అవేగా...అనుకోవద్దు: నగరంలో మాంసం దుకాణాల వద్ద వృథాగా పడేసే కోళ్ల వ్యర్థాలే కదా..ఎంత వస్తుంది? అనుకోవద్దు. లెక్కలు చూస్తే ముక్కున వేలేయాల్సిందే. అందుకే కోళ్ల వ్యర్థాల తరలింపునకు కొన్ని వర్గాలు పోటీ పడుతున్నాయి. జీవీఎంసీ 8 జోన్ల పరిధిలో 1,600 దుకాణాల నుంచి ప్రతి రోజూ 40 టన్నుల వ్యర్థాలు సేకరిస్తారు. టన్ను రూ.8 వేల చొప్పున చేపల చెరువులకు అనకాపల్లి, గోదావరి జిల్లాలకు తరలిస్తారు. అంటే ప్రతి రోజూ రూ.3.20 లక్షలకు అమ్మకాలు చేస్తున్నారు. ఆదివారం అయితే 80 టన్నుల వ్యర్థాలు డ్రమ్ముల్లో నింపి వాహనాల్లో తరలిస్తారు. ఇలా చూస్తే ఆదివారాలతో కలిపి నెలకు దాదాపు రూ. కోటికి పైగా లావాదేవీలు సాగుతాయి.

పట్టుకున్నా...: జీవీఎంసీ పరిధిలో కోళ్ల వ్యర్థాలను తరలించి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఏడుగురు గుత్తేదారులకు గతంలో బాధ్యతలిచ్చారు. అయితే ఈ వ్యర్థాలు యార్డుకు కాకుండా పక్కదారి పడుతున్న నేపథ్యంలో అప్పట్లో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టర్ కాంట్రాక్టు రద్దు చేశారు. దానిపై గుత్తేదారులు కొందరు కోర్టును ఆశ్రయించగా, జీవీఎంసీ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్న విమర్శలున్నాయి. ప్రతి నెలా రూ.10లక్షలు ఇచ్చేలా కూటమిలోని ఓ కీలక సభ్యుడితో మాట్లాడుకున్నట్లు సమాచారం. దీంతో అక్రమంగా తరలిస్తున్నారంటూ సీజ్ చేసిన 25 వాహనాలను సైతం ఎలాంటి కేసుల్లేకుండా ఇటీవల వదిలేయడం విమర్శలకు దారితీసింది. అనకాపల్లి జిల్లా డైట్ కళాశాల సమీపంలో కోళ్ల వ్యర్థాలతో ఉన్న ఐదు వాహనాలను ఇటీవల సీజ్ చేశారు.

# చిన్న పరిశ్రమలు ఆదుకుంటున్నాయ్!



విశాఖపట్నం: ఆర్థిక నగరం విశాఖలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. ప్రైవేటు సంస్థల్లో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు వివిధ ప్రాంతాల ప్రజలు పనిచేస్తున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)లోనే ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు. పెద్ద పరిశ్రమల్లో పెట్టుబడులు ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. వాటి ఏర్పాటుకు కనీసం రెండు నుంచి మూడేళ్లు పడుతుండగా.. ఎంఎస్ఎంఈలు మూడు నుంచి ఆరు నెలల్లోనే కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. పెద్ద సంస్థల్లో 51,957 మంది, చిన్న పరిశ్రమల్లో 1,78,898 మంది ఉపాధి పొందుతున్నారు.

నగర పరిధిలో కొత్తగా ఏర్పాటయ్యే పెద్ద, భారీ పరిశ్రమలు తక్కువగా ఉంటున్నాయి. అవి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటవుతున్నాయి. మరోవైపు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో ఏపీఐఐసీ అధికారులు స్థలాలు గుర్తిస్తున్నారు.

భీమిలి నియోజకవర్గం పద్మనాభం దగ్గర కృష్ణాపురం గ్రామంలో 100 ఎకరాలు గుర్తించారు. మొదటి దశలో 50 ఎకరాలు అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అవి అందుబాటులోకి వస్తే వేలాది మందికి ఉపాధి లభించనుంది. స్థానికంగా ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుంది. కొత్తగా ఎవరైనా పెట్టుబడులతో ముందుకొస్తే నవంబరులో జరగనున్న పార్టనర్‌షిప్ సదస్సులో ఒప్పందాలు చేసుకోవడానికి అవకాశముంది.

'ఉద్యమ్' ప్రక్రియ సులభతరం కావడంతో ఎక్కువ మంది ఎంఎస్ఎంఈలను నమోదు చేసుకుంటున్నారు. పరిశ్రమల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, అధికారులు పరిశీలించి, అనుమతులు ఇస్తున్నారు.

పెద్ద, భారీ పరిశ్రమలు..

నడుస్తున్న యూనిట్లు: 53

ఉద్యోగులు 51,957

ఏర్పాటు ప్రక్రియలో ఉన్నవి 3

ఉద్యోగాలు 34,120

ఎంఎస్ఎంఈలు..

యూనిట్లు: 20,510

ఉద్యోగులు 1,78,898

ఏర్పాటు ప్రక్రియలో ఉన్నవి 28

ఉద్యోగాలు 455

2025–26లో ఆగస్టు వరకు నమోదు చేసుకున్న ఎంఎస్ఎంఈలు: 229

పెట్టుబడులు: రూ.22.65 కోట్లు

ఉద్యోగాలు: 687

రెండు నెలల్లో అందుబాటులోకి.. పరిశ్రమలకు అనుమతులు కావాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు మరో రెండు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఒకేచోట ఎక్కువ స్థలం అందుబాటులో లేదు. ప్రత్యామ్నాయం కోసం పరిశీలిస్తున్నాం. ఆదిశేషు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి

# తప్పని ప్రసవ వేదన




గోరంట్ల : మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన గంగోత్రి గతనెల 5న ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ప్లేట్లెట్స 56 వేలు మాత్రమే ఉన్నాయి. స్థానికంగా ప్లేట్లెట్స్ అందించే అవకాశం లేక అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడ వైద్యులు సిజేరియన్ చేస్తుండగా మృతి చెందారు. ఈనెల 4న కర్ణాటక ప్రాంతం మంచేపల్లికి చెందిన గర్భిణి సంధ్య.. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ప్లేట్లెట్స్ తక్కువగా ఉండటంతో అనంతపురానికి రెఫర్ చేశారు.

హిందూపురంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. రోగులకు అవసరమైన చికిత్స అందించేందుకు అన్ని సౌకర్యాలు ఆసుపత్రిలో ఉన్నా సిబ్బంది, వైద్యుల కొరత కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మడకశిర, పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లితోపాటు పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి గర్భిణులు రోజూ ఇక్కడికి వస్తుంటారు. వారిలో సగం మందికి రక్తహీనత ఉంటోంది. ఇదిలా ఉండగా శస్త్రచికిత్స చేయాలంటే తగినంత రక్తం, ప్లేట్లెట్స్ ఉండాలి. అవి తక్కువగా ఉన్నవారికి ఇక్కడ సేవలు అందుబాటులో లేక వైద్యులు ఇతర ప్రాంతాలకు.. ముఖ్యంగా అనంతపురానికి రెఫర్ చేయాల్సి వస్తోంది. ఇక్కడి నుంచి అనంత చేరుకోవాలంటే అంబులెన్స్‌లో కనీసం 2 గంటలకు పైగా సమయం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాలకు ముప్పు కలిగిన ఘటనలు చోటు చేసుకొంటున్నాయి.

ప్రసవానికి సంబంధించి శస్త్రచికిత్స చేయాలంటే తగినంత రక్తం ఉండాలి. సగం మంది గర్భిణిలకు తక్కువ ఉంటోంది. అలాగే ప్లేట్లెట్స్ 1.30 లక్షలు ఉండాలి. కొందరికి 50 వేల నుంచి ఒక లక్ష ఉంటున్నాయి. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి వీలుకాక అనంతపురానికి పంపుతున్నారు.

**పరికరాలు వచ్చినా..**ప్రభుత్వ ఆసుపత్రికి నెల రోజుల ముందు దాదాపు కోటి రూపాయలు విలువ చేసే పరికరాలు వచ్చాయి. ఇప్పటి వరకు వాటిని వినియోగంలోకి తీసుకురాలేక పోయారు. వాటిని ఏర్పాటు చేయటానికి అవసరమైన శీతల గది.. పెథాలజిస్ట్‌తోపాటు లైసెన్స్ ఉండాలి. ఇవేమి లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

పడకలు: 200

ప్రతినెలా ప్రసవాలు: 230 (సుమారు)

రక్తహీనతతో వచ్చే గర్భిణులు: 100 మందికి పైగా


**అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..: అన్నపూర్ణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్**

గర్భిణిలకు పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు ఇంకా రావాల్సి ఉంది. వచ్చిన రెండు పరికరాలు సక్రమంగా లేనందున వెనక్కి పంపాం. సిబ్బంది, లైసెన్స్ రావాలంటే మరికొంతకాలం పట్టే అవకాశం ఉంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు చొరవ తీసుకొని పరిష్కరించాల్సి ఉంది.

# నకిలీ డీపీ.. పెడుతోంది టోపీ

తిరుపతి : సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో నేరగాళ్లు మళ్లీ పాత పద్ధతుల్లో డబ్బు కొట్టేసేందుకు యత్నిస్తున్నారు. తెలిసిన వ్యక్తుల ఫొటోలను వాట్సప్ డీపీలుగా పెట్టుకుని నగదు కొట్టేస్తున్నారు. ప్రముఖులు, పోలీసులు, ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల వాట్సప్ డీపీలతో సందేశాలు పంపించి మోసగిస్తున్నారు. అత్యవసరంగా డబ్బు కావాలని, ఆసుపత్రిలో చికిత్సకు వచ్చానని, పోలీసు కేసులో ఇరుక్కున్నామంటూ ఏవేవో మాటలతో ఏమారుస్తున్నారు. కొన్ని సంస్థలు మానవ వనరుల నిర్వహణ, వేతనాల చెల్లింపు, వివిధ అవసరాలు, సేవలకు థర్డ్ పార్టీ ఏజెన్సీలను ఉపయోగించుకుంటాయి. ఈ వివరాల భద్రతలో ఏజెన్సీలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు డబ్బుకు ఆశపడి డేటా మొత్తాన్ని ఇతరులకు విక్రయించేస్తున్నారు. వాటిని చేజిక్కించుకుంటున్న సైబర్ నేరగాళ్లు.. ఓపెన్ సోర్స్‌లో ఉండే ప్రముఖుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని వాట్సప్ ద్వారా గాలం వేస్తున్నారు.

ఇవీ జాగ్రత్తలు.. సామాజిక మాధ్యమాల్లో తెలిసిన వారి ఫొటోలు డీపీలుగా పెట్టి డబ్బు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దు. అత్యవసర మని డబ్బు కావాలని సందేశాలు వస్తే.. ఫోన్ చేసి



నిర్ధారించుకోవాలి. అవసరమైతే వీడియో కాల్ చేయాలి. అంతర్జాతీయ నంబర్లతో వచ్చే సందేశాలు నమ్మొద్దు.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి..**మోసపోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబరు లేదా %www.cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

# పసివాళ్లపై పగేలా?

నర్సీపట్నం: 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న సామెత ఈ కేంద్రాలకు అతుకుతుంది. పిల్లల వైద్యం కోసం రూ.లక్షల్లో ప్రజాధనం వెచ్చించి వైద్య పరికరాలు, ఉపకరణాలు కొనుగోలు చేసినా వైద్యులు, తగినంత సిబ్బంది లేక అవన్నీ నిరుపయోగంగా మారాయి. నర్సీపట్నంలో మూడేళ్ల కిందట ఏర్పాటైన జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో దంత, వినికిడి, నేత్ర, చిన్నారుల వైద్య నిపుణులు, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ కాలేదు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 18 ఏళ్లలోపు పిల్లల్లో 45 రకాల లోపాలకు ఉచితంగా చికిత్సలు అందించాలన్నది ఈ కేంద్రం లక్ష్యం. వంకర పాదాలు, పుట్టుకతో వచ్చే క్యాటరాక్ట్, వినికిడి లోపం, నాడీ వ్యవస్థ లోపాలు, నడుం భాగంలో అభివృద్ధి లోపం, పెదవి చీలిక, గ్రహణం మొర్రి, రక్తహీనత, విటమిన్ లోపాలు, తీవ్ర పోషకాహార లోపం, చర్మ సంబంధ వ్యాధులు, చెవి నుంచి చీము, రక్తం కారడం, రుమాటిక్ గుండె వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, పిప్పిపళ్లు, గారపళ్లు, చిగుళ్లవాపు, మూర్ఛ, దృష్టి సమస్యలు, ఎదుగుదల లోపించడం, ఆటిజం తదితర వ్యాధులకు చికిత్సలు అందాల్సి ఉంది. రూ.1.06 కోట్లతో నిర్మించిన ఈ కేంద్రంలో వైద్య పరికరాలు, ఉపకరణాలన్నీ ఉన్నాయి.

ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రతి నెలా 300కు పైగా ప్రసవాలు



జరుగుతున్నాయి. నెలకు పదికి తగ్గకుండా శిశువులకు సిప్యాప్ యంత్రాల అవసరం ఉంటోంది. కనీసం ఇద్దరు వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు, సహాయకుడి పోస్టులను భర్తీ చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. ఐదు ఫొటోథెరపీ యంత్రాలను ఆసుపత్రి సిబ్బందిని పంపి కామెర్ల పిల్లలకు ఉపయోగిస్తున్నారు. నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని పలు మండలాలతోపాటు అల్లూరి జిల్లాలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల నుంచి వైద్య సేవల కోసం వందల మంది ప్రాంతీయ ఆసుపత్రికి వస్తుంటారు. ప్రాంతీయ ఆసుపత్రిలో స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్లో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, తగినంత బరువు లేని వారు, కామెర్లతో జన్మించిన శిశువులకు చికిత్స అందించాలి. రూ.లక్షల విలువైన పదేసి వార్మర్లు, ఫొటో థెరప్మీ యూనిట్లు, రెండు సిప్యాప్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యూనిట్లోనూ పిల్లల వైద్యులు, నర్సుల్లేరు. స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ సిప్యాప్ యంత్రాలు లేకపోవడంతో అత్యవసరమైతే విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం బాలల సత్వర చికిత్స కేంద్రంలో పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆగస్టు 22న నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంపిక తర్వాత ఇక్కడకు అవసరమైన వైద్యులను నియమించనున్నారు. స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్లో వైద్యులు, స్టాఫ్‌నర్సుల కొరతని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. డాక్టర్ సుధాశారద, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు

# మిగిలింది నాలుగు నెలలే..

అనకాపల్లి : ఇంటర్ విద్యార్థులకు పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ మారడం, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రైవేటు కళాశాల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి.

ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ఇంటర్ పరీక్షలను ఫిబ్రవరి 23 నుంచి నిర్వహించడానికి తేదీలను ఖరారు చేశారు. జనవరి 27 నుంచి వృత్తి విద్యా, జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు నాటికి సిలబస్ పూర్తిచేయాలని కళాశాల అధ్యాపకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. లేనిపక్షంలో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులూ నిర్వహిస్తున్నారు. కళాశాలల సాధారణ బోధనా సమయాలతో పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులకు బోధిస్తున్నారు. ఇది విద్యార్థులకు బాగా కలిసొస్తుందని భావిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలకు అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించడంతో పాటుగా ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు. జిల్లాలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 13,625 మంది, ద్వితీయ సంవత్సరంలో 12,511 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరం 3,540 మంది, ద్వితీయ సంవత్సరం 2,931 మంది ఉన్నారు. వీరికి మెరుగైన బోధన అందించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారు.

**ఉత్తీర్ణత పెంచుతాం**

ఇంటర్ పరీక్షల నిర్వహణకు తేదీలను ప్రకటించడంతో సిలబస్‌ను డిసెంబరు కల్లా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశాం. ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతాన్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం 63 శాతం, ద్వితీయ 72 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ ఏడాది మరింత మెరుగుపర్చడంతో పాటు పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

వినోద్‌బాబు, ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి

# స్థలముంటే.. సొంతింటి కల సాకారమే


చిత్తూరు : పట్టణ ప్రాంతాల్లోని సామాన్య, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కేంద్రం.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 (పీఎంఏవై)లో భాగంగా ఊరట కలిగిస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున నిధులు విడుదల చేస్తుంది. జిల్లాలో చిత్తూరు నగరపాలక సంస్థ, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం పురపాలికల్లో.. సొంత స్థలం కలిగిన 2,472 మంది ఇంటి నిర్మాణానికి అవకాశాన్ని కల్పించారు. ః పల్లె ప్రాంతాల ప్రజలు స్థలం ఉండి దరఖాస్తు చేసుకోగా పీఎంఏవై 2.0 అధికారులకు ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే అనుమతులు మంజూరు కానున్నాయి. లబ్ధిదారుకు కేంద్రం రూ.1.50 లక్షలు ఇవ్వనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష అందజేయనుంది.

# తలారి 'భూ'తం

కర్నూలు: కోడుమూరు నియోజకవర్గంలోని వర్కూరులో రూ.కోట్ల విలువైన భూములు పరాయి వాళ్ల చేతుల్లో మగ్గుతున్నాయి. గతంలో గ్రామంలో తలారిగా విధులు నిర్వర్తించిన ఓ వ్యక్తి పలువురి భూములను తన పేరు పైనా, తన తల్లి పేరుపైనా మార్చేసిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. రీసర్వే పేరుతో తనకు నచ్చిన వారి పేరు మీదికి అదనంగా భూములను వచ్చేలా చేశారు. వర్కూరు గ్రామ మాజీ తలారీ దస్తగిరి సర్వే నంబరు 174లోని భూములను గుట్టుచప్పుడు కాకుండా తన పేరు మీదకు 3.78 ఎకరాలు, తన తల్లి పేరు మీదకు ఐదెకరాలు మార్చేసుకున్నారు. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వెళ్లే ప్రధాన రహదారికి అర కిలోమీటరు దూరంలోనే ఉన్న ఆయా భూములకు మంచి ధర ఉంది. అందులో బోర్లు వేయించుకొని దశాబ్దాల నుంచి కొన్ని కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి. వారికి పట్టాలు లేకపోవడంతో దస్తగిరి తను, తన తల్లి పేరిట ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేసుకున్నారు.

**రీసర్వే పేరుతో కోత పెట్టి..**

వర్కూరు గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో కొందరు భూములు కోల్పోయారు. కోడుమూరుకు చెందిన ఓ వైకాపా కీలక నేత ఆదేశాలతో పార్టీ అనుచరులకు లబ్ధి చేకూరేలా రీసర్వే చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్కూరు గ్రామానికి చెందిన హనుమంతుకు గ్రామంలోని సర్వే నంబరు 91/1లో 2.31 ఎకరాలు, 91/3లో 1.78 ఎకరాల భూములుండగా రీసర్వే పేరుతో 3.12 ఎకరాలకు తగ్గించారు. ఆయన వద్ద పట్టాదారు పాసు పుస్తకంతో సహా అన్ని ఆధారాలు ఉన్నాయి. ఆ భూమి కొందరు వైకాపా అనుచరులకు కలవడం వివాదాస్పదంగా మారింది. రీ సర్వే చేయమని పెట్టుకున్న అర్జీలను పట్టించుకోకపోవడంతో బాధితుడు అమరావతిలోని తెదేపా ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. వర్కూరు గ్రామానికే చెందిన చెన్నా రాయుడికి సర్వే నంబరు 91/3లో మూడు ఎకరాలుండగా.. రీసర్వే అనంతరం 1.72 ఎకరాలు



మాత్రమే ఉన్నట్లు చూపారు. ఆయన భూమి సరిహద్దులో ఉన్న వైకాపా అనుచరులకు కలిసింది. దీంతో ఈయన కూడా తెదేపా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై విచారణ చేయాలని కర్నూలు ఆర్డీవోకు ఆదేశాలు రావడంతో విచారణ ప్రారంభించారు. వర్కూరు గ్రామంలో సుమారు 50 ఎకరాలకు పైగా భూములను పలువురు రీసర్వేలో కోల్పోగా వారిలో అత్యధికులు తెదేపా వారే ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**విలువైన భూములు సొంతం**

రెండేళ్ల కిందట రీసర్వే సమస్యలు తలెత్తినప్పుడు ఆయా రైతులు తమకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని హతాశులయ్యారు. బీకే కృష్ణకు చెందిన 1.18 ఎకరాల 67 సెంట్లు, బీకే రంగడుకు చెందిన 1.18 ఎకరాల 69 సెంట్లు, బీకే వెంకటేశ్‌కు చెందిన 1.09 ఎకరాల 33 సెంట్లు, బీకే కేశన్నకు చెందిన 33 సెంట్ల భూములు రాయించుకున్న గుర్తించారు. ఏడాది క్రితం ఆయన తలారి ఉద్యోగానికి రాజీనామా చేసి కోడుమూరు తహసీల్దారు కార్యాలయంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అక్రమాలపై బాధితుడు బీకే కృష్ణ అమరావతిలోని తెదేపా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

**సర్వే నంబర్లు తెలియక సమస్య: దస్తగిరి, మాజీ తలారి, వర్కూరు**

వర్కూరు గ్రామంలోని సర్వే నంబరు 174లో 3.78ఎకరాలు, నా తల్లికి 5 ఎకరాల భూమిని 1986లో ప్రభుత్వం కేటాయించింది. పదేళ్ల క్రితం ఆన్‌లైన్ చేయించుకున్నాను. సర్వే నంబరు తెలియక వేరే భూమిలో సాగు చేసుకుంటున్నా. వాళ్లు నా భూమిలో సాగు చేసుకుంటున్నారు. రీసర్వే సమయంలో భూమి ఎక్కడుందన్న విషయం నిర్ధారణ కావడంతో తప్పిదం వెలుగులోకి వచ్చింది. కృష్ణ పూర్వీకులకు గోనెగండ్ల తిప్పనూరులో 3.48 ఎకరాల భూమిని కేటాయించారు.

# పాఠశాలలో ఆటంకం

పాణ్యం : గిరిజన విద్యార్థుల కోసం గత వైకాపా ప్రభుత్వం క్రీడా పాఠశాలను ఆర్భాటంగా ప్రకటించింది. పాఠశాలను ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 194 మంది విద్యార్థులుండగా.. గురుకుల పాఠశాలలో 170 మంది, క్రీడా పాఠశాలలో 24మంది చదువుకుంటున్నారు.పాణ్యం మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను 2022–23లో క్రీడా పాఠశాలగా మార్పుచేస్తున్నట్లు ప్రకటించారు. కర్నూలుతోపాటు కడప, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో 6, 7, 8వ తరగతులు చదువుతున్న ఎస్టీ విద్యార్థినులకు 2023 ఫిబ్రవరిలో ప్రవేశాలు కల్పించారు. మొదటి ఏడాదిలో అథ్లెటిక్, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వగా.. రెండో ఏడాది అథ్లెటిక్, జూడో, హాకీలో, ప్రస్తుతం అథ్లెటిక్, హాకీలో శిక్షణ ఇస్తున్నారు.

**క్రీడా సామర్థ్య పరీక్షలతో ప్రవేశాలు**

క్రీడా పాఠశాలలో చేరాలంటే 7 క్రీడా సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 400 మీటర్ల రన్నింగ్, మెడిసిన్ బాల్‌పుట్, 6ఌ10 మీటర్ల షటిల్‌రన్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబుల్ టెస్టు తదితర పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు.

చదువుతోపాటు ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేయిస్తున్నారు. అథ్లెటిక్స్, జూడో, హాకీ శిక్షకులను నియమించినా.. మైదానాలు లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

వేధిస్తున్న అసౌకర్యాలు

ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలతోపాటు క్రీడా పాఠశాలకు అదనంగా సీట్లు కేటాయించారు. అసౌకర్యాలు, ఆలస్య ప్రవేశాలతో విద్యార్థినులు ఆసక్తి చూపడం లేదు. 2023లో ఒక్కో తరగతికి 30 సీట్ల చొప్పున 6–8 తరగతులకు 90 సీట్లు కేటాయించగా.. 30మంది విద్యార్థినులు మాత్రమే చేరారు. 2023–24లో 6–9వ తరగతుల్లో 120 సీట్లకు 51మంది, 2024–25లో ప్రవేశాలు నిర్వహించకపోవడంతో ఉన్న 41మంది విద్యార్థులతోనే కొనసాగించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ప్రవేశాల ప్రకటన రాకపోవడంతో ప్రస్తుతం 24మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. క్రీడా పాఠశాల నిర్వహణపై సందేహాలు నెలకొంటున్నాయి.

**నిధుల కేటాయింపులో మొండిచేయి**

ఈ పాఠశాలలో అనువైన మైదానాలు, తరగతి గదులు, వసతిగృహం ఉండాలి. క్రీడలకు ప్రత్యేక తరగతి సమయాలు, విద్యార్థులకు బడ్జెట్ కేటాయించి ప్రత్యేక ఆహారం అందించాలి. వీరి భోజనం కోసం రోజూ రూ.125 మంజూరు చేయాల్సిఉండగా.. ఇప్పటి వరకు ఎలాంటి బడ్జెట్ కేటాయించకపోవడంతో విద్యార్థులకు సాధారణ భోజనంతోనే సరిపెడుతున్నారు. మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో పాఠశాలలో ఉన్న ఖాళీ స్థలంలోనే విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నారు. మైదానాలలో గడ్డి, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా బురదమయమై.. ఆడుకోలేని పరిస్థితి నెలకొంటుంది. లాంగ్‌జంప్, హైజంప్, ప్రత్యేక ట్రాక్, హాకీ కోర్టు వంటివి ఏర్పాటు చేయలేదు.

# మార్కెట్‌కు వెళ్లాలంటే వణుకే!



అనంతపురం: పురపాలికల్లో కూరగాయల మార్కెట్లు అత్యంత అధ్వానంగా మారాయి. అపరిశుభ్రతకు చిరునామాగా నిలుస్తున్నాయి. పరిసరాల్లో కుళ్లిపోయిన కూరగాయలు, వ్యర్థాలను పారబోస్తుండటంతో చుట్టూ పశువులు చేరుతున్నాయి. వర్షం పడితే మరింత దారుణంగా ఉంటుంది. నిర్వహణ లేకపోవడంతో మార్కెట్ల లోపల బురద, నీరు చేరి కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కళ్యాణదుర్గం, గుంతకల్లుతోపాటు అనంతపురం నగరంలో ఈ పరిస్థితి దాపురించింది. సరైన వసతులు లేకపోవడంతో నేలమీదే విక్రయాలు సాగిస్తున్నారు. అపరిశుభ్రత, దుర్గంధం కారణంగా మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

నగరంలోని పాతూరు కూరగాయల మార్కెట్‌కు వెళితే బురద అంటించుకోవాల్సిందే. వర్షం పడితే అడుగుపెట్టలేని దుస్థితి. పైగా ఇరుకిరుకుగా ఉండటంతో ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. పశువులు సైతం మార్కెట్‌లో తిరుగుతూ మరింత ఇబ్బంది పెడుతున్నా పట్టించుకునేనాథుడే లేరు. నిత్యం వందలాది మంది వస్తుంటారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. పెద్ద దుకాణాలు 32 వరకు ఉండగా.. మిగిలిన వంద దుకాణాల వారు నేలపైన కూరగాయలు పోసుకొని.. పైన ప్లాస్టిక్ పట్ట ఏర్పాటు చేసుకుని విక్రయిస్తుంటారు. కొత్తూరులో 300 దుకాణాలతో మార్కెట్ సముదాయం ఉన్నా కేవలం మూడు చోట్ల కూరగాయలు విక్రయిస్తున్నారు. మిగిలినవి ఖాళీగా ఉండటం గమనార్హం.

నగరపాలిక: అనంతపురం

జనాభా: 3.46 లక్షలు

**ఉన్నది కూల్చివేతతో..**

పట్టణంలోని టీ కూడలిలో నూతన మార్కెట్ నిర్మాణం చేపట్టాలని వైకాపా హయాంలో నిర్ణయించారు. దీంతో అప్పట్లో అక్కడి పాత భవనాన్ని తొలగింపు చేశారు. తరువాత దాన్ని పట్టించుకోకపోవడంతో కూరగాయల విక్రయానికి రహదారి దిక్కయింది. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పక్కనే తాత్కాలిక మార్కెట్టు అధికారులు స్థలం చూపినా ప్రయోజనం లేకపోయింది. కొందరు అద్దె గదుల్లో, ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకొంటున్నారు. జగ్జీవన్ రాం విగ్రహ సమీపంలో రహదారిపైన విక్రయాలు సాగిస్తున్నారు.

నగరపాలిక: కళ్యాణదుర్గం

జనాభా: 53,173

రాలేం..పోలేం!

మున్సిపల్ మార్కెట్‌లో సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. వ్యాపారులు షెడ్లలో అమ్మకాలు చేపట్టడం లేదు. రోడ్లపైనే సరుకు పెట్టి విక్రయిస్తున్నారు. వర్షం వస్తే తలదాచుకోవడానికి కొనుగోలుదారులు పరుగులు తీయాల్సి వస్తోంది. ముందే ఇరుకైన మార్కెట్.. రోడ్లను ఆక్రమించుకుని అమ్మకాలు చేస్తుండటంతో రాకపోకలు సాగించడానికి గగనంగా మారుతోంది. వాహనాల్లో వచ్చేవారు మార్కెట్‌లోకి వెళ్లడానికి, తిరిగి వచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. నీటి వసతి లేదు. పాత మరుగుదొడ్డు వినియోగించే స్థితిలోలేవు. ఆక్రమణలు తొలగించి కొత్త షెడ్లను నిర్మించాలని అధికారులు నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు.

నగరపాలిక: గుంతకల్లు

జనాభా: 1.80 లక్షలు

**కౌన్సిల్ తీర్మానాలు బుట్టదాఖలు**

ప్రధాన పురపాలికల్లో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో కౌన్సిల్ల సమావేశాల్లో తీర్మానాలు చేయడం.. తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ఏళ్లుగా గడుస్తున్నా ఆయా తీర్మానాలకు అతీగతీ లేదు. ప్రజలు కనీస అవసరాలు తీరక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కీలకమైన వాటికే దిక్కులేదు..**

గుంతకల్లు, గుత్తి, మున్సిపాలిటీల్లో రూ.కోట్లు విలువైన పనులకు ప్రతి కౌన్సిల్ సమావేశాల్లో ఆమోదాలు తెలుపుతున్నారు. దస్త్రం దాటి ఆయా పనులు జరగడం లేదు. గుంతకల్లు పురపాలికలో గత ఆరేళ్లలో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో పలు పనులకు ఆమోదం తెలిపారు. వీటిల్లో 114 దుకాణసముదాయాల నిర్మాణం,. పట్టణ పాలను రూ. 9 కోట్లతో పూర్తి చేయాలనుకున్నా అతీగతీ లేదు. పొట్టిశ్రీరాములు కూడలిలో టవర్ క్లాక్ నిర్మాణం కలగా మిగిలిపోయింది. సమగ్ర మురుగు కాలువల నిర్మాణ పనులు సాగలేదు. రూ.4 కోట్లతో పలు కాలనీల్లో రోడ్ల విస్తరణ చేయాలనుకున్నా ఆగిపోయింది. తాడిపత్రి పురపాలికలో గత వైకాపా ప్రభుత్వం నుంచే అభివృద్ధి పనులను చేపట్టేందుకు కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి వదిలేశారు. చేనేత కాలనీ, ట్రైలర్స్ కాలనీ, శ్రీనివాసపురం, సంజీవనగర్ వంటి పలు కాలనీలల్లో శివారు వీధుల్లో సీసీరోడ్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పైపులు ఏర్పాటు చేసేందుకు రెండు దఫాలుగా తీర్మానించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు రూ.15కోట్లతో పనులు చేసేందుకు తీర్మానించారు. నిధుల్లేక పనులు చేపట్టలేదు.

గుత్తిలోని చెట్టేపల్లిలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్డును నిర్మించాలని రెండేళ్ల కిందట కౌన్సిల్ తీర్మానించారు. తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 20 లక్షలు కేటాయిస్తూ మూడేళ్ల కిందట పనులకు ఆమోదం తెలిపారు. రెండే కిందట సెంట్రల్ పార్కు ఏర్పాటుకు రూ. కోటి, రోడ్లు, మురుగు కాలువలు తదితర 33 పనులను చేయడానికి రూ.2.50 కోట్లను కేటాయించినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి.

**నిధులు సమకూరగానే పనులు: నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్** గుంతకల్లు మున్సిపాలిటీలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి చేసిన తీర్మానాల అమలుకు కృషి చేస్తున్నాం. రూ.65 కోట్లను కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించాం. ఈవిషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. నిధులు మంజూరు చేసిన వెంటనే టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభిస్తాం.

# చెక్‌డ్యామ్‌ను చెరబట్టారు



కదిరి : వర్షపునీటిని నిల్వ ఉంచి ప్రత్యక్షంగా మూగజీవాల దాహార్తి తీర్చడం.. పరోక్షంగా భూగర్భజలాలు పెంచే లక్ష్యంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కొందరు స్వార్థపరులు చెరబట్టారు. కదిరి మండలం ముత్యాలచెరువు పంచాయతీ పరిధిలోని కరావులపల్లి సమీపంలో 15 సంవత్సరాల కిందట పంచాయతీరాజ్‌శాఖ సుమారు రూ.లక్ష అంచనాతో చెక్‌డ్యామ్ నిర్మించింది. భోగేరమ్మపల్లి పరిసరాల్లోని కొండల్లో నుంచి వచ్చే నీటిని నిల్వ ఉంచేలా అధికారులు దీనిని నిర్మించారు. ఏటా వర్షాకాలంలో నీటితో నిండిపోయేది. గొర్రెలు, మేకలు దాహార్తి తీర్చుకునేందుకు వీలుగా ఉండేది. దీంతోపాటు సమీప బోరుబావుల్లోనూ నీటిమట్టం పెరిగేందుకు దోహదపడేది.

**కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం** ప్రధాన రహదారి విస్తరణతో అడవిలోకి వెళ్లేందుకు దారి లేకుండా కొందరు పొలాల యజమానులు చుట్టూ కంచె వేసుకున్నారు. చెక్‌డ్యామ్ అవతలి వైపునకు వెళ్లే కొందరు వ్యక్తులు స్వార్థంతో అందులో నుంచి దారి ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. సమీపంలోని బండల పరిశ్రమల్లోని వ్యర్థాలను ఇక్కడికి తరలించి రోడ్డు వేసుకుంటున్నారు.ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలకు దారి తీస్తోంది.

**బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: పోలప్ప, ఎంపీడీఓ, కదిరి** వ్యక్తిగత స్వార్థంతో చెక్‌డ్యామ్‌కు నీరు చేరకుండా ఆటంకం కలిగించిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. అందులోని వ్యర్థాలను తొలగిస్తాం. మునుపటిలానే వర్షపునీరు చెక్‌డ్యామ్‌కు చేరేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

# సమస్యల వలయంలో బీటీ జలాశయం

గుమ్మఘట్ట: జిల్లాలోనే మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన భైరవానితిప్ప ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది ప్రాజెక్టులో 90 శాతం(1653 అడుగుల) నీరు చేరినా.. స్థానికంగా కనీస సౌకర్యాలు కల్పించలేదు. పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేకపోవడంతో పర్యాటకులు, మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కట్టకు లోపల, బయట ఏర్పడిన బొరియలు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**ప్రాజెక్టు నిండుగా కంపచెట్లే**

ప్రాజెక్టులో కొన్నేళ్లుగా నీరు చేరకపోవడంతో కంపచెట్లు విపరీతంగా మొలిచాయి. ఈ ఏడాది నీరు పుష్కలంగా చేరినా.. ప్రాజెక్టులో ఎక్కువశాతం కంప వల్ల పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. చేరిన నీటిని స్థానిక అధికారులు నిల్వచేసుకోవడానికి కనీస ప్రయత్నాలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో కంపచెట్లు ఉన్న ప్రాంతం నుంచి నీరు లీకవుతున్నా.. పట్టించుకునే కరవయ్యారు. అయినా అధికారుల్లో పాఠాలు నేర్వలేదు. రాయదుర్గం, కర్ణాటక ప్రాంతం నుంచి సెలవు రోజుల్లో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఏపుగా పెరిగిన కంపచెట్లతోపాటు స్థానికంగా సేద తీరేందుకు కనీస సౌకర్యాలు లేవని పర్యాటకులు ఆరోపిస్తున్నారు.

**రక్షణ చర్యలేవీ?**రిజర్వాయర్ గేట్ల వద్ద ఏర్పాటు చేసిన వాకేవే సగానికిపైగా తుప్పు పట్టింది. ఇద్దరు కంటే ఎక్కువ వ్యక్తులు నడిస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు అస్తవ్యస్త పరిస్థితులు జిల్లా మంత్రి పర్యటిస్తున్న సమయంలోనే వెలుగులోకి వచ్చినా..

నేటికి పట్టించుకున్న దాఖలాలు కరవయ్యాయి. స్పిల్‌వే వద్ద కనీస రక్షణ చర్యలు లేవు. అక్కడికి ఎవరైనా వెళ్లకుండా కనీసం కాపలా, లేదా గేటుకు తాళాలైనా వేయాల్సి ఉన్నా.. అధికారులు శ్రద్ధ పెట్టడంలేదు. దీంతో ఆటగా వెళ్లేవారైనా ప్రాజెక్టులోకి పడిపోయే ప్రమాదం నెలకొంది.

**ప్రతిపాదనలు పంపాం: హరి, ప్రాజెక్టు ఇంజినీర్**

ప్రాజెక్టు వాక్‌వే మరమ్మతులకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. కంపచెట్లు ఎప్పటికప్పుడు తొలగించేలా తగు చర్యలు తీసుకుంటాం. ప్రాజెక్టు రక్షణకు త్వరలో సెక్యూరిటీని ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటాం.

# ఔషధం.. అగ్గువ

కర్నూలు : జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరలపై 12 శాతం ఉన్న పన్నును 5 శాతానికి తగ్గించింది. దీంతో వాటి ధరలు దిగొచ్చాయి. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్యారోగ్యశాఖ, ఔషధ నియంత్రణ శాఖ, సర్వజన వైద్యశాల, కంటి ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో వారం రోజుల పాటు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

**దుకాణాల ఎదుట వివరాలు**

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 3 వేల ఔషధ దుకాణాలు ఉన్నాయి. జీఎస్టీ 2.0 సంస్కరణల అనంతరం సెప్టెంబరు 22వ తేదీ నుంచి తగ్గింపు ధరలు అమల్లోకి వచ్చాయి. ఈ విషయం వినియోగదారులకు తెలిసేలా ఔషధ హోల్‌సేల్, రిటైల్ దుకాణాల ఎదుట తగ్గిన ధరల వివరాలు ప్రదర్శించాలి. ఇప్పటికే పలు మందుల షాపుల వద్ద ధరల వివరాలతో కూడిన పత్రాలు ప్రదర్శిస్తున్నారు. దీంతో పాటు కొనుగోలుదారులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని.. దానిపై సవరించిన జీఎస్టీ ప్రకారం ఎమ్మార్పీ తగ్గించి మందులు



విక్రయిస్తున్నట్లు స్టాంపు వేయాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇవి అమలయ్యేలా జిల్లా డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఏడీ రమాదేవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

**వేటికి ఎంత తగ్గించారు**

గుండె, మూత్రపిండాల జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ బాధితులు వినియోగించే మందులతో పాటు వైద్య పరీక్షల కిట్లు, ఆయుర్వేద, హోమియోపతి, యునాని ఔషధాలు, హెర్బల్ ఉత్పత్తులు, పంచకర్మ చికిత్సలపై పన్నును 5 శాతానికి పరిమితం చేశారు. అవయవ మార్పిడి వంటి చికిత్సల్లో ఉపయోగించే 36 ప్రాణ రక్షక మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేశారు. వైద్య అవసరాలకు వినియోగించే ఆక్సిజన్‌పై 18 శాతం ఉన్న సుంకం 5 శాతానికి తగ్గింది. వీటితో పాటు థర్మామీటర్లు, మెడికల్ కిట్లు ఇతర వైద్య సంబంధిత వస్తువులపై పన్నుల భారం తగ్గడంతో ఈమేరకు ధరలు కూడా తగ్గాయి.

# తలుపులు ధ్వంసం.. తడులకు కష్టం

ఎమ్మిగనూరు : జిల్లా పశ్చిమ ప్రాంత జీవనాడి తుంగభద్ర దిగువ కాల్వ నీరు చేనుకు చేరడం లేదు. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో 74 కి.మీ. మేర ప్రధాన కాల్వ ప్రవహిస్తోంది. రెండు సీజన్లకు కలిపి 24 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. 724 క్యూసెక్కుల మేర నీరు ప్రవహించేలా కాల్వ నిర్మించారు. 1,51,134 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలి. ప్రధాన కాల్వ తలుపుల(షట్టర్ల)కు ఏళ్లుగా నిర్వహణలేక తుప్పుపట్టాయి. ఎక్కడికక్కడ రంధ్రాలు పడటంతో నీరంతా లీకేజీ అవుతోంది. ఇటీవలం 17 కి.మీ. మేర పరిశీలన చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. లీకేజీ వల్ల ఏటా 2.5 టీఎంసీల నీరు వృథా అవుతోంది..దొడ్డిమేకల ఎస్కేప్ నీరంతా వంక పాలవుతోంది. రెండు గేట్లు అమర్చారు. అవి తుప్పు పట్టడంతో నీరంతా వంకలో పారుతోంది. తలుపులు మూసినా.. కింద భాగం నుంచి లీకేజీ కావడంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. 45వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకమవుతోంది.

**తుప్పు పట్టినా పట్టించుకోరు**

గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. షట్టర్లు, గేజ్ మార్పిడి, రంగులు, గ్రీజు పూయడానికి నిధులు ఇవ్వలేదు. కొన్నింటికి రంధ్రాలు పడినా పట్టించుకోలేదు.

కొతాళం, మాధవరం, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు డీసీఆర్ (డ్రాప్ కం రెగ్యులేటర్), గుడేకల్లు, మిట్టసోమాపురం, గాజులదిన్నె(జీడీపీ) గేట్లకు గ్రీజు, ఇతర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. షట్టర్లు సరిగా లేక నీరు వదిలిన సమయంలో కాల్వల కోతకు గురై. డిస్ట్రిబ్యూటరీ కాలువల పరిధిలోని కౌతాళం, మాధవరం, కోసిగి, ఎమ్మిగనూరు, గంగవరం, చిన్నతుంబళం, పొలకలదిన్నె, గోనెగండ్ల, నాగులదిన్నె, డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సుమారు 35వేల ఎకరాల బీడు భూములుగా మారాయి.

మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం రూ.8 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు.ప్రధాన గేట్లు: కౌతాళం, మాధవరం, సూగూరు, పెద్దకడబూరు, గుడేకల్లు, ఎమ్మిగనూరు (డీజీఆర్), మిట్టసోమాపురం వంకలకు గేట్లు: మాధవరం, చిన్నతుంబళం, పొలకలదిన్నె ఎస్కేప్‌ల ఉన్నాయి. ప్రధాన కాల్వ 45 కి.మీ. డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 105 కిలోమీటర్లు, పిల్ల కాల్వలు. డిస్ట్రిబ్యూటరీలు: 15 వీటి పరిధిలో కాల్వ పొడవు: 190.5 కి.మీ. పిల్ల కాల్వల స్లూయిస్: 310 కాల్వలు వీటిలో దాదాపు 250 కాల్వలకు స్లూయిస్ లేవు.

# కేసీ లాకులు.. నిధులివ్వక లీకులు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో సాగునీటి వ్యవస్థకు ఇబ్బందులు తప్పడం లేదు. నీటిపారుదల శాఖ పరిధిలో కీలకమైన లాకుల నిర్వహణ, గేట్లు, షట్టర్ల మరమ్మతులు వంటి పనులపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా సాగునీరంతా వృథాగా పోతోంది. కేసీ కాలువ పరిధిలో కోడుమూరు నియోజకవర్గంలోని సుంకేసుల ఆనకట్ట నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలోని రాజోలు ఆనకట్ట వరకు 32 చోట్ల ఉన్న లాకులు దాదాపు దెబ్బతిన్నాయి. 1.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించడంలో కేసీ కాల్వలో ప్రధాన నీటి నియంత్రణ వ్యవస్థన సంతజూటూరు పికప్ ఆనకట్ట పాత్ర ఎంతో కీలకం. దీని షట్టర్లు పూర్తిగా దెబ్బతిని తుప్పు పట్టిపోయాయి. బ్రిటిష్ వారి హయాంలో హెడ్ రెగ్యులేటర్ల వద్ద 10 గేట్లు ఏర్పాటు చేశారు. ఇవీ దెబ్బతిన్నాయి. ఐదేళ్ల కిందట వైకాపా ప్రభుత్వ హయాంలో సుమారు రూ.50 లక్షలతో ఫాలింగ్ షట్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కసారి షట్టర్లు ఏర్పాటుచేస్తే ఐదేళ్ల వరకు మరమ్మతులు అవసరం లేదు. పనులు నాసిరకంగా చేయడంతో వ్యవస్థ అధ్వానంగా మారింది.

గేట్లు దెబ్బతిని..

వెలుగోడు రిజర్వాయర్ వద్ద షట్టర్లు కొన్ని పనిచేయడం లేదు. 1ఆర్ స్లూయిస్ గేటు మరమ్మతులకు గురైంది. 3.9 కి.మీ ప్రాంతంలో మైనర్ బ్లాక్ వద్ద మరమ్మతులు చేయాల్సి ఉంది. బ్లాక్ నంబరు–13 వద్ద గేటు సరిగా పనిచేయడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 49వ బ్లాకు పరిధిలో ప్రధాన కాలువపై ఉన్న స్లూయిస్ గేట్లు దెబ్బతిన్నాయి.

**నీటి విడుదలకు ఇబ్బందులు**

నంద్యాల మండల పరిధిలోని పొన్నాపురం గ్రామ సమీపంలో నూనెపల్లె సప్లయ్ ఛానల్ ఉంది. పొన్నాపురం నుంచి గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామం వరకు కేసీ కాలువ ద్వారా 20 వేల ఆయకట్టుకు నీరందించే బ్యాంక్ కెనాల్ లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

కేసీ ప్రధాన కాలువ నుంచి పంట కాలువలకు నీటి విడుదల ఇక్కడి నుంచే జరుగుతుంది. లాకులు దెబ్బతినడంతో నీటి విడుదల కష్టంగా మారింది.

గోస్పాడు మండలం జిల్లెల గ్రామ సమీపంలో ఉన్న సప్లయ్ ఛానల్ లాకులు అధ్వానంగా మారాయి. గోస్పాడు, కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టు ఈ ఛానల్ పరిధిలో ఉంది.

**నెమ్మదించిన ఓఅండ్‌ఎం పనులు**

వివిధ సాగునీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి షట్టర్లు, గేట్లు, తూముల మరమ్మతులకు ఓఅండ్‌ఎం కింద నిధులు మంజూరయ్యాయి. పనులు సంబంధించిన టెండర్లు సాగుతున్నాయి. కేసీ కాలువ షట్టర్లు, తూముల మరమ్మతులకు సంబంధించి సబ్ డివిజన్ల వారీ కోడుమూరు, కర్నూలు, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాల పరిధిలో 133 పనులకు రూ.9,35,55,000 విడుదలయ్యాయి. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. సాగునీరు విడుదల కావడంతో పలుచోట్ల పనులు ఆగిపోయాయి.

# ‘కొత్త బాస్’ కట్టడి చేస్తారా?

విజయనగరం : శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన పోలీసు శాఖలో కొందరు కింది స్థాయి అధికారులు, పోలీసులు జిల్లాలో అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఫిర్యాదుదారుల గోడు వినకుండా అనుచితంగా వ్యవరిస్తూ ఆ శాఖ పరువు తీస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు కొందరిని వీఆర్‌కు పంపగా.. మరికొందరిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గత 15 నెలల్లో జిల్లాలో ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్సైలు, అయిదుగురు కానిస్టేబుళ్లపై అధికారులు చర్యలు తీసుకోవడం పరిస్థితి తీవ్రత చెబుతోంది. జిల్లా నూతన ఎస్పీగా ఎ.ఆర్.దామోదర్ రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో వీరి ఆగడాలు ఎంతవరకు కట్టడి చేస్తారనేది చూడాలి. చర్యలు తీసుకున్నా కానరాని మార్పు.. అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నా కొంతమందిలో మార్పు కనిపించడం లేదు. నూతన ఎస్పీగా ఏఆర్ దామోదర్ ఈ విషయంలో దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

**అధికారులపైనే ఎఫ్ఐఆర్‌లు**

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ సీఐపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతంలో జామి పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సైగా పనిచేసినపుడు ఒక ఆస్తి విషయంలో ఫిర్యాదుదారుడికి వ్యతిరేకంగా వ్యవహరించారని, న్యాయస్థానం ఆదేశాలను బేఖాతారు చేశారనే ఫిర్యాదుపై ఉన్నతాధికారులు చర్య తీసుకున్నారు.

నాలుగు నెలల క్రితం ఎస్.కోట గ్రామీణ సీఐ రవికుమార్‌ను వీఆర్‌కు పంపించారు. లక్కవరపుకోట పోలీసు స్టేషన్ పరిధిలో కోడిపందేలపై దాడి చేసి సీజ్ చేసిన ప్రాపర్టీని వదిలేశారన్న కారణంతో ఉన్నతాధికారులు ఆగ్రహించారు. ఈ స్టేషన్ రైటర్‌ను సస్పెండ్ చేశారు. గుడివాడ గ్రామంలో దళిత యువకులను కులం పేరుతో దూషించారని బాధితుల ఫిర్యాదుపై వేపాడ ఎస్సైగా పనిచేసిన దేవిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి వీఆర్‌కు పంపించారు. ఇందులో రాజకీయ జోక్యం కనిపిస్తోందని ఎస్సైపై దాడి చేసిన వారిపైనా చర్యలు తీసుకున్నారు. గతంలో గజపతినగరంలో పనిచేసిన ఎస్సైని వీఆర్‌కు పంపించారు. స్టేషన్‌కు వచ్చిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపణ



ఎదుర్కొన్నారు.

**గాడితప్పుతున్న సిబ్బంది**

కింది స్థాయి పోలీసు సిబ్బంది వివిధ అంశాల్లో తలదూరుసుతో వ్యవహరిస్తున్నారు. నగరంలోని సీసీఎస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి విరాళాలు వసూలు చేస్తున్నారు. రాజకీయ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. క్రమశిక్షణ పాటించాల్సిన కానిస్టేబుళ్లు కొందరు నాయకులతో అంటకాగుతున్నారు. ఉన్నతాధికారులు బదిలీ చేసినా రాజకీయ పలుకుబడితో మళ్లీ నగరానికి బదిలీ చేయించుకుంటున్నారు.

పోలీసు అధికారి ఒకరు బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ముఠాకు పరోక్ష సహకారం అందిస్తూ నెలవారీ వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై శాఖాపరమైన విచారణ సాగుతున్నట్లు తెలిసింది. జూదరులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణపై నలుగురు కానిస్టేబుళ్లు, ఒక ఎస్సైని గతంలో బదిలీ చేశారు. బొబ్బిలి స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఎస్సైపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయి.

చోరీకి గురైన చరవాణులు స్వాధీనం చేసుకుని తిరిగి ఇచ్చే విషయంలోనూ కొన్ని స్టేషన్లలో రూ.వేలల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# కాసుల ‘వెదు’రిల్లు

ఆత్మకూరు : “దుక్కి దున్నాల్సివసరం లేదు.. ఎరువు వేయనక్కర్లేదు.. సస్యరక్షణ చర్యలు చేపట్టనక్కర్లేదు.. చీడపీడల బాధ ఉండదు.. ఒక్కసారి నాటితే 40 ఏళ్ల దాకా చూసుకోనక్కర్లేదు.. కాసుల ‘వెదు’రిల్లుకు ప్రోత్సాహం ఇవ్వాలని ‘కూటమి’ ప్రభుత్వం నిర్ణయించింది. రానున్న రోజుల్లో పాలిథిన్ స్థానంలో వెదురు ఉత్పత్తుల వినియోగం పెరగనుంది.. ఈ నేపథ్యంలో వెదురు జాతి పునరుద్ధరణలో భాగంగా ‘నేషనల్ బ్యాంబూ మిషన్’ పథకం ద్వారా వెదురు పెంపకాన్ని ప్రోత్సహించాలని నిశ్చయించారు.”

**ఏటా డబ్బులిస్తారు**

ఐదెకరాల్లో సాగు చేస్తే రూ.50వేలు రాయితీ ఉంటుంది. మొదటి ఏడాది రూ.25 వేలు, రెండో ఏడాది రూ.15 వేలు, వడో ఏడాది రూ.10 వేల చొప్పున ఇస్తుంది.



బతికి ఉన్న మొక్కల ఆధారంగా డబ్బు చెల్లిస్తారు. గట్ల వెంట బతికి ఉన్న ఒక మొక్కకు మొదటి ఏడాది రూ.60, రెండో ఏడాది రూ.36, వడో ఏడాది రూ.24 చొప్పున మొత్తం రూ.120 ఇస్తారు.

అంతేకాదు వెదురు నర్సరీలు ఏర్పాటు చేస్తే రూ.లక్ష రాయితీ కల్పిస్తారు.

**ఎకరాకు 30 టన్నులు**

ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 10 హెక్టార్లు, నంద్యాలలో 7 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలిస్తుంది. సాగు చేశాక నాలుగేళ్ల తర్వాత దిగుబడి చేతికొస్తుంది.

ఎకరాకు 30 టన్నుల వస్తుంది. ప్రస్తుతం ఒక టన్ను రూ.4 వేలు పలుకుతోంది. ఈ లెక్క ప్రకారం ఏటా రూ.1-1.20 లక్షల ఆదాయం పొందొచ్చు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే అధికారులు వివరిస్తారు.

# గెజిట్‌కు ‘గేటే’శారు



నంద్యాల : జిల్లా కేంద్రమైన నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారులను పుర సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. గేటు వసూళ్ల పేరుతో అక్రమంగా డబ్బులు దండుకొంటున్నారు. నంద్యాల పట్టణంలో వడువేల మందికి పైగా చిరు వ్యాపారులున్నారు. దుకాణాల వద్ద, తోపుడు బండ్లు, పాదబాటలపై పూలు, పండ్లు, కూరగాయలు, తినుబండారాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి నుంచి పన్ను(గేట్లు)లు తీసుకోవద్దని కౌన్సిల్ సమావేశంలో 2024 జనవరిలో తీర్మానించారు. అదే ఏడాది మార్చిలో గెజిట్‌లో పొందుపరిచారు. ఈ ఏడాది జనవరి నుంచి గుట్టుచప్పుడూ కాకుండా వసూలు చేస్తుండటం గమనార్హం.

**గుట్టుగా వసూళ్లు**

కూరగాయల మార్కెట్‌కు సంబంధించి గేటు వసూళ్లకు గతేడాది నుంచి టెండర్లు నిర్వహిస్తున్నారు. గుత్తేదారులెవరూ ముందుకు రావడం లేదు. దీంతో పుర సిబ్బందే వీధుల్లో తిరిగి వసూలు చేస్తున్నారు. ఈ మాటను చిరు వ్యాపారుల నుంచీ తీసుకొంటున్నారు.

వ్యాపారాన్ని బట్టి రూ.50, రూ.30, రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఎన్జీవో కాలనీ, నూనెపల్లె, ఎస్‌బీఐ కాలనీ, బొమ్మలసత్రం, వలసాగరం, సంజీవనగర్ గేట్, మున్సిపల్ కార్యాలయం, చామకాల్వ, రైల్వేస్టేషన్, సాయిబాబానగర్, టెక్కె, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో రెవెన్యూ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా వసూళ్లకు దిగుతున్నారు. మున్సిపల్ సీలు, కమిషనర్ పేరుతో రసీదులు ఇస్తున్నారు.

**10 నెలలు.. రూ.1.5 కోట్లు**

కౌన్సిల్ తీర్మానం కాదని.. ప్రభుత్వ గెజిట్‌ను పక్కన పెట్టి పుర సిబ్బంది వసూలు చేస్తున్న గేట్ల నిధులు ఏమైనట్లు ? పుర ఖజానాకు చేరుతున్నాయా ? లెక్కలు పద్దులు ఉన్నాయా ? అనే విషయంపై అధికారుల నుంచి స్పష్టత లేదు.

మార్చిలో మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో గేట్లకు సంబంధించిన లెక్కలు కౌన్సిల్ ముందుకు రాలేదు. నిత్యం రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు.. ఈ లెక్కన 10 నెలల్లో రూ.1.5 కోట్ల వరకు దండుకొన్నారు. ఈ ఆలస్యంగా బయటకు రావడంతో దిద్దుబాటు చర్యలు ప్రారంభమయ్యాయి. కేవలం పెద్ద వ్యాపారుల నుంచే గేటు వసూళ్లు చేశామనే విధంగా కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు.

# ‘మంచి’నీటి కవచం



ఆత్మకూరు : మనిషి ఆరోగ్యం మంచినీటిపైనే ఆధారపడి ఉంటుంది..స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి రక్షణ ఇస్తుంది.. ఇప్పుడంతా డబ్బా నీటిపై ఆధారపడ్డారు.. నిర్వాహకులు శుద్ధి పేరుతో డబ్బాల్లో గబ్బు నీళ్లు నింపుతున్నారు. మినరల్ పేరుతో సాధారణ నీటిని నింపి రూ.కోట్లు గడిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకోకుంటే ఈ సీజన్‌లో వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. నీటిని పరిశుభ్రంగా ఉంచుతూ.. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్న ఉద్దేశంతో సెప్టెంబరు 18న ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు.

**అవి‘నీటి’ దందా**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మినరల్ వాటర్ పేరుతో భారీ దందా నడుస్తోంది. శుచి.. శుభ్రత లేకుండా మురికి వాడలు.. చిన్న చిన్న గల్లీల్లో వాటర్ ప్లాంట్లు పెట్టి రూ.లక్షల వ్యాపారం చేస్తున్నారు. (మినరల్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్.. ఆల్కలైన్)తో కాసుల వేట కొనసాగిస్తున్నారు. మినరల్ పేరుతో సాధారణ (జనరల్) నీటిని నింపి ప్రజల గొంతులో హాలాహలం నింపుతున్నారు.

20 లీటర్ల క్యాన్ రూ.15-20 వరకు విక్రయిస్తున్నారు. నంద్యాల, కర్నూలు పరిధిలో నిత్యం 16 లక్షల లీటర్ల నీటి అమ్మకాలు జరుగుతున్నాయి. ఇలా ప్రతి నెలా రూ.4.80 కోట్ల నీటి వ్యాపారం ఈ రెండు చోట్లే జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఏటా ఈ వ్యాపారం రూ.30-40 కోట్లకు పైగానే సాగుతోంది. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. పట్టణాల్లో ట్రేడ్ లైసెన్స్ తీసుకొని అక్రమ నీటి వ్యాపారం సాగిస్తున్నారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

ఒక లీటరు నీటిలో టీడీఎస్ 500- 2000 ఎం.జీ, ఫ్లోరైడ్ 0.5- 1.00, కాల్షియం 75- 200, మెగ్నీషియం 30- 100, క్లోరైడ్ 250- 1000, నైట్రేట్ 45, సల్ఫేట్ 200-400 ఎం.జీ వరకు ఉంటేనే సురక్షితం.ఇంట్లో నీటి ట్యాంకులను ప్రతి 2- 3 నెలలకోసారి శుభ్రం చేసుకోవాలి. లోపలి భాగంలో పేరుకుపోయిన ఫ్లోరైడ్, ఉప్పు, పాచీని పూర్తిగా తొలగించి బ్లీచింగ్ పౌడరుతో కడగాలి.


ట్యాంకులో నింపిన బోరు నీటిని ఆర్‌వో యంత్రం ద్వారా శుద్ధి చేసుకుని తాగుతున్నారు. వాటిలోని ఫిల్టర్లను వడు నెలలకోసారి తప్పకుండా మార్చుకోవాలి.ఆర్వో నీటిని ప్రతి వడు నెలలకోసారి టీడీఎస్ పరీక్ష చేయించాలి. లీటర్ నీటికి 500-2000 మిల్లీగ్రాములు (ఎంజీ) ఉంటేనే సురక్షితం. అంతకన్నా ఎక్కువగా ఉంటే వెంటనే ఫిల్టర్‌ను మార్చుకోవాలి.

కర్నూలు, ఆదోని, ఆలూరు, నంద్యాల, బనగానపల్లి, ఆత్మకూరు, డోన్ పట్టణాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ కేంద్రాల్లో నీటి పరీక్షలు చేయించుకోవచ్చు

**డబ్బాల శుభ్రత ఇలా**

రోజులు, నెలలు తరబడి.. డబ్బాలను శుభ్రం చేయడం లేదు. పాచిపట్టిన డబ్బాల్లోనే నీటిని నింపి విక్రయిస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రం చేయడంతోపాటు స్టెరిలైజ్ చేయాలి. రివర్స్ అస్మోసిస్ వ్యవస్థ ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించాలి.లేదంటే వ్యాధుల వ్యాప్తి ఆ నీరు కారణం అవుతుంది.

# ప్రతిభ చూపితే.. ఉపకార వేతనం మీదే!



డోన్ : ప్రతిభ కలిగి ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎనిమిదో తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షను నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనాన్ని అందిస్తూ చదువుకు భరోసాగా నిలుస్తోంది.

**దరఖాస్తు, ఫీజు వివరాలు**

2025-26 విద్యా సంవత్సరానికి సెప్టెంబర్ 4న ప్రకటన వెలువడింది. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబరు 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు దరఖాస్తు ప్రక్రియలో భాగంగా విద్యార్థి వివరాలను ప్రధానోపాధ్యాయుల సమక్షంలో నమోదు చేసుకోవాలి. తర్వాత డీఈవో కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల విభాగంలో దరఖాస్తు నకలు, నామినల్ రోల్స్, ఇతర ధ్రువపత్రాలను జతపరిచి అక్టోబరు 15వ తేదీ లోపు ఇవ్వాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది.

**నాలుగేళ్ల పాటు ప్రోత్సాహం**

పరీక్షలో ప్రతిభ చాటి ఎంపికైన విద్యార్థులకు ఉన్నత చదువులు అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12 వేల ఉపకార వేతనాన్ని అందిస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఉపకార వేతనాన్ని పొందవచ్చు డబ్బులు విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

**విద్యార్హతలివే..** ప్రభుత్వ, జడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, మున్సిపల్, ప్రభుత్వ ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులు.

ఏడో తరగతిలో బీసీ, ఓసీ విద్యార్థులకు 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50లక్షల లోపు ఉండాలి.

డిసెంబరు 7వ తేదీ రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

**పరీక్షా విధానం**

పరీక్ష 3 గంటల పాటు నిర్వహిస్తారు. రెండు విభాగాల్లో మొత్తం 180 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. 90 మార్కులకు మెంటల్ ఎబిలిటీ, 90 మార్కులకు స్కాలస్టిక్ ఎబిలిటీ టెస్టు(ఏడు, ఎనిమిది తరగతుల్లో గణితం, సామాన్య, సాంఘికశాస్త్రం) సబ్జెక్టుల్లో ప్రశ్నలను ఇస్తుంటారు. బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నపత్రం ఉంటుంది.

# ఈ-పంట.. నమోదుకు తంటా!

గరివిడి : అన్నదాతలు వ్యవసాయ సంబంధిత పథకాల రాయితీలు పొందాలన్నా.. ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో చేపట్టాల్సిన ఈ ప్రక్రియ జిల్లాలో నెమ్మదిగా సాగుతోంది. మరోపక్క సాంకేతిక చిక్కులు అవరోధం కలిగిస్తున్నాయి. ప్రభుత్వం విధించిన గడువులోగా నమోదు పూర్తికాకపోతే రైతులు అన్ని విధాలా నష్టపోవాల్సి వస్తుంది.జిల్లాలో రైతులు ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 3.80 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ మొత్తం విస్తీర్ణాన్ని ఖాతా, సర్వే నంబర్ల వారీగా ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలి. ప్రక్రియను ఈ నెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని తొలుత గడువు విధించినా.. అక్టోబరు 15 వరకు పెంచారు. జిల్లాలో ఇప్పటివరకు 1.31 లక్షల ఎకరాల్లో నమోదు చేయగలిగారు. మరో 2.49 లక్షల ఎకరాల్లో చేయాలి.

**ఆలస్యానికి కారణాలివీ..**

మారిన నిబంధనలు ప్రకారం.. ఈసారి సర్వే నంబర్ల వారీగా జియో మ్యాపింగ్ చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం



క్షేత్రస్థాయిలో పూర్తికావడానికి ఎక్కువ సమయం పడుతోంది. సాంకేతిక సమస్యలతో ముందుకు కదలడం లేదు.

యూరియా కోసం రైతులు పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తుండడంతో ఈ-పంట నమోదుపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీ నంబర్లకు, వ్యవసాయ శాఖ సిబ్బంది దగ్గరున్న సర్వే నంబర్లకు సరిపోకపోవడంతో సమస్య ఎదురవుతోంది. బయోమెట్రిక్ పడని రైతులకు ఐరిస్ చేయడానికి సిగ్నల్ సమస్య వేధిస్తోంది.

వెబ్‌ల్యాండ్ నుంచి ప్రభుత్వ భూమి లేదా అభ్యంతరకర సర్వే, ఖాతానంబర్లు డౌన్‌లోడ్ అయితే వ్యవసాయేతర భూమిగా పరిగణించి నమోదు చేయాల్సి ఉంది. వెబ్‌ల్యాండ్, అటవీ భూముల్లో పంటలు ఉన్నా, లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి. బీడు భూములను అయిదేళ్లకు పైగా సాగుచేయవి, 1-5 ఏళ్ల మధ్య చేయనవి, ఈ ఏడాది చేయనవిగా విడదీయాలి. జిల్లాలో వ్యవసాయ పంటల విస్తీర్ణం(లక్షల ఎకరాల్లో): 2.67ఇంతవరకు ఈ-పంట నమోదు: 1.3

ఉద్యాన పంటల విస్తీర్ణం(ల.ఎ): 1.13

నమోదు: 28 వేల ఎకరాలు

గడువులోగా పూర్తిచేస్తాం.. ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే యాప్ ద్వారా పంటల నమోదు జరుగుతోంది. అక్టోబరు 15 వరకు గడువు ఉంది. ఈలోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.భారతి, ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి

# తీరంలో తోడేద్దాం.. కల్తీ చేసేద్దాం..!

హుకుంపేట :ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, అలల తాకిడితో సుందరమైన ఇసుక తిన్నెలు, మడ అడవులు సముద్ర గర్భంలో కలిసిపోతుంటే.. మరో వైపు తీర ప్రాంతాల నుంచి నిశీధి వేళ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చూసీచూడనట్లు వదిలేస్తోంది. తీరానికి రక్షణ కవచంగా నిలిచే ఇసుక దిబ్బలు కరిగిపోతున్నాయి. వాల్టా చట్టానికి సైతం తూట్లు పడుతున్నాయి. పర్యావరణానికీ ముప్పు తప్పడం లేదు. హుకుంపేట, మంచినీళ్లపేట, కంబాలరాయుడుపేట, కొత్తపేట, దేవునల్తాడ, భావనపాడు, వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, డోకులపాడు, అక్కుపల్లి, గుణుపల్లి, మెట్టూరు, రట్టి, బేతాళపురం, గంగువాడ, ఇసుకలపాలెం, రామయ్యపట్నం, బట్టిగళ్లూరు తదితర తీరాల నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా టన్నుల కొద్దీ ఇసుక అక్రమంగా తరలిపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో సంరక్షిస్తున్న సరుగుడు, నీలగిరి, వేప, ఆకేశ్ వంటి పలు రకాల అటవీ వనాలు నాశనమవుతున్నాయి.

‘సముద్ర ఇసుక అక్రమ రవాణాపై సిబ్బంది పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా పెడతాం. ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఇసుక నిల్వలపైనా దృష్టి పెట్టాం. అక్రమ రవాణా, కల్తీ వ్యాపారాలకు పాల్పడితే చర్యలు



తీసుకుంటామ’ని వజ్రపుకొత్తూరు తహసీల్దార్ సీతారామయ్య తెలిపారు.

**అక్రమార్జనే లక్ష్యం!**

ఉద్దాన, తీర ప్రాంతాల్లో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు కల్తీ ఇసుక దందాకు తెర లేపారు. ఈ మేరకు రీచ్‌ల నుంచి బినామీ పేర్లతో ఇసుక తీసుకొచ్చి ప్రధాన రహదారి కూడలిలో నిల్వ ఉంచుతూ, సముద్రపు ఇసుకను అందులో కలిపి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఒక ట్రాక్టరు లోడు వద్ద రూ.1000పైగా అదనంగా తీసుకుంటున్నారు. నాసిరకం ఇసుక వినియోగించడంతో అనతి కాలంలోనే భవనాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**దిబ్బలు మాయం..** వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేట, మంచినీళ్లపేట తీరాల నుంచి అధికంగా ఇసుక తరలిపోతోంది. ఇక్కడ కొంత మంది తీర భూములను ఆక్రమించి అక్రమ ఇసుక అమ్మకాలు చేస్తున్నారు. వీరి నుంచి వ్యాపారులు ట్రాక్టర్ లోడును రూ.500లోపు కొనుగోలు చేసి కల్తీకి పాల్పడుతున్నారు. ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా సుమారు 50 ఎకరాల్లో తవ్వకాలు సాగుతున్నాయి.

జిల్లాలో సముద్ర తీరం పొడవు : 193 కి.మీ.

మండలాలు: 11

# అరటి రైతు కుదేలు

ముదిగుబ్బ : మండలంలోని కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన ఓబిలేసు గతేడాది డిసెంబరులో ఐదు ఎకరాల్లో రూ.6 లక్షల పెట్టుబడి పెట్టి అరటి సాగు చేశారు.వ్యాపారులు కొనేందుకు ముందుకు రాలేదు.టన్ను రూ.2,300తో ఐదు టన్నులు ఆటోలో మండీలకు తరలించారు.గత కొన్ని రోజులుగా టమాటా, ఉల్లి, చీనీ ధరలు పతనం కాగా తాజాగా అరటి ధరలు పడిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వేరుసెనగ తర్వాత అరటి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు.

**తగ్గిన ఎగుమతులు..**

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సుగంధాలు, పచ్చ అరటి, కర్పూరం, చక్కరకేళి, అమృతపాణి రకాలు ఎక్కువగా సాగు చేశారు. ఈ అరటికి మంచి డిమాండ్ ఉండటంతో దిల్లీ, ఇరాన్, ఇరాక్ దేశాలకు ఎగుమతి అవుతాయి. జిల్లాలోని పుట్లూరు, యల్లనూరు, నార్పల, తాడిమర్రితోపాటు ముదిగుబ్బ, తలుపుల, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో అరటి ఎక్కువగా సాగులో ఉంది. సెప్టెంబరు మొదటి నుంచి ధరలు పూర్తిగా పడిపోవడంతో దిగుబడి కొనేవారు కరవయ్యారు. ప్రధానంగా మహారాష్ట్రలో ఇదే సమయంలో దిగుబడి మార్కెట్‌కు అధికంగా రావడంతో మన అరటికి డిమాండ్ తగ్గింది.

**టన్ను రూ.4 వేల నుంచి 5 వేలు**జూన్, జులై నెలల్లో టన్ను ధర



రూ.15 వేల నుంచి 18 వేలు ఉండగా, వేసవిలో రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు ధరలు పలికాయి. గత నెలలో టన్ను రూ.9,500 నుంచి రూ.12 వేల వరకు పలికింది. ప్రస్తుతం టన్ను రూ.4 వేలు, రూ.5 వేలు పలకడంతో తోట మీదనే పంటను వదిలేస్తున్నారు. కొందరు స్వయంగా గెలలు కత్తిరించి ఆటోలో స్థానికంగా తోపుడుబండ్ల వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

**ఆసక్తి చూపడం లేదు..– ఉమాదేవి, చంద్రశేఖర్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యాన శాఖాధికారులు**

ఎగుమతులు తగ్గడంతోనే ధరలు పడిపోయాయి. రెండో దశలో వచ్చిన అరటి గెలలు కావడంతో వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నవంబరు నుంచి ధరలు పెరిగే అవకాశముంది.

# ఇసుక తోడేస్తే ఎడారే!

కదిరి: అసలే కరవు జిల్లా.. వర్షాలు అంతంత మాత్రమే. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి. భావితరాల కోసం నీటిని పొదుపుగా వాడుకోవాలి. నదులు, చెరువులు, కుంటలను కాపాడుకోవాలి. అయితే కొందరు ధన దాహంతో నదులు, కుంటల్లో ఇసుకను భారీగా తోడేస్తున్నారు. భూగర్భ జలాల స్థావరాలైన ఇసుక తెరనంతా తవ్వేసి ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి వృక్ష సంపద హరించిపోతుంది. పండ్ల తోటలు ఎండి ఎడారిగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదానికి ముందే మేలుకొని ఇసుకను కాపాడితే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని సూచిస్తున్నారు.

**నీటి నిల్వకు ఊతమిస్తేనే..**

నేలపై వర్షం మూడు భాగాలుగా విడిపోతుంది. ఒకటి అనువైన చోట నిల్వ చేరటం. రెండోది ఎక్కువైన నీరు మరోచోటికి ప్రవహించటం. మూడోది ఆవిరిగా మారటం. నీరు నిల్వ చోటులో ఇసుక ఉంటే పీల్చుకుని ఊటగా మారి భూగర్భ జలం పెరుగుతుంది. ఇలా వర్షాకాలంలో నీరే ఏడాదంతా బోర్లు, బావుల్లో అందుబాటులో ఉంటుంది. నీరు ఇంకకపోతే ఎండిపోతాయి.

**నిబంధనలు పాటించాల్సిందే..**

ఇసుక భూగర్భ జలాల వృద్ధికి ఎంతో అవసరం. గట్టి నేల వరకు తోడేస్తే నీరింకదు. మితిమీరి ఇసుకను తవ్వేయటం వల్ల భూగర్భంలోకి నీరెళ్లకుండా అరెస్ట్ చేసిన వాళ్లవుతాం. నిబంధనలకు లోబడి ఇసుక తీసుకోవాలి. వంక, వాగుల్లో ఇసుక పది అడుగుల్లో ఉంటే రెండు అడుగుల వరకు తీసుకోవచ్చు. ఇసుక 20శాతం వాడుకుంటే భవిష్యత్తుకు జల ప్రమాదం ఉండదు. వరుసగా రెండేళ్లు వాన పడకపోతే భూగర్భ జలమే కాకుండా చెట్టూ, చేమ ఎండిపోతాయి. తాగునీటికీ తల్లడిల్లి పోవాల్సిందే.



నేల స్వభావం శాండ్, సీట్, క్లే మూడు రకాలుగా ఉంది. సీట్, క్లే స్వభావ నేలల్లో వర్షపునీరు ఇంకే అవకాశం తక్కువ. వాన ప్రవాహంలా ముందుకెళ్లటంతో భూగర్భ జలం తక్కువ. అదే ఎర్రనేల వర్షానికి ఇసుకగా మారటంతో నీరు ఊటగా భూమి లోపలికెళ్తుంది. వాన బాగా పడి వంకలు, వాగుల్లో నీళ్లుంటే రెండేళ్లు సమస్య ఉండదు.

**ప్రమాదకర పరిస్థితులు**

కర్ణాటక నుంచి జిల్లాలోని తనకల్లు మీదుగా పాపాగ్ని, గోరంట్ల, ఓబుళదేవరచెరువుల మీదుగా సోమావతి నదులు ప్రవహిస్తాయి.

పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గ పరిధి మండలాల మీదుగా చిత్రావతి వెళ్తుంది. ఇసుక తవ్వేందుకు అనుమతుల్లేకున్నా ఉచితాన్ని సాకుగా ఇసుకను తోడేస్తున్నారు.

వర్షాకాలమైప్పటికీ నీటి నిల్వలు ప్రమాద పరిస్థితులను తలపిస్తున్నాయి. మే నెలలో 8, నవంబరులో 3 మీటర్ల లోతున నీటిమట్టం ఉండాలి. వర్షం కురుస్తున్నా 12.70 మీటర్లకు పడిపోయింది. తనకల్లు, గుడిబండ, రొళ్ల, అమరాపురం మండలాల్లో నీటిమట్టం 20 మీటర్లకు మించి లోతుకు వెళ్లింది. దుస్థితికి కారణం పరిమితికి మించి లోతుకు ఇసుక తవ్వేయటమే.

# జ్ఞానసీమ.. చాలా స్మార్ట్!



అనంతపురం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత బుక్కరాయసముద్రం మండలం జంతులూరులో ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీ స్మార్ట్ వర్సిటీగా రూపుదిద్దుకుంది. మొదటి విడత కింద రూ.350 కోట్లతో పనులు పూర్తి చేసి జులైలో భవనాలను అందుబాటులోకి తెచ్చారు. 2 వేల మందికిపైగా విద్యార్థులు చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణానికి జ్ఞానసీమ అని నామకరణం చేశారు. ప్రస్తుతం అత్యాధునిక వసతులతో పాటు సాంకేతిక హంగులతో స్మార్ట్ వర్సిటీగా తీర్చిదిద్దారు.

**ఎక్కడ.. ఏమి జరిగినా..**

జ్ఞానసీమ ప్రాంగణంలో 2,500 డేటా లాన్ పాయింట్లు, 500 వైఫై రూటర్లు, 400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 360 డిగ్రీల కోణంలో రికార్డు చేసేలా సీసీ కెమెరాలు ఉన్నాయి. వైఫైను ఉచితంగా సద్వినియోగం చేసుకోవచ్చు.డేటా సెంటర్‌లో డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో అనుసంధానం చేశారు. వాటి ద్వారా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎక్కడైనా ఎలాంటి సమస్య తలెత్తినా పసిగట్టడానికి ముగ్గురు సిబ్బంది పని చేస్తుంటారు.

**డిజిటల్ పోడియం**

తరగతి గదుల్లో ఆచార్యులు బోధించడానికి డిజిటల్ పోడియం, తెరలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో విదేశీ ప్రొఫెసర్లు డిజిటల్ తెరపై ఇక్కడి విద్యార్థులకు బోధిస్తారు.

**అత్యుత్తమ కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులో ఉంది.**

**ఆధునిక అగ్నిమాపక వ్యవస్థ** ప్రతి గదిలో అగ్ని ప్రమాదాలను నిలువరించడానికి అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రమాదం సంభవిస్తే వెంటనే సెన్సర్ గుర్తించి మంటలు ఆర్పేలా పరికరాలను ఎక్కడికక్కడ అమర్చారు విశ్వవిద్యాలయ విద్యుత్తు అవసరాల కోసం రూ.5 కోట్లతో సౌర విద్యుత్తు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. వసతిగృహాలు, అకడమిక్ భవనాల మధ్య దూరం కిలోమీటరు ఉంటుంది. దివ్యాంగ విద్యార్థుల కోసం బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచారు.

# మ్యుటేషన్ అక్రమం.. ముదురుతున్న వివాదం



చెన్నేకొత్తపల్లి : వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు పేదల భూముల్ని అడ్డదారుల్లో మ్యుటేషన్ చేసిన బాగోతాలు వెలుగులోకి వచ్చాయి. చెన్నేకొత్తపల్లి పరిధి న్యామద్దలలో భూమి సంబంధ, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు లేకుండానే ఒకరిద్దరి భూములు కొనుగోలు అని చెప్పి.. అదే ముసుగులో మిగులుగా ఉన్న మరికొందరి భూముల్ని కలిపేసి ఆన్‌లైన్ చేయించుకోవడం వివాదాస్పదమవుతోంది. 1 టూ 8 ప్రొఫార్మాతో...డైగ్లాట్లోని భూములను అడంగళ్లోకి తీసుకురావాలని దశాబ్దం క్రితం రెవెన్యూలో 1 టూ 8 ప్రొఫార్మా తీసుకువచ్చారు. అన్‌లైన్‌లో లేని పట్టా భూములన్నింటినీ మిగులు భూముల జాబితాలో ఉంచారు. న్యామద్దల చెరువు కింద 203.01 ఎకరాల ఆయకట్టు భూమి ఆ జాబితాలో ఉంది. ఈ భూములు న్యామద్దల, చిన్నప్పేట, చిన్నపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతుల వారసత్వంగా భావిస్తూ వచ్చారు. ఒక్కో రైతుకు పది సెంట్ల నుంచి ఎకరా, రెండెకరాల వరకు విస్తీర్ణం ఉంది. రైతులు వాటిని తరతరాలుగా సాగు చేస్తున్నారు. పలువురు బతుకు దెరువుకు బెంగళూరు, హిందూపురం, ధర్మవరం ప్రాంతాలకు వలస వెళ్లారు. గ్రామం విడిచి వెళ్లిన వారి వివరాలు తెలుసుకున్న న్యామద్దల గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి, మంజునాథ్‌లు రెవెన్యూ అధికారుల సహకారంతో కేవలం 1బీతో తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై వివాదం రేగుతోంది. బాధిత రైతులు 20 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 30 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు అంచనా. సర్వేనంబర్లు 196-7ఏ, 177, 192, 192-3, 193, 177-2, 195లలో భూములు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది.

**వేరొకరి భూమి నా పేరున ఎక్కించారు–** ముకుంద, రైతు

సర్వే నంబరు 233-2 లో 1.04 ఎకరాల భూమి మా పూర్వీకుల నుంచి సంక్రమించింది. ఆన్‌లైన్ చేయాలని రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే ఏవేవో కారణాలు చెప్పి కాలయాపన చేశారు. చేసేది లేక రఘునాథరెడ్డికి విక్రయించా. ఆయనకు ఆధార్, ఫొటో ఇచ్చాను అంతే.. ఏకంగా 1బీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆన్‌లైన్ నమోదు కోసం నేను కాళ్లా వేళ్లా పడినా కనికరించని అధికారులు విక్రయించిన వెంటనే వారి పేరుపై నమోదు చేసేశారు. తర్వాత తెలిసింది.. నేను అమ్మింది 1.04 ఎకరాలు కాదని అంతకన్నా ఎక్కువని. ఇలా మరికొందరి రైతుల భూములు నా పేరున మ్యుటేషన్ చేయించి తర్వాత రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిసింది.

తాఖీదులు జారీ : ఓ రైతు మమ్మల్ని ఆశ్రయించడంతో నిందితులకు తాఖీదులు జారీ చేశాం. వారు ధ్రువీకరణ పత్రాలు చూపకపోతే ఉన్నతాధికారులకు నివేదిస్తాం అని చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ శ్రీరామనాయక్ చెబుతున్నారు.

# యూరియాకు ఇతర ఎరువుల లంకె!




అనంతపురం: కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన హరీష్ మొక్కజొన్న సాగు చేశారు. నాలుగు రోజులుగా యూరియా కోసం కళ్యాణదుర్గంలోని దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. పురుగు మందులు కొంటేనే యూరియా ఇస్తామని చెప్పడంతో స్థానిక వ్యవసాయాధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. బొమ్మనహాళ్‌కు చెందిన రైతు 10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. యూరియా కోసం ఉరవకొండలోని ఓ దుకాణానికి వెళ్లగా బస్తా రూ.400 అని చెప్పాడు. వ్యాపారి చెప్పిన ధరకే కొనుగోలు చేశారు.

విడపనకల్లుకు చెందిన రైతు 5 బస్తాల యూరియా కోసం దుకాణానికి వెళ్లగా మిగతా ఎరువులు కొంటేనే ఇస్తామన్నారు. అవసరం లేకపోయినా రూ.15 వేలు విలువైన సరకు కొనాల్సి వచ్చిందని సదరు రైతు వాపోయారు.

యూరియా కోసం ప్రైవేటు దుకాణాలకు వెళ్లిన రైతులకు ఇతర ఎరువులు, పురుగుల మందులను అంటగడుతున్నారు. కొనకపోతే యూరియా ఇవ్వబోమని తేల్చి చెబుతున్నారు. గత్యంతరం లేక కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల్లో రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో అన్నదాతలు ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

**లెక్కలు దాస్తున్నారా?** అనంతపురం జిల్లాకు 26,789 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించారు. ఇప్పటివరకు 23,366 టన్నులు సరఫరా చేయగా 18,924 టన్నులు విక్రయించారు. అవసరానికి మించి సరకు అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. రైతులకు రెండు బస్తాలకు మించి ఇవ్వడం లేదు. ఇదే క్రమంలో ప్రైవేటు డీలర్లకు 30 శాతం కేటాయించామని చెబుతున్నా అధికారులు లెక్కలను బయటపెట్టడం లేదు. ఏ డీలర్‌కు ఎంత కేటాయించారు? సదరు డీలర్ ఇప్పటివరకు ఎంత విక్రయించారనే లెక్కలను దాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**పేరుకే సర్కారు ధరలు**

వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 45 కిలోల యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.260. సొసైటీలు, ఆర్ఎస్‌కేల్లో ఇదే ధరకు విక్రయిస్తున్నారు. ప్రైవేటుగా రూ.300కు తక్కువకు అమ్మడం లేదు. కొందరు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల రూ.500 సైతం అమ్ముతున్నారు. పురుగుమందులు కొంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నారు. అభ్యంతరం చెప్పినవారికి స్టాక్ లేదని వెనక్కి పంపుతున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం–** ఉమామహేశ్వరమ్మ, జేడీఏ

ప్రైవేటు వ్యాపారులు నిబంధనల మేరకు యూరియా విక్రయించాలి. ఇతర ఎరువులు, మందులు కొంటేనే యూరియా ఇస్తామనే వారిపై చర్యలు తీసుకుంటాం. అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే లైసెన్సు రద్దు చేస్తాం.

# జగనన్న కాలనీలో కబ్జా పర్వం

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలోని జగనన్న కాలనీలో రూ.లక్షలు విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఆర్డీటీ బదిరుల పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ప్రజా అవసరాల కోసం పాఠశాల, దేవాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించడానికి రెవెన్యూ అధికారులు 30 సెంట్లు కేటాయించారు. ఈ స్థలానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం చేయకూడదు.

**బినామీల పేరుతో పట్టాలు**వైకాపా ప్రభుత్వ హయాంలోనే ఓ వైకాపా నాయకుడు బినామీల పేరుతో ఎన్నికల సమయంలో దాదాపుగా 19 పొజిషన్ పట్టాలు చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తర్వాత కూటమి ప్రభుత్వం రావడంతో కబ్జా స్థలాల్లోకి వెళ్లడానికి వైకాపా నాయకులు భయపడ్డారు. తాజాగా ఈ స్థలంలోనే పునాదులు తవ్వి కట్టడాలు చేపడుతుండటం గమనార్హం.

**విపణిలో సెంటు స్థలం రూ.3లక్షలు!** ప్రస్తుతం ఇక్కడ సెంటు ధర రూ.3 లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన 50 లక్షల విలువైన స్థలం అన్యాక్రాంతం అవుతోంది. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించి స్థలాన్ని కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు వివరణ కోరగా వీఆర్‌వోలను స్థలం వద్దకు పంపి పరిశీలించామని, త్వరలోనే ఆక్రమణలు తొలగిస్తామని సమాధానమిచ్చారు.

# కస్తూర్బా.. పట్టించుకోరేమబ్బా!

అనకాపల్లి : 'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు' అన్నచందాన తయారైంది జిల్లాలోని కొత్త కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) పరిస్థితి. రూ. కోట్లు ఖర్చు పెట్టి మూడేళ్ల క్రితం పూర్తి చేసిన భవనాలను అతీగతీ పట్టించుకోకుండా వదిలేశారు.

లక్ష్యం : దూరగ్రామాల నుంచి రోజూ పాఠశాలకు వచ్చి.. తిరిగి ఇంటికి చేరేసరికి చీకటి పడిపోతుండటంతో ఇబ్బంది పడుతున్న బాలికలు ఎందరో ఉన్నారు. వారి చదువు, ఉత్తీర్ణతపై ఇది ప్రభావం చూపుతోంది. బాలికా విద్య పెంపే లక్ష్యంగా అన్ని సౌకర్యాలతో కేజీబీవీలు ఏర్పాటుచేశారు. ఇవి సత్ఫలితాలను ఇచ్చాయి. వీటిని స్ఫూర్తిగా తీసుకుని బాలికలు ఎక్కువగా చదువుతున్న ఉన్నత పాఠశాలలకు అనుబంధంగా ప్రత్యేకంగా టైప్-4 కేజీబీవీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాధారణ కేజీబీవీల్లా ఇక్కడ బోధన ఉండదు. హాస్టళ్ల తరహాలో రోజూ ఉదయం, సాయంత్రం ఆహారం, రాత్రికి వసతి కల్పిస్తారు. దీంతో ఎలాంటి ఖర్చు, శ్రమ లేకుండా అన్నివర్గాల బాలికలు చదువుకునే అవకాశం ఉంటుంది.

**ఖర్చు ఇలా.. :** జిల్లాలో 9 చోట్ల టైప్-4 కేజీబీవీల అవసరం ఉందని గుర్తించారు. వందమంది వరకు బాలికలకు వసతి, భోజనశాల, ఇతర సదుపాయాలు అన్నీ ఉండేలా భారీగా భవనాలు నిర్మించారు. ఒక్కో భవనానికి రూ. 2.55 కోట్ల చొప్పున ఖర్చుచేశారు. మూడేళ్ల క్రితమే నిర్మాణాలను సైతం పూర్తిచేశారు. కానీ గత వైకాపా పాలకులకు నిధులు ఖర్చు చేయడంపై ఉన్న ఆసక్తి వీటిని ప్రారంభించి



అందుబాటులోకి తీసుకురావడంపై లేకుండాపోయింది.

**ప్రస్తుత పరిస్థితి:** మూడేళ్లుగా భవనాలు ఖాళీగా.. నిలువెత్తు దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయి. వినియోగంలో లేకపోవడంతో కొన్నిచోట్ల బీటలు వారి మరమ్మతుకు కూడా గురయ్యాయి. వి.మాడుగులలోని భవనంలో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీటికి కొన్ని నిధులు కేటాయించి.. మరమ్మతులు చేయించింది. పేద బాలికలు ఇవెప్పుడు ప్రారంభమవుతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

**ఎక్కడెక్కడ** కె.కోటపాడు, మాకవరపాలెం, రోలుగుంట, సబ్బవరం, వి.మాడుగుల, రాంబిల్లి, నాతవరం, బుచ్చెయ్యపేట, ఎస్.రాయవరం.

త్వరలో అందుబాటులోకి..: టైప్-4 కేజీబీవీ భవనాలు సిద్ధమయ్యాయి. అవసరమైనచోట మరమ్మతులు చేయించాం. ఒక్కో కేంద్రంలో వంట మాస్టర్లు ఇద్దరు, చౌకీదార్, కేర్‌టేకర్, వార్డెన్ల అవసరం ఉంది. వారి నియమకాలు జరుగుతున్నాయి. ఇవి పూర్తయిన వెంటనే అందుబాటులోకి తీసుకొస్తాం.జయప్రకాశ్, ఏపీవో, సమగ్రశిక్ష

# 'అభివృద్ధి బాటలో.. అమృత్ భారత్'

చిత్తూరు : చిత్తూరు రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్(ఏబీఎస్ఎస్) కింద అభివృద్ధి బాటలో నడుస్తోంది. ఎంతో మంది కృషితో ఏబీఎస్ఎస్ కింద ఎంపికై.. సుమారు రూ.14 కోట్ల నిధులతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. చిత్తూరు జిల్లా.. పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఉండటంతో.. రైల్వేస్టేషన్ ముఖద్వారం ఆలయాల నమూనాలతో నిర్మించనున్నారు. ఇప్పటికే పనులు జరుగుతుండగా.. ఏడాదిలోపే పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం లిఫ్ట్ పనులు పూర్తి కాగా.. ప్లాట్‌ఫామ్, ఇతర పనులు జరుగుతున్నాయి.

**విశాలంగా పార్కింగ్..**

రైల్వేస్టేషన్‌లో పార్కింగ్‌కు గతంలో ఇబ్బందులు ఉన్నా.. ప్రస్తుతం విశాలంగా ఏర్పాటు చేస్తున్నారు. ద్విచక్రవాహనాలు, మూడు, నాలుగు చక్రాల వాహనాలు సైతం షెడ్డు కింద నిలిపేలా నిర్మాణం జరుగుతోంది. వేర్వేరుగా స్థలాలను కేటాయించి నిర్మాణ పనులు చేస్తున్నారు.



వాటితో పాటు ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్‌తో పాటు ఉద్యానాలు కూడా అందుబాటులోకి రానున్నాయి.

**ఇవీ.. అభివృద్ధి పనులు**

ముఖద్వారం ఆర్చి, పార్కింగ్, కొత్త భవనం, రూఫింగ్, ఎంట్రీ, ఎగ్జిట్, వెయిటింగ్ హాల్, దివ్యాంగుల కోసం ప్రత్యేక మార్గం, వీల్ ఛైర్స్, అదనపు గదులు, ప్లాట్‌ఫాం విస్తరణ, ప్రాంగణం చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు.

# అడుగడుగునా గండం.. ఈ రోడ్డుకో దండం!

బుచ్చెయ్యపేట: అనకాపల్లి జిల్లాలో దారుణమైన రహదారుల్లో ముందు ఉండేది భీమిలి– నర్సీపట్నం రోడ్డు. దశాబ్దాలుగా కనీసం నిర్వహణ లేక ఇది నరకానికి నకలుగా తయారైందని ప్రజలు మండిపడుతు న్నారు. బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట వద్ద భారీ గుంతలో ఉదయం క్వారీ లారీ కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా చాలా చేపటి వరకు బయటకి రాలేదు. దీంతో రెండు పొక్లెయిన్లను తీసుకువచ్చి వాటి సహాయంతో లారీని బయటకి తీసేందుకు ప్రయత్నించారు. దీంతో ఎట్టకేలకు అతికష్టం మీద బయటకు తీయగలిగారు. వరకు పలువురు వాహనచోదకులు బురదలో కూరుకుపోయి ఇబ్బందులు పడ్డారు. స్కూటీపై రావికమతం నుంచి బంగారుమెట్ట వస్తున్న ఓ యువతి ఇక్కడ బురదనీటిలో పడిపోయింది. సైలెన్సర్‌లోకి నీరువెళ్లి వాహనం మరమ్మతుకు గురయింది. మొబైల్‌తో సహా బ్యాగులోని వస్తువులన్నీ తడిసి పోయాయి.

ద్విచక్రవాహనంపై మూటలతో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి కూడా గుంత కారణంగా ప్రమాదానికి గురయ్యారు. ఒంటి నిండా బురదతో అక్కడి నుంచి మూటలు మోసుకుంటూ వెళ్లాడు. ఇంతటి అధ్వానస్థితిలో ఉన్న రోడ్డులో ప్రయాణించడానికి నిత్యం అవస్థలు పడుతున్నా ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.విశాఖ నగరం నుంచి చోడవరం, మాడుగుల, పాడేరు వెళ్లేందుకు ఇదే కీలక మార్గం కావడంతో.. ప్రజలు నిత్యం ఎన్నో కష్టాలు పడుతున్నారు.

చురకలు



## సరికొత్త ఫ్యాషన్ దుస్తులతో దర్శనమిచ్చిన గ్లోబల్ స్టార్ ప్రియాంక!

ప్రస్తుత కాలంలో చాలామంది హీరోయిన్స్ తమ సినిమాలతోనే కాదు ఫ్యాషన్ దుస్తులతో కూడా అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. అటు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ సరికొత్త ఫ్యాషన్ దుస్తులతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. అందులో భాగంగానే గ్లోబల్ స్టార్ గా పేరు సొంతం చేసుకున్న ప్రియాంక చోప్రా కూడా సరికొత్త ఫ్యాషన్ దుస్తులతో దర్శనమిచ్చింది. దివాలీ సెలబ్రేషన్స్ లో భాగంగా ఈమె ధరించిన దుస్తులు మరింత అట్రాక్ట్ గా నిలుస్తున్నాయి. అందాలను చున్నీతో కవర్ చేస్తూ.. సిల్వర్ వైట్ కాంబినేషన్ లో చంకీలతో అత్యద్భుతంగా డిజైన్ చేసిన ఫాంట్, కోర్టు ధరించి ఉదర భాగాన్ని హైలెట్ చేస్తూ ఫోటోలను షేర్ చేసింది. తాజాగా ప్రియాంక చోప్రా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ మారుతున్నాయి. ఏది ఏమైనా ప్రియాంక చోప్రా ధరించిన ఈ సరికొత్త ఫ్యాషన్ దుస్తులు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. ప్రియాంక చోప్రా విషయానికి వస్తే.. ప్రస్తుతం తెలుగులో సినిమా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. దర్శకుడు ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో.. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఎస్ఎస్ఎంబి 29



సినిమాలో హీరోయిన్గా అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటికే తన పార్ట్ లో కొంత భాగం షూటింగ్ కూడా కంప్లీట్ చేసింది. 2027లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. యాక్షన్ అడ్వెంచర్ మూవీగా రాబోతున్న ఈ సినిమా కోసం అటు ప్రియాంక చోప్రా కూడా గట్టిగానే కష్టపడుతున్నట్లు సమాచారం. ప్రియాంక చోప్రా 1982 జూలై 18.. ఇండియన్ సినీనటి మాత్రమే కాదు మాజీ ప్రపంచ సుందరి కూడా.. ఇప్పుడు హాలీవుడ్ లో కూడా చిత్రాలు చేస్తూ గ్లోబల్ స్టార్ గా పేరు సొంతం చేసుకుంది. తన నటన జీవితాన్ని ప్రారంభించక ముందు మోడల్గా కెరియర్ మొదలుపెట్టిన ఈమె.. 2000 సంవత్సరంలో ప్రపంచ సుందరి కిరీటాన్ని అందుకొని ప్రసిద్ధి చెందింది. 2002లో వచ్చిన తమిళన్ అనే తమిళ చిత్రం ద్వారా నటన జీవితాన్ని ప్రారంభించిన ఈమె ఆ తదుపరి సంవత్సరం అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చిన ది హీరో: లవ్ స్టోరీ ఆఫ్ ఎ స్పై అనే చిత్రం ద్వారా బాలీవుడ్ రంగ ప్రవేశం చేసింది. అదే ఏడాది రాజ్ కన్వర్ దర్శకత్వం వహించిన అందాజ్ చిత్రం ద్వారా ఆమెకు సినీ పరిశ్రమలో తొలి విజయం లభించింది. ఈ చిత్రానికి ఫిలింఫేర్ ఉత్తమ నూతన నటి పురస్కారాన్ని కూడా సొంతం చేసుకుంది. అలా వరుస సినిమాలు చేస్తూ భారీ పాపులారిటీ అందుకున్న ఈమె బాలీవుడ్లో సినిమాలు చేస్తున్నప్పుడే కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల హాలీవుడ్కు వెళ్ళిపోయి అక్కడే సినిమాలు చేస్తూ భారీ క్రేజ్ దక్కించుకుంది. అంతేకాదు బాలీవుడ్లో ఒక్కో చిత్రానికి 45 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకుంటూ అందరిని అబ్బురపరుస్తోంది ఈ ముద్దుగుమ్మ.

## త్రిషకు కుర్రాడు దొరికేసాడా?

అందాల త్రిష ఇంట పెళ్లి భాజాలకు సమయం ఆసన్నమైందా? తల్లిదండ్రులు చూసిన సంబంధానికి అమ్మడు ఒకే చెప్పిందా? అంటే అవుననే ఓ వార్త ప్రచారంలోకి వస్తోంది. త్రిషకు బిజినెస్ మ్యాన్ వరుణ్ మనియన్ తో నిశ్చితార్థం జరగడం.. అటుపై వీగిపోవడం తెలిసిందే. ఇద్దరు ప్రేమవివాహం చేసుకోవాలనుకున్నారు. కానీ అది నిశ్చితార్థం వరకే పరిమితమైంది. ఆ సంఘటన తర్వాత త్రిష మళ్లీ పెళ్లి అనే ఆలోచన లేకుండా సినిమాల్లో బిజీ అయింది. ఈ నేపథ్యంలో త్రిష పెళ్లి చేసుకోదా? అన్న ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ప్రేమలో ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో మరో ప్రేమ వివాహం చేసుకోదా? అన్న ప్రచారాన్ని ఖండించింది. మనసుకు నచ్చిన కుర్రాడు దొరికితే పెళ్లి చేసుకుంటానని...పెళ్లి విషయంలో తానెంతో పాజిటివ్ గా ఉన్నట్లు తెలిపింది. కానీ ఆ గడియలు ఇంకా రాలేదని త్రిష సింగిల్ లైఫ్ తో అర్థమైంది. అటు ఎవరితోనూ ప్రేమలో పడినట్లు ఎలాంటి ప్రచారం కూడా తెరపైకి రాలేదు. సినిమాలు...ఇల్లు తప్ప మరో ప్రపంచంతో సంబంధం లేనట్లే జీవినం సాగిస్తోంది. అయితే తాజాగా త్రిష తల్లిదండ్రులు చూసిన సంబంధానికి ఒకే చెప్పినట్లు కోలీవుడ్ మీడియాలో ప్రచారం మొదలైంది. చండీఘర్



కు చెందిన అబ్బాయితో సంబంధం కుదుర్చుకున్నట్లు వార్తలొస్తున్నాయి. అతడు ఆస్ట్రేలియాలో బిజినెస్ మ్యాన్ అని ఈ మధ్యనే అక్కడ జరిగే వ్యాపారాన్ని స్వదేశంలో కొత్తగా విస్తరించనున్నట్లు వార్తలొస్తున్నాయి. త్రిష తల్లిదండ్రులకు బాగా తెలిసిన కుటుంబం.. కుర్రాడిని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తేలాలి. ప్రస్తుతం త్రిష నటిగా బిజీ అవుతోన్న సంగతి తెలిసిందే. చిరంజీవి హీరోగా నటిస్తోన్న విశ్వంభరలో నటిస్తోంది. తమిళ్ లో కరుప్పులోనూ నటిస్తోంది. చేతిలో ఉన్నవి ఈ రెండు సినిమాలే. మునపటి కంటే అవకాశాలు తగ్గడంతో మళ్లీ ఛాన్స్ బ్యాక్ కోసం ప్రయత్నిస్తోంది. ఈ రెండు సినిమాలు విజయం సాధిస్తే అమ్మడు మళ్లీ బిజీ అవుతుంది. నటిగా ఇప్పటికే సౌత్ లో అన్ని భాషల్నీ టచ్ చేసింది. తెలుగు, తమిళ్ లో ఫేమస్ హీరోయిన్ గా వెలిగింది. బాలీవుడ్ లోనూ అదృష్టాన్ని పరీక్షించుకుంది. కానీ అక్కడ క్లిక్ అవ్వలేదు. ఒక్క సినిమాతోనే అక్కడ నుంచి నిష్క్రమించింది. అయితే తాజాగా మళ్లీ హిందీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు వార్తలొస్తున్నాయి.




## ఫ్రైడే ఫైట్.. ముగ్గురు మూడు డిఫరెంట్ కథలతో..!




స్టార్ సినిమాలే కాదు యువ హీరోల సినిమాల ఫైట్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటాయి. కొత్త కథలతో చేసే ప్రయత్నాలు కొన్నిసార్లు యూత్ ఫుల్ కంటెంట్ తో వచ్చి మెప్పించేవి మరికొన్ని ఉన్నాయి. ఐతే ఈ వీకెండ్ కి మూడు సినిమాలు ముగ్గురు హీరోలు తమ లక్ టెస్ట్ చేసుకోబోతున్నారు. అందులో ఒక తమిళ యువ హీరో కూడా ఉండటం విశేషం. ఐతే ఆ సినిమా నిర్మించింది మాత్రం తెలుగు బడా ప్రొడక్షన్ హౌస్ అవ్వడంతో ఆ సినిమాకు కూడా తెలుగులో మంచి రిలీజ్ లు పడుతున్నాయి.


**లవ్ స్టోరీనే కానీ డిఫరెంట్ అటెంప్ట్..** అక్టోబర్ 17న మూడు సినిమాల మధ్య ఆసక్తికరమైన ఫైట్ జరుగుతుంది. అందులో మొదటి సినిమా సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా వస్తుంది. సిద్ధు, శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా లీడ్ రోల్ లో వస్తున్న సినిమా ఇది.

ఈ సినిమాను నీరజ కోన డైరెక్ట్ చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ సినిమా లవ్ స్టోరీనే కానీ డిఫరెంట్ అటెంప్ట్ అని అంటున్నారు. థమన్ మ్యూజిక్ సినిమాను ఆడియన్స్ లోకి తీసుకెళ్లింది. జాక్ తో షాక్ తగిలిన సిద్ధుకి తెలుసు కదాతో ఎలాగైనా హిట్ కొట్టాల్సిన పరిస్థితి వచ్చింది. పోటీ ఉన్నా కూడా తెలుసు కదా టీం చాలా కాన్ ఫిడెంట్ గా ఉన్నారు. ఇక నెక్స్ట్ కిరణ్ అబ్బవరం కె ర్యాంప్ కూడా రేసులో ఉంది. జైన్స్ నాని డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్ గా నటించింది.

యూత్ ఫుల్ కంటెంట్ ప్లస్ కిరణ్ అబ్బవరం ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్ తో ఈ సినిమా వస్తుంది.

**కిరణ్ అబ్బవరం సినిమాపై కూడా సూపర్ కాన్ఫిడెంట్..** కె ర్యాంప్ ట్రైలర్ ఆడియన్స్ లో మంచి బజ్ క్రియేట్ చేసింది. కిరణ్ అబ్బవరం సినిమా పై కూడా సూపర్ కాన్ ఫిడెంట్ గా ఉన్నాడు. ఇక అక్టోబర్ 17న రిలీజయ్యే సినిమాల్లో తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ వస్తుంది. కీర్తీశ్వరన్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా కూడా యూత్ ఫుల్ స్టోరీగా వస్తుంది. సినిమాలో ప్రదీప్ కి జతగా ప్రేమలు హీరోయిన్ మమితా బైజు వస్తుంది. డ్యూడ్ ప్రమోషనల్ కంటెంట్ కూడా ఇంప్రెస్ చేస్తుంది. ఐతే ఈ 3 సినిమాల్లో ఆడియన్స్ ఫేవరెట్ ఏంటన్నది రిలీజ్ రోజు తెలుస్తుంది. ఈ సినిమాల్లో ప్రదీప్ ఆల్రెడీ లవ్ టుడే, డ్రాగన్ సినిమాల సక్సెస్ ల తర్వాత డ్యూడ్ తో హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నాడు. కిరణ్ అబ్బవరం క తో సూపర్ కంబ్యాక్ ఇచ్చినా మళ్లీ దిల్ రూబా తో మరో షాక్ తిన్నాడు. కె ర్యాంప్ తో అలరించేలా ఉన్నాడు. సిద్ధు తెలుసు కదా కూడా ప్రమోషన్స్ అయితే బాగున్నాయి. సినిమా ఏం చేస్తుందో చూడాలి.

## టాలీవుడ్ బాకీ.. అఖండ తీరుస్తుందా?



ఒకప్పుడంటే ఇండియాలో బాలీవుడ్డే నంబర్ వన్ ఇండస్ట్రీ. కానీ 'బాహుబలి' తర్వాత కథ మారిపోయింది. టాలీవుడ్.. బాలీవుడ్నే కాక మిగతా ఇండస్ట్రీలన్నింటినీ వెనక్కి నెట్టి టాప్‌లోకి వెళ్లిపోయింది. 'బాహుబలి: ది కంక్లూజన్', 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప', 'కల్కి', 'సలార్', 'పుష్ప-2' లాంటి లాంటి భారీ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్లతో మరే ఇండస్ట్రీ అందుకోలేని స్థాయికి వెళ్లిపోయింది. గత పదేళ్ల జాబితా తీస్తే నంబర్ వన్ గ్రాసర్ టాలీవుడ్ నుంచి వచ్చిన సంవత్సరాలు చాలానే కనిపిస్తాయి. గత ఏడాది కూడా 'పుష్ప-2'తో టాలీవుడే రికార్డు అయింది. ఐతే 2025లో మాత్రం టాలీవుడ్ వెనుకబడిపోయింది. ఈ ఏడాది మిగతా టాప్ ఇండస్ట్రీల నుంచి ఐదొందల కోట్లకు తక్కువ కాకుండా వసూళ్లు రాబట్టిన సినిమాలున్నాయి. ఈ ఏడాది హైయెస్ట్ గ్రాసర్ రికార్డు బాలీవుడ్ పేరిటే ఉంది. 'ఛావా' సినిమాతో రికార్డు బాలీవుడ్ సొంతమైంది. ఆ చిత్రం రూ.790 కోట్ల దాకా వసూళ్లు రాబట్టింది. 'సైయారా' రూపంలో నంబర్-2 స్థానం కూడా బాలీవుడ్‌దే. ఈ సినిమా రూ.600 కోట్ల మేర వసూళ్లు రాబట్టింది. ఇక శాండిల్ వుడ్‌కు 'కాంతార: చాప్టర్-1'తో భారీ విజయమే దక్కింది. ఈ సినిమా ఇప్పటికే రూ.400 కోట్లు కొల్లగొట్టింది. ఈజీగా ఇంకో రూ.200 కోట్ల వసూళ్లు వచ్చే అవకాశముంది. అంటే శాండిల్‌వుడ్ కూడా రూ.500 కోట్ల మార్కును దాటబోతున్నట్లే. ఇక కోలీవుడ్ కొన్నేళ్ల నుంచి నంబర్ల రేసులో వెనకబడ్డప్పటికీ.. 'కూలీ' రూపంలో ఆ ఇండస్ట్రీకి కూడా రూ.500 కోట్ల ఘనత దక్కింది. మిక్స్ టాక్‌తోనే ఆ సినిమా ఆ మార్కును అందుకుంది. కానీ టాలీవుడ్ మాత్రం ఇప్పటిదాకా 2025లో రూ.500 కోట్ల మార్కును టచ్ చేయలేదు. 'ఓజీ' రూ.350 కోట్ల మార్కు దిశగా అడుగులు వేస్తోంది. రూ.300 కోట్లతో 'సంక్రాంతికి వస్తున్నాం' రెండో స్థానంలో ఉంది. 'రాజా సాబ్' ఈ ఏడాదే వచ్చేట్లయితే రూ.500 కోట్ల ఘనత దక్కేది కాదు.. హైయెస్ట్ గ్రాసర్ రికార్డు కూడా సొంతమయ్యేదేమో. కానీ అది జనవరికి వాయిదా పడింది. దీంతో ఇక ఆశలన్నీ 'అఖండ-2' మీదే ఉన్నాయి. ఆ సినిమా అంచనాలను అందుకుంటే, పాన్ ఇండియా మ్యాజిక్ వర్కవుట్ అయితే రూ.500 కోట్ల ఘనత సొంతమవుతుందేమో చూడాలి.

## మళ్లీ అదే తప్పు చేస్తున్న శ్రీ లీల.. టెన్షన్ లో ఫ్యాన్స్!

శ్రీ లీల.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్ గా పేరు సొంతం చేసుకున్న ఈమె.. ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. వరుస అవకాశాలు అయితే వస్తున్నాయి కానీ సక్సెస్ రేట్ మాత్రం నిల్ అని చెప్పడంలో సందేహం లేదు. సాధారణంగా ఒకసారి దెబ్బతిన్న తర్వాత మరొకసారి కచ్చితంగా ఎవరైనా సరే కళ్ళు తెరుచుకుంటారు. కానీ శ్రీ లీలా మాత్రం మళ్లీ అదే తప్పు చేస్తూ అభిమానులను టెన్షన్లో పెట్టేసింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.. కె రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో పెళ్లి సంద%ి అనే సినిమాతో హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైంది శ్రీ లీల.. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని.. స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది. ఎంత వేగంగా అయితే స్టార్ స్టేటస్ లభించిందో.. అంతే స్పీడుగా బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ సినిమాలు ఆమె ఖాతాలో పడ్డాయి. దీంతో




శ్రీ లీల స్టోరీ సెలక్షన్ మీద, ఆమె యాక్టింగ్ మీద , క్యారెక్టర్ మీద పలు రకాల సెటైర్లు కూడా వినిపించాయి. ధమాకా సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న ఈమెకు వరుసగా అవకాశాలు తలుపు తట్టాయి. అలా రామ్ పోతినేని తో స్కంద, బాలకృష్ణ హీరోగా నటించిన భగవంత్ కేసరి సినిమాలో బాలయ్యకు కూతురుగా, మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ తో ఆదికేశవ, నితిన్ తో ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, మహేష్ బాబుతో గుంటూరు కారం, గాలి కిరీటి రెడ్డితో జూనియర్ ఇలా దాదాపు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఇందులో భగవంత్ కేసరి, గుంటూరు కారం సినిమాలు మంచి విజయాన్ని అందుకున్నా.. ఈమె కెరియర్ కి పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదు. చివరిగా వచ్చిన జూనియర్ సినిమాతో నైనా సక్సెస్ అందుకుంటుంది అని అభిమానులు ఎంతగానో ఎదురు చూశారు. ఇందులో 'వైరల్ వయ్యారి' పాట ఈమె నటనను ఊహించని రేంజ్ కు తీసుకెళ్లింది. కానీ ఈ సినిమా కూడా పెద్దగా ఈమెకు వర్కౌట్ కాలేదు. పైగా పుష్ప 2 లో స్పెషల్ సాంగ్ చేసింది. ఇప్పుడేమో రవితేజ తో మాస్ జాతర అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కానీ ఈ సినిమా హడావిడి కూడా పెద్దగా కనిపించడం లేదు. పైగా హిందీలో ఆషికీ 3 అంటూ అక్కడి ప్రేక్షకులను పలకరించ చడానికి వెళ్లిన ఈమె.. మొదట్లోనే ఎఫైర్ రూమర్స్ ఎదుర్కొంది. దీనికి తోడు ఆషికి 3 పై కూడా అక్కడ పెద్దగా అంచనాలు ఉన్నట్లు కనిపించడం లేదు.

## క్రేజీ సీక్వెల్ లో బాలీవుడ్ బ్యూటీ

ఇండియన్ మూవీ హిస్టరీలో కల్ట్ మూవీగా నిలిచిన హారర్ ఫాంటసీ మూవీ తుంబాడ్. ఈ సినిమాకు సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. మైథాలజీ, ఫాంటసీ, జానపద, హారర్ అంశాలను మేళవించి ఈ సినిమాలో ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించి ఆడియన్స్ ను మాత్రమే కాకుండా విమర్శకులను కూడా మెప్పించారు. తుంబాడ్ మూవీ 2018లో రిలీజైంది.

**తుంబాడ్ రీరిలీజ్ కు భారీ రెస్పాన్స్..** అయితే రిలీజైన టైమ్ లో ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫ్లాపుగా నిలిచింది. కానీ తర్వాత నెమ్మదిగా ప్రేక్షకుల నుంచి తుంబాడ్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. 2024లో ఈ సినిమాను మేకర్స్ రీరిలీజ్ చేయగా, దానికి ఎవరూ ఊహించని విధంగా అదిరిపోయే కలెక్షన్లు రావడంతో పాటూ రికార్డులు కూడా



సృష్టించింది. రాహి అనిల్ బార్వే, ఆనంద్ గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో సోహమ్ షా ప్రధాన పాత్రలో నటించడంతో పాటూ స్వయంగా ఆయనే తుంబాడ్‌ను నిర్మించారు.

**తుంబాడ్2 లో భాగస్వామ్యమైన పెన్ స్టూడియోస్...** తుంబాడ్2 సినిమాను పెన్ స్టూడియోస్ తో కలిసి సోహమ్ షా నిర్మించనుండగా, 2026లో ఈ సినిమా ప్రారంభం కానుంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ సీక్వెల్ అందరికీ భారీ అంచనాలను క్రియేట్ చేసింది. మునుపటి కథకు మరిన్ని ట్విస్టులు, భారీ సస్పెన్స్ తో పాటూ అదిరిపోయే విజువల్స్ తో మేకర్స్ ఆడియన్స్ ను థ్రిల్ చేయడానికి రెడీ అవుతున్నారు.

**తుంబాడ్2 లో ప్రభాస్ హీరోయిన్...** ఇదిలా ఉంటే ఈ మూవీపై ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ నెట్టింట వైరల్ అవుతుంది.

బాలీవుడ్ బ్యూటీ, ప్రభాస్ తో కలిసి ఏక్ నిరంజన్ మూవీలో హీరోయిన్ గా నటించిన కంగనా రనౌత్ ఈ మూవీలో కీలక పాత్రలో నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ఈ విషయమై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఒకవేళ ఈ వార్త నిజమైతే తుంబాడ్2 కు మరింత క్రేజ్ పెరిగే ఛాన్సుంది

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536